జూన్-2026

# దర్శనమ్ ®

ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

₹ 51/- సంపుటి 22 సంచిక 9 ISSN 2582-2411














నేపాల్‌లో దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీ శారదాపీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖరభారతీ స్వామివారి ధర్మ విజయ యాత్ర.. నేపాల్ రాష్ట్రపతి ఆహ్వానం మేరకు ఖాట్మండులో రాష్ట్రపతి భవనం సందర్శన... నేపాల్‌లోని వివిధ క్షేత్రాలను ఆధ్యాత్మిక కేంద్రాలను సందర్శించి విశేష అర్చనలు చేసిన జగద్గురువులు.










అవధాన విద్యా వికాస పరిషత్ ఐదవ అవధాన పద్య శిక్షణ శిబిరం... నల్లాన్ చక్రవర్తుల సాహిత్ స్వర్ణావధానం .... ఉప్పలధడియమ్ భరతశర్మ ఏకదిన సంపూర్ణ శతావధానం





# అఘనాశక గాయత్రీస్తోత్రం



భక్తానుకంపిన్సర్వజ్ఞ హృదయం పాపనాశనం
గాయత్ర్యాః కథితం తస్మాద్గాయత్ర్యాః స్తోత్రమీరయ 1

ఆదిశక్తే జగన్మాతర్భక్తానుగ్రహకారిణి
సర్వత్ర వ్యాపికేఽనంతే శ్రీసంధ్యే తే నమోఽస్తు తే 2

త్వమేవ సంధ్యా గాయత్రీ సావిత్రీ చ సరస్వతీ
బ్రాహ్మీ చ వైష్ణవీ రౌద్రీ రక్తా శ్వేతా సితేతరా 3

ప్రాతర్బాలా చ మధ్యాహ్నే యౌవనస్థా భవేత్పునః
బ్రహ్మ సాయం భగవతీ చింత్యతే మునిభిః సదా 4

హంసస్థా గరుడారూఢా తథా వృషభవాహినీ
ఋగ్వేదాధ్యాయినీ భూమౌ దృశ్యతే యా తపస్విభిః 5

యజుర్వేదం పఠంతీ చ అంతరిక్షే విరాజతే
సా సామగాపి సర్వేషు భ్రామ్యమాణా తథా భువి 6

రుద్రలోకం గతా త్వం హి విష్ణులోకనివాసినీ
త్వమేవ బ్రహ్మణో లోకేఽమర్త్యానుగ్రహకారిణీ 7

సప్తర్షిప్రీతిజననీ మాయా బహువరప్రదా
శివయోః కరనేత్రోత్థా హ్యశ్రుస్వేదసముద్భవా 8

ఆనందజననీ దుర్గా దశధా పరిపఠ్యతే
వరేణ్యా వరదా చైవ వరిష్ఠా వరవర్ణినీ 9

గరిష్ఠా చ వరార్హా చ వరారోహా చ సప్తమీ
నీలగంగా తథా సంధ్యా సర్వదా భోగమోక్షదా 10

భాగీరథీ మర్త్యలోకే పాతాలే భోగవత్యపి
త్రిలోకవాహినీ దేవీ స్థానత్రయనివాసినీ 11

భూర్లోకస్థా త్వమేవాసి ధరిత్రీ లోకధారిణీ
భువో లోకే వాయుశక్తిః స్వర్లోకే తేజసాం నిధిః 12

మహర్లోకే మహాసిద్ధిర్జనలోకే జనేత్యపి
తపస్వినీ తపోలోకే సత్యలోకే తు సత్యవాక్ 13

కమలా విష్ణులోకే చ గాయత్రీ బ్రహ్మలోకగా బ్రహ్మలోకదా
రుద్రలోకే స్థితా గౌరీ హరార్ధాంగనివాసినీ 14

అహమో మహతశ్చైవ ప్రకృతిస్త్వం హి గీయసే
సామ్యావస్థాత్మికా త్వం హి శబలబ్రహ్మరూపిణీ 15

తతః పరాపరా శక్తిః పరమా త్వం హి గీయసే
ఇచ్ఛాశక్తిః క్రియాశక్తిర్జ్ఞానశక్తిస్త్రిశక్తిదా 16

గంగా చ యమునా చైవ విపాశా చ సరస్వతీ
సరయూర్దేవికా సింధుర్నర్మదేరావతీ తథా 17

గోదావరీ శతద్రుశ్చ కావేరీ దేవలోకగా
కౌశికీ చంద్రభాగా చ వితస్తా చ సరస్వతీ 18

గండకీ తాపినీ తోయా గోమతీ వేత్రవత్యపి
ఇడా చ పింగలా చైవ సుషుమ్నా చ తృతీయకా 19

గాంధారీ హస్తిజిహ్వా చ పూషాపూషా తథైవ చ
అలంబుషా కుహూశ్చైవ శంఖినీ ప్రాణవాహినీ 20

నాడీ చ త్వం శరీరస్థా గీయసే ప్రాక్తనైర్బుధైః
హృతపద్మస్థా ప్రాణశక్తిః కంఠస్థా స్వప్ననాయికా 21

తాలుస్థా త్వం సదాధారా బిందుస్థా బిందుమాలినీ
మూలే తు కుండలీ శక్తిర్వ్యాపినీ కేశమూలగా 22

శిఖామధ్యాసనా త్వం హి శిఖాగ్రే తు మనోన్మనీ
కిమన్యద్ బహునోక్తేన యత్కించిజ్జగతీత్రయే 23

తత్సర్వం త్వం మహాదేవి శ్రియే సంధ్యే నమోఽస్తు తే
ఇతీదం కీర్తితం స్తోత్రం సంధ్యాయాం బహుపుణ్యదం 24

మహాపాపప్రశమనం మహాసిద్ధివిధాయకం
య ఇదం కీర్తయేత్ స్తోత్రం సంధ్యాకాలే సమాహితః 25

అపుత్రః ప్రాప్నుయాత్ పుత్రం ధనార్థీ ధనమాప్నుయాత్
సర్వతీర్థతపోదానయజ్ఞయోగఫలం లభేత్ 26

భోగాన్ భుక్త్వా చిరం కాలమంతే మోక్షమవాప్నుయాత్
తపస్విభిః కృతం స్తోత్రం స్నానకాలే తు యః పఠేత్ 27

యత్ర కుత్ర జలే మగ్నః సంధ్యామజ్జనజం ఫలం
లభతే నాత్ర సందేహః సత్యం చ నారద 28

శృణుయాద్యోఽపి తద్భక్త్యా స తు పాపాత్ ప్రముచ్యతే
పీయూషసదృశం వాక్యం సంధ్యోక్తం నారదేరితం 29

**ఇతి శ్రీదేవీభాగవతే మహాపురాణే ద్వాదశస్కంధే**
**పంచమోఽధ్యాయే శ్రీఅఘనాశకగాయత్రీస్తోత్రం సంపూర్ణం**

# దర్శనమ్

ఆధ్యాత్మిక వార్తా మాస పత్రిక

**జూన్ 2026**

సంపుటి-22 విడిప్రతి: రూ. 51/- సంచిక - 9

ISSN 2582-2411    పేజీలు 68

**ఎస్ఆర్ఎస్ పబ్లికేషన్స్ ప్రచురణ**



స్ఫూర్తిప్రదాత

**కీ.శే. మరుమాముల రాజమౌళిశర్మ**

గౌరవ సంపాదకులు

**యాయవరం చంద్రశేఖరశర్మ, ఆర్.వి.వి. కృష్ణారావు**

**మరుమాముల దత్తాత్రేయశర్మ**

ప్రధాన సంపాదకులు

**మరుమాముల వెంకటరమణశర్మ**

ప్రచురణకర్త, సంపాదకులు

**మరుమాముల రుక్మిణి**

సంపాదక మండలి

**డా. పూర్ణప్రజ్ఞా భారతి, అష్టకాల రామ్మోహన్**

**ఆకెళ్ల విభీషణ శర్మ, బాచంపల్లి సంతోష్‌కుమార్‌శాస్త్రి**

**మరుమాముల రామచంద్రమూర్తి**

**ఆదరాసుపల్లి శశిధర్, ప్రసాదవర్మ కామఋషి**

ప్రత్యేక ప్రతినిధి

**పి.వి.ఎం. పవన్,** 81253 36958

ఉప సంపాదకులు

**రామలక్ష్మీ సుబ్రహ్మణ్యం**



website: darshanam.net

**దర్శనమ్**

ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక

**- : ప్రధాన కార్యాలయం : -**

ఇం.నెం. 29-105/4/1, శ్రీరామ సిద్ధాంతి భవనం

న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56

ఫోన్, ఫ్యాక్స్: 9441015469

e-mail: darshanameditordesk@gmail.com

మార్కెటింగ్: రైజింగ్ సన్ న్యూస్ ఏజెన్సీ, 9666680857


దర్శనం దర్శనారామ దర్శనం సమదర్శనం
దర్శనం లోక వృత్తాంతాదర్శ దర్శిన్యపేక్షితమ్ ॥
దర్శనాంతర్ముఖ స్పర్శి సద్విమర్శావమర్శనం
దర్శన ప్రతిభూస్థానం జీయాత్ సర్వ నిదర్శనమ్ ॥

**- అష్టకాల నరసింహరామశర్మ**

'దర్శనం దర్శితం యేన దర్శితం సర్వదర్శనమ్
దర్శనం శర్మసంధాతృ దర్శనం దైవదర్శనమ్'

**- అయాచితం నటేశ్వరశర్మ**

## ఈ సంచికలో ...


యమునా పుష్కర వైభవం ... 7
- చింతలపాటి శివశంకరశాస్త్రి

వేదస్వరూపిణి..జ్ఞానప్రదాయిని ... 10

పుడమితల్లి పండుగ.. ఏరువాక పౌర్ణమి ... 12
- చిల్లర సీతారామారావు

అపూర్వంగా ఐదవ అవధాన శిక్షణ శిబిరం ... 14
- ఉప్పలధడియం భరత్ శర్మ

ఏకదిన సంపూర్ణ శతావధానం ... 18

నేపాల్‌లో శృంగేరి జగద్గురువులు ... 20

రామేశ్వరంలో శివలింగాన్ని లంకకు వెళ్లేముందే... ... 21
- డా. ఇందారం శ్రీనివాసరావు

మహాతపస్వి చంద్రశేఖర భారతి ... 26
- చెఱుకుపల్లి జమదగ్ని శర్మ

సనాతన ధర్మం... సాధికారిక గ్రంథం ... 29
- తాడేపల్లి పతంజలి

మాధవీయ శంకర విజయం ... 32
- తాడేపల్లి పతంజలి

శ్రీమద్దేవీ భాగవతం - డా. వద్దిపర్తి పద్మాకర్ ... 34

మహాభారత సారసంగ్రహం ... 36
- కీ.శే. డా. పుల్లెల శ్రీరామచంద్రుడు

తిరుమల చరితామృతం - కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్ ... 39

రామాయణం రసరమ్యం ... 42
- వనం జ్వాలా నరసింహారావు

క్షయనామ సంవత్సరం... బార్హస్పత్యమానం ... 44
- డా. శంకరమంచి రామకృష్ణ శాస్త్రి

వేదాల్లో విజ్ఞానాంశాలు ... 48
- పోలిశెట్టి బ్రదర్స్

అభినవ శంకర విజయం ... 50
- మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి

శృంగేరి శారదాపీఠ వైభవం ... 56


ఇందులోని వ్యాసాలు, అందులోని భావాలు రచయితలవే. దానికి, దర్శనమ్ పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. - సంపాదకుడు

# తల్లిదండ్రుల్లో పరివర్తన.. పిల్లల్లో సత్ప్రవర్తన

“యద్యదాచరతి శ్రేష్ఠస్తత్తదేవేతరో జనః.. స యత్ప్రమాణం కురుతే లోకస్తదనువర్తతే!” సకల చరాచర సృష్టికి జీవన దిక్సూచి మన సనాతన ధర్మం. మానవ సంబంధాలకు, నైతికతకు పెద్దపీట వేసిన మహోన్నతమైన ఆర్ష సంస్కృతి మనది. శ్రీకృష్ణ పరమాత్మ భగవద్గీతలో ఉద్ఘాటించిన పై ధర్మ సూక్ష్మం నేటి సమాజానికి, మరీ ముఖ్యంగా తల్లిదండ్రులకు అత్యంత ఆవశ్యకమైన మార్గదర్శక సూత్రం. ఉత్తములు ఏది ఆచరిస్తారో సామాన్యులు దాన్నే అనుసరిస్తారని దీని భావం. కానీ, నేడు ఏ ఆదర్శాల పునాదుల మీద మన జాతీయ, ధార్మిక జీవనం నిర్మితమైందో.. ఆ పునాదులే కదులుతున్నాయన్నది నగ్న సత్యం. ఒకప్పుడు మన గడపలు ఉమ్మడి కుటుంబాలనే ఆశ్రమాలకు నిలయాలుగా వెలుగొందేవి. తాతయ్యల అనుభవాల కథలు, నానమ్మల లాలిపాటలు, పెద్దమ్మల వాత్సల్యం, పెదనాన్నల క్రమశిక్షణ మధ్య పిల్లలు ఒక పరిపూర్ణమైన మూర్తిమత్వంతో పెరిగేవారు. నేడా ఉమ్మడి కుటుంబ వ్యవస్థ మృగ్యమైపోయి, అపార్ట్‌మెంట్ల నాలుగు గోడల మధ్యే ప్రపంచం కుంచించుకుపోయింది.

ఉరుకుల పరుగుల యాంత్రిక జీవనంలో, నిరంతర ఆర్థిక వేటలో పడిన తల్లిదండ్రులు పిల్లలకు ‘భౌతిక సౌకర్యాలు’ ఇస్తున్నారు కానీ, అత్యంత విలువైన ‘సమయాన్ని’ ఇవ్వలేకపోతున్నారు. ఈ పెద్దల పర్యవేక్షణ లోపం కారణంగానే బాల్యంలోనే ఎందరో పసిమొగ్గలు పెడదారిన పడుతున్నారు. చేతిలో స్మార్ట్‌ఫోన్ అనే మాయాజాలం, ఇంటర్నెట్ కుప్పతొట్టిలో దొరికే కలుషిత వాతావరణం యువతను మానసికంగా నిర్వీర్యం చేస్తున్నాయి. పాశ్చాత్య వ్యామోహంలో పడి, వ్యసనాల పంకిలంలో కూరుకుపోయి ఉజ్వలమైన భవిష్యత్తును చేతులారా నాశనం చేసుకుంటున్నారు. ధర్మనిష్ఠ లోపించడం వల్లే సమాజంలో నేరాలు, ఘోరాలు ప్రబలుతున్నాయి. సామాజిక వ్యవస్థలన్నీ కేవలం వ్యాపారమయమై, నైతిక విలువలు పాతాళానికి పడిపోతున్న ఈ దుస్థితి ప్రతి ఒక్కరినీ కలచివేస్తోంది.


ఇక్కడ మనం తీవ్రంగా ఆత్మవిమర్శ చేసుకోవాల్సిన ఒక ఆశ్చర్యకరమైన విషయం ఉంది. ఖండాంతరాలు దాటి, భౌతికంగా అమెరికా, ఆస్ట్రేలియా, బ్రిటన్ లాంటి సుదూర పాశ్చాత్య దేశాల్లో స్థిరపడిన వారిలో అనేకమంది ప్రవాస భారతీయులు మన ఆర్ష సంస్కృతిని కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వారాంతాల్లో వారు తమ పిల్లల కోసం ప్రత్యేకంగా ‘బాల విహార్’ తరగతులు నిర్వహిస్తూ, భారతీయ ఆత్మను బతికిస్తున్నారు. అక్కడి దేవాలయాలను కేవలం పూజా మందిరాలుగానే కాకుండా, అద్భుతమైన సాంస్కృతిక కేంద్రాలుగా మలిచారు. తమ పిల్లలకు భగవద్గీత శ్లోకాలు, రామాయణ మహాభారతాల్లోని ధర్మ సూక్ష్మాలు, మాతృభాష అయిన తెలుగు, దేవభాష అయిన సంస్కృతం ఎంతో శ్రద్ధగా నేర్పిస్తున్నారు. వందల మైళ్ల దూరంలో, పూర్తి విభిన్నమైన వాతావరణంలో ఉంటూనే డాలర్లతో పాటు అమూల్యమైన “ధర్మ నిధిని” కూడా భావితరాలకు అందిస్తుంటే... పుణ్యభూమి అయిన భారతదేశంలో ఉండి మనం మన సంస్కృతిని ఎందుకు విస్మరిస్తున్నామన్నది నేడు మనల్ని మనం వేసుకోవాల్సిన ప్రశ్న.

పిల్లలు ఈ ఆధునిక కలుషిత వాతావరణానికి బలికాకుండా ఉండాలంటే, “ధర్మో రక్షతి రక్షితః” అన్న ఆర్యోక్తిని స్మరిస్తూ, ముందు మనం ధర్మాన్ని ఆచరించి రక్షించాలి, అప్పుడే ఆ ధర్మం మన పిల్లలను రక్షిస్తుంది. మన ఇల్లే తొలి దేవాలయం కావాలి, తల్లిదండ్రులే తొలి గురువులుగా నిలవాలి. పిల్లలకు కేవలం నీతులు చెప్పడం కాదు, మనం నీతిగా బ్రతికి చూపించినప్పుడే వారు అనుకరిస్తారు. ఇంట్లో నిత్య పూజ, దీపారాధన లాంటి సత్కర్మలు చేయడం ద్వారా గృహమంతా ఒక పవిత్రమైన ఆధ్యాత్మిక వాతావరణాన్ని సంతరించుకుంటుంది. నిద్రపోయే ముందు ఎలక్ట్రానిక్ సాధనాలను పక్కనపెట్టి, ప్రహ్లాదుడు, ధ్రువుడు, మార్కండేయుడు, అభిమన్యుడు లాంటి పౌరాణిక మూర్తుల కథలను పిల్లలకు చెప్పాలి. మన పండుగల వెనుక ఉన్న శాస్త్రీయ, సామాజిక విశేషాలను వారికి విడమర్చి చెప్పాలి. సెలవు దినాల్లో కేవలం వినోద కేంద్రాలకే పరిమితం కాకుండా, పురాతన దేవాలయాలకు, గోశాలలకు, అనాథ ఆశ్రమాలకు తీసుకువెళ్లి, తోటివారికి సహాయం చేసే దానగుణాన్ని వారిలో నాటాలి.

సంస్కారం లేని చదువు, సువాసన లేని కాగితం పువ్వు లాంటిదని పెద్దల నానుడి. ఏ దేశమైనా భౌతికంగా ఎంత విపరీతంగా అభివృద్ధి చెందినా, నైతికంగా పతనమైతే ఆ జాతికి మనుగడ ఉండదు. ఆధునికతను ఆహ్వానిద్దాం.. కానీ మన ఆత్మను, అస్తిత్వాన్ని అమ్ముకోకుండా చూసుకుందాం. మన ఆర్ష సంస్కృతి ఒక మహా వృక్షం, దాని వేళ్లే మన నైతిక, కుటుంబ విలువలు. ఆ వేళ్లకు మన ఆచరణ అనే పవిత్ర జలాలను పోసి కాపాడుకుందాం. రేపటి పౌరులను ధర్మబద్ధమైన సన్మార్గంలో నడిపిస్తూ... “కృణ్వంతో విశ్వమార్యం” (విశ్వమంతటినీ శ్రేష్ఠమైనదిగా తీర్చిదిద్దుదాం) అన్న వేదవాక్కును నిజం చేసే దిశగా ప్రతి అడుగూ వేద్దాం. ■

# పాఠక దర్శిని

మీ అభిప్రాయాలను darshanameditordesk@gmail.comకు పంపగలరు.




## మహాభక్తుడి వ్యాసం ఆకట్టుకుంది

దాస్యభక్తికి ప్రతిరూపం... అహంకారం ఎరుగని మహాజ్ఞాని.. చిరంజీవి... మహావీరుడు అయిన ఆంజనేయ స్వామి గురించి 'అతుల భక్తికి, అమితశక్తికి ఆదర్శమూర్తి' శీర్షికన ఇచ్చిన వ్యాసం అలరించింది. తను కొలిచే స్వామిని హృదయంలోనే ప్రతిష్ఠించుకున్న మహాభక్తుడు ఆయన అని తెలియజేస్తూ సవివరంగా తెలియజేశారు. రచయితకు ధన్యవాదాలు. కర్మఫలాలను ప్రసాదించే శనైశ్చర భగవానుని జయంతి సందర్భంగా ఇచ్చిన విశేష వ్యాసం బాగుంది. న్యాయస్వరూపుడైన శనైశ్చరుడుపై ఉన్న అపోహలను తొలగిస్తూ నిష్కారణంగా ఆయన ఎవరినీ బాధించడని, ఆయన కరుణ ఎలా పొందాలో వివరిస్తూ చాలా మంచి వ్యాసం అందజేశారు.

**- నందుల గాయత్రి, హైదరాబాద్**

## ఆలోచింపజేసే సంపాదకీయం

'గురువునే పరీక్షించిన శిష్యుడు' శీర్షికన రచయిత గోపాలకృష్ణ గారి వ్యాసం ఎంతో బాగుంది. పేదరికంలో ఉంటూ కూడా సమాజ శ్రేయస్సును కోరే బ్రాహ్మణుడిని 'అగ్రవర్ణ అహంకారి'గా ముద్ర వేయడం రాజకీయ కుతంత్రం అని తెలియజేసే సంపాదకీయం 'ఆర్షధర్మ విధ్వంసమే అసలు లక్ష్యం' ఆలోచింపజేసేదిగా ఉంది. 'ప్రజాస్వామ్య విలువలకు ఇతిహాసాలే ఆయువుపట్టు' వ్యాసం బాగుంది. మహాభారత సారసంగ్రహం, తిరుమల చరితామృతం, 'గిని-అద్వైత గని', రామాయణం, శ్రీమద్దేవీభాగవతం, ఆర్షధర్మంపై అన్యుల విషం ధారావాహికలు ఆసక్తిదాయకంగా ఉంటున్నాయి.

**- మల్లాది కామేశ్వరి, గుంటూరు**

## అలరించిన సంకీర్త్య శర్మ అవధానం

'దర్శనమ్' ప్రతి నెలా ఒక అవధాన కార్యక్రమాన్ని నిర్వహించడం ముదావహం. పిన్న వయసులోనే సంకీర్త్య శర్మ చేసిన అవధాన విశేషాలను తెలియజేస్తూ కళ్లకు కట్టినట్టుగా చక్కని వ్యాసాన్ని అందించారు. అలాగే శంకర జయంతి కార్యక్రమాన్ని దర్శనమ్ కార్యాలయంలో నిర్వహించడమే కాకుండా చిన్న పిల్లలకు ఆదిశంకరుల వేషధారణ చేయడం ఆకట్టుకుంది. మంచి సంప్రదాయాలను, సంస్కృతులను జనంలోకి వ్యాపింపజేస్తున్న ఆధ్యాత్మిక వార్తా మాసపత్రికకు అభినందనలు. నిజమైన జీవితం అంటే విలువలతో జీవించడం అని చెప్పిన 'ఆధ్యాత్మిక స్పర్శ లేని జీవితం...' వ్యాసం బాగుంది.

**- రవికుమార్, సంగారెడ్డి**

### 'దర్శనమ్' చందా వివరాలు

| | |
|---|---|
| 3 సంవత్సరాలకు | రూ. 2000 |
| 6 సంవత్సరాలకు | రూ. 4000 |
| 12 సంవత్సరాలకు | రూ. 8000 |
| రాజపోషకులు | రూ. 15000 |
| మహారాజ పోషకులు | రూ. 25000 |
| విశిష్ట మహారాజ పోషకులు | రూ. 100000 |

A/C NAME : DARSHANAM
BANK: CANARA BANK
A/C NO. 120001974779
IFSC CODE: CNRB0013063

## చందాదారులకు విజ్ఞప్తి

'దర్శనమ్' ధార్మికోద్యమ మాసపత్రిక సనాతన ధర్మ పరిరక్షణే లక్ష్యంగా వెలువడతున్న ఈ పత్రికకు చందాలు, విరాళాలు అందించవలసిందిగా ప్రార్థన. ఈ నెలతో ముగియనున్న తమ చందాలను వెంటనే పునరుద్ధరించుకో వలసిందిగా మనవి. **ఎడిటర్, దర్శనమ్** పేరుతో చెక్కు/డిడి/మనియార్డర్/ ఆన్‌లైన్‌లో చందాలను పంపాల్సిందిగా విజ్ఞప్తి. మీరు ప్రత్యుత్తరాలు జరిపేటప్పుడు చిరునామాలను స్పష్టంగా పిన్‌కోడ్‌తో సహా రాయవలసిందిగా కోరుతున్నాం. చిరునామా మారితే తక్షణం తెలియజేయండి. **- ఎడిటర్**



# యమునా పుష్కరవైభవం

సూర్యపుత్రికగా, యమధర్మరాజు సోదరిగా పురాణాల్లో కీర్తించబడిన పవిత్ర యమునా నదికి పన్నెండేళ్లకోసారి జరిగే మహా కుంభమేళాయే 'యమునా నది పుష్కరాలు'. దేవగురువైన బృహస్పతి కర్కాటక రాశిలో ప్రవేశించిన పుణ్య తరుణంలో ఈ జీవనదికి పన్నెండు రోజుల పాటు పుష్కర మహోత్సవాలు అత్యంత వైభవంగా జరుగుతాయి. శ్రీకృష్ణ పరమాత్మ బాల్యక్రీడలకు, రాధాకృష్ణుల ప్రణయ మాధుర్యానికి సజీవ సాక్ష్యంగా నిలిచిన యమునా తీరం ఈ పర్వదినాల్లో కనీవినీ ఎరుగని ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంటుంది. యమధర్మరాజు స్వయానా యమునకు సోదరుడు కావడంతో, ఈ పుష్కర సమయంలో యమునలో స్నానమాచరిస్తే అపమృత్యు దోషాలు తొలగిపోయి యమబాధల నుంచి విముక్తి లభిస్తుందని భక్తుల ప్రగాఢ విశ్వాసం. దేశం నలుమూలల నుంచి తరలివచ్చే సాధువులు, నాగసాధువులు, పీఠాధిపతులు, లక్షలాది భక్తులతో బృందావనం, మధుర లాంటి పుణ్యక్షేత్రాలు కిటకిటలాడుతాయి. పవిత్ర పుణ్యస్నానాలు, పితృ దేవతలకు తర్పణాలు, నదీమతల్లికి సమర్పించే దీపదానాలతో యమునా తీరం నయనానందకరంగా మారుతుంది. ముఖ్యంగా సాయంసంధ్య వేళలో పండితులు శంఖనాదాలు, వేదమంత్రోచ్ఛారణల నడుమ నిర్వహించే 'మహా హారతి' దృశ్యం చూపరులకు అద్భుతమైన దివ్యానుభూతిని కలగజేస్తుంది. సంస్కృతీ, సంప్రదాయాల కలబోతగా సాగే ఈ మహోత్సవం భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటుతూ భారతీయ ఆధ్యాత్మిక ఔన్నత్యాన్ని దశదిశలా వ్యాప్తి చేస్తుంది. కేవలం పాపప్రక్షాళనే కాకుండా, జీవనదుల పవిత్రతను కాపాడుకోవాలనే పర్యావరణ స్పృహను, సామాజిక బాధ్యతను సైతం ఈ పండుగ మనలో మేల్కొల్పుతుంది. మురళీధరుని వేణుగాన తరంగాలను తన అలల్లో నిక్షిప్తం చేసుకున్న యమునమ్మ ఒడిలో భక్తితో మునకవేసి, జన్మను ధన్యం చేసుకోవడానికి భక్తులందరికీ ఈ పుష్కరాలే అత్యుత్తమ తరుణం.

"పంకజాసన శక్ర శంకర పూజితాంఘ్రి సరోరుహమ్
దేవదానవ సిద్ధసాధ్య నరాది భావిత వైభవమ్
సంకటోత్తరణోజ్జ్వల ద్రుచితోషితాఖిల సేవకమ్
వేంకటేశ్వర పాదపంకజ మాశ్రయే నిఖిలాశ్రయమ్"

జ్యేష్ఠ, ఆషాఢ మాసములు గ్రీష్మ ఋతువు. సూర్యుడు తన కిరణాలతో భూమిని తపింపజేస్తాడు. ఎండలు ఎక్కువవుతాయి. ఈ కాలంలో గొడుగు, చెప్పులు దానం చేయాలి. జలం ఉద్భవించిన తరువాతే జీవం పుట్టింది. జలధారల వెంటే నాగరికత విస్తరించింది. అలాంటి జలాన్ని దేవతగా పూజించడం, ఆరాధించడం హిందువుల సంప్రదాయం. సముద్రాలు, నదులు, చెరువులు, తటాకాలు, బావులు... జలములకు తావులు. నదీ స్నానాలు, కోనేటి స్నానాలు, సముద్ర స్నానాలు, మంగళస్నానాలు... ఇవి హిందూ సంప్రదాయంలో భాగం. నదులలో స్నానం చేసినప్పుడు పాపాలన్నీ హరించుకుపోతాయి. అంతేకాక జలానికి ఉత్తేజాన్ని కలిగించే శక్తి కూడా ఉంది. అన్ని ఋతువులలోనూ ఎండిపోకుండా జలాలతో ప్రవహించే నదులను జీవనదులు అంటారు. గంగ, నర్మద, సరస్వతి, యమున, గోదావరి, కృష్ణ, కావేరి, భీమరథి, బ్రహ్మపుత్ర, తుంగభద్ర, సింధు, ప్రణీత... ఇవి జీవ నదులు.

### యమునా పుష్కరం ఎప్పుడు?

గురువు పన్నెండు రాశులలో సంచరించే సమయంలో ఆయా నదులకు పుష్కరాలు ఏర్పడతాయి. పుష్కర మంటే 12 సంవత్సరాలు. ఒక్కో ఏడాది ఒక్కో రాశిలో గురువు ప్రవేశించినప్పుడు ఆయా నదులకు పుష్కరాలు వస్తాయి. ఈ సమయంలో గురువు, పుష్కరుడు, మూడు కోట్ల దేవతలు ఆయా నదిలో కొలువై ఉంటారు. గురువు కర్కాటక రాశిలో ప్రవేశించినప్పుడు యమునా నదికి పుష్కరం వస్తుంది. ఈ ఏడాది జూన్ 1వ తేదీ రాత్రి గురువు కర్కాటక రాశిలోకి ప్రవేశిస్తున్నాడు. కనుక జూన్ 2వ తేదీ నుంచి యమునా నదికి పుష్కరాలు. ఈ రోజు నుంచి 12 రోజుల పాటు ఈ నదికి పుష్కరాలు ఈ సమయంలో చేసే స్నానం, దానం ఎంతో విశేషమైనవి.



చింతలపాటి శివశంకరశాస్త్రి

## ప్రముఖ పుష్కర క్షేత్రాలు

యమునా నది ప్రవహించే ఉత్తర భారతదేశంలోని పలు ప్రముఖ పుణ్యక్షేత్రాలు ఈ సంరంభానికి వేదికలవుతాయి. యమునోత్రి యమునా నది జన్మస్థలం, హిమాలయాలలోని పవిత్ర క్షేత్రం. మథుర-బృందావనం శ్రీకృష్ణుని లీలా స్థలాలు. ఇక్కడి విశ్రాం ఘాట్ వద్ద పుష్కరాలు ఎంతో వైభవంగా జరుగుతాయి. ప్రయాగరాజ్ (అలహాబాద్)- గంగ, యమున, సరస్వతి నదుల త్రివేణి సంగమ స్థానం. ఇక్కడ స్నానానికి అత్యంత ప్రాధాన్యత ఉంది.



యమునా నది అతి ప్రాచీనమైనది. ఋగ్వేదం, అధర్వణ వేదం, శతపథ, ఐతరేయ, షడ్వంశ, బ్రహ్మణాలలోనూ ఈ నదిని వర్ణించారు. యమునా నదిని శమనస్వస్థా, కాళిందీ అనే పేర్లతోనూ పిలుస్తారు. యమునా నది ఆవిర్భావం వెనుక అనేక పురాణ కథలు ఉన్నాయి.

సంపూర్ణ జగత్తుకు ఆధారభూతుడైన సూర్యుని కుమార్తె యమున. ఈమె తల్లి సంజ్ఞ. సంజ్ఞాదేవి సూర్యుని తేజస్సు చూడలేక కళ్లు మూసుకుంటుంది. అందుకు కోపించిన సూర్యుడు నిఖిలజనైక సంయముడగు ఒక కుమారుడు జన్మిస్తాడు అని చెబుతాడు. దాని కారణంగా ధర్మం తప్పిన వారిని శిక్షించే యముడు జన్మిస్తాడు. తర్వాత కొంత కాలానికి సూర్యుడు తిరిగి సంజ్ఞను సమీపించినప్పుడు చంచల దృష్టితో చూడగా, సూర్యుడు కోపించి... ఈసారి నీకు విలోలమైన

కూతురు కలుగుతుందని అంటాడు. తత్ఫలితంగా చంచలమైన యమున జన్మిస్తుంది. 'కళింద' పర్వతము నందు పుట్టడం వల్ల యమునకు కాళింది అనే పేరు వచ్చింది.

శ్రీకృష్ణుడు గోవులను, గోపబాలురను ఇంద్రుని బారి నుంచి కాపాడుకొనే నిమిత్తం గోవర్ధన పర్వతాన్ని ఎత్తుతాడు. ఆ పర్వతం కింద గోవులు, గోపాలురు ఇంద్రుని నుంచి రక్షణ పొందుతారు. ఆ స్థలానికి దగ్గరలోనే



యమునా నది ఒక పాయగా చీలి పెద్ద ఒంపు తిరిగింది. దీనికి కారణమేమంటే ఒకసారి బలరాముడు వ్రేపల్లె యందు ఉండి అందరితో ఆడుతూ, పాడుతూ దప్పిగొని కాళిందిని తన సమీపానికి రమ్మని అడుగగా అందుకు ఆమె బదులివ్వలేదు. బలరాముడు కోపించి హలాయుధంచే ఛేదించి నూరు పాయలుగా ప్రవహించునట్లు శపించాడు. సహజంగా యమునా నది నీరు నల్లగా ఉంటుంది. అందులోని నీరు తెల్లగా అయ్యాయని పురాణోక్తి.

### స్నాన విధి...

యమునా తీరాన ఉన్న బృందావనంలో 32 తీర్థఘట్టా లున్నాయి. ఈ తీర్థాలలో స్నానం పుణ్యప్రదం. పుష్కర సమయంలో చేసే స్నానం దివ్య స్నానం. అందుచేత ముందుగా ఇంటి వద్ద స్నానం చేసి శుభ్రమైన వస్త్రాలను ధరించి పుష్కర స్నానానికి వెళ్లాలి. సంకల్ప పూర్వకంగా స్నానమాచరించి, మూడు దోసిళ్ల నీళ్లు అర్ఘ్యప్రదానంగా పోయాలి. అనంతరం వెండి లోహాలతో కూడిన పుష్కర ప్రతిమను, వస్త్రాలు, లవణం, గోవులు, రత్నాలు దానం చేసినట్లయితే ఇంద్ర భోగం, వసు లోకం ప్రాప్తిస్తుంది. వీలున్నవారు షోడశ మహాదానాలుచేసి, బ్రాహ్మణ సమారాధన చేస్తే అనంతకోటి పుణ్యఫలితాన్ని పొంది, ఉత్తమలోక ప్రాప్తి కలుగుతుంది.

### చేయకూడనివి...

పుష్కర సమయంలో నదిలో మూడు కోట్ల దేవతలు కొలువై ఉంటారు. కావు నదీ తీరంలో కాని, నీటిలో కాని ఉమ్మి వేయడం, మల మూత్రాలను విసర్జించడం చేయ రాదు. అలా చేస్తే అది మహాదోషం. నగ్నంగా, అర్ధనగ్నంగా స్నానం చేయరాదు. మగవారు పంచె, ఉత్తరీయం, స్త్రీలు సంప్రదాయ





దుస్తులు ధరించి స్నానం చేయాలి. సబ్బులు, షాంపూలు వాడకూడదు. బట్టలు ఉతకకూడదు. తడి బట్టలతో పూజా కార్యక్రమాలు చేయరాదు. నదీ జలాలను అపవిత్రం చేయకూడదు.

నది పట్ల పవిత్ర భావంతో మెలగాలి. స్నానం చేసిన తరువాత కొంచెం మట్టి తీసి నదిలో వేయాలి, లేకపోతే స్నానఫలం దక్కదని పెద్దలు చెబుతారు. స్నానం తరువాత ప్రార్థనా శ్లోకాలను చదువుతూ ప్రవాహానికి ఎదురుగా, వాలుగా, తీరానికి పరాఙ్ముఖంగా కుడి చేతి బొటన వేలుతో నీటిని కదిలించి, మూడు దోసిళ్ల నీళ్లు తీరానికి చల్లాలి. నదీమ తల్లికి పసుపు, కుంకుమలను సమర్పించాలి. తరువాత తీరానికి చేరి తడి బట్ట లను పిండుకోవాలి. తరువాత పొడి బట్టలు కట్టుకుని, సంధ్యా వందనాదులను ఆచరించాలి. నదీ తీరంలోని దేవాలయాలను సందర్శించి, అర్చించాలి. భక్తులు ప్రమిదల్లో దీపాలు వెలిగించి నదిలో వదలడం (నదీ దీపదానం) ఈ సంరంభంలో ఒక సుందర దృశ్యం. తమ వంశంలోని పితృదేవతలకు మోక్షం కలగడం కోసం నదీ తీరంలో పిండప్రదానాలు, తర్పణాలు ఇవ్వాలి.

నదీనదాలు మానవాళికి జీవ నాధారాలు. అటువంటి జీవనదుల పట్ల భక్తిప్రపత్తులు కలిగి, ఋషులు బోధించిన సంస్కృతీ సంప్ర దాయాలను, ఆచార వ్యవహారాలను ఆచరిద్దాం. మన మనసులను పవిత్రం గావించుకుని చరితార్థుల మవుదాం. ■



# వేదస్వరూపిణి జ్ఞాన ప్రదాయిని

**సమస్త వేదాల సార స్వరూపిణి, సకల చరాచర సృష్టికి మూలశక్తి అయిన గాయత్రి అమ్మవారు చతుర్వేదాలకు జననిగా, జ్ఞానభిక్షను ప్రసాదించే సాక్షాత్తూ వేదమాతగా పూజలందుకుంటున్నారు. గాయత్రి, సావిత్రి, సరస్వతి అనే త్రిశక్తుల ఐక్య రూపమై, సకల దేవతా శక్తులను తనలో నిలుపుకున్న సర్వదేవతా స్వరూపిణి అయిన ఆమె, అజ్ఞానమనే చీకట్లను పారద్రోలి సాధకులలో సద్బుద్ధిని, నిర్మలమైన వివేకాన్ని జాగృతం చేసే జ్ఞాన జ్యోతి స్వరూపం. ముత్యం, పగడం, బంగారం, నీలం, తెలుపు రంగులతో ప్రకాశించే ఐదు ముఖాలతో, పది కళ్లతో విశ్వాన్ని వీక్షించే పంచముఖాల దివ్య తేజస్సు గల అమ్మవారు, ఉచ్ఛరించినంతనే పాపాలను పరిహరించే పరమ పవిత్ర గాయత్రీ మహామంత్ర స్వరూపిణిగా వెలుగొందుతున్నారు. సూర్యమండల మధ్యవర్తినిగా, సూర్యునిలోని తేజస్సుకి మూలశక్తిగా వెలిగే ఈ జగన్మాత, సంసార సాగరాన్ని దాటించి మోక్ష మార్గాన్ని సుగమం చేసే పరమ పావన ముక్తిప్రదాయిని. కేవలం ఆధ్యాత్మిక శక్తి మాత్రమే కాక, బుద్ధిని, ప్రతిభను ఉద్దీపింపజేసే సద్బుద్ధి ప్రదాత అయిన గాయత్రి దేవి, నిత్యం ఉదయ సంధ్యలో హంస వాహనై, బ్రహ్మ స్వరూపిణిగా సృష్టి చైతన్యాన్ని రగిల్చే ఆదిశక్తి. విశ్వమంతటా ప్రాణశక్తిగా నిండియుండి, తనను నమ్మిన భక్తులను కంటికి రెప్పలా కాపాడే కరుణామయి, అభయప్రదాయిని అయిన అమ్మవారి దివ్య వైభవం వర్ణనాతీతం. గాయత్రీ మాత జయంతి సందర్భంగా ఈ ప్రత్యేక వ్యాసం.**

సకల వేదరాశులకు మూలకందమై, సృష్టిలోని సమస్త చైతన్యానికి ప్రాణదాతయై విరాజిల్లే పరమ పావన మూర్తి గాయత్రీ మాత. అజ్ఞానమనే కటిక చీకట్లను పటాపంచలు చేస్తూ, మానవ కోటికి జ్ఞానపు వెలుగులను ప్రసాదించే దివ్య స్వరూపిణి ఆమె. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరులనే త్రిమూర్తుల తేజస్సుతో, అఖిల బ్రహ్మాండాలకు మాతృమూర్తిగా, 'వేదమాత'గా నిత్య పూజలందుకుంటున్న గాయత్రీ దేవి వైభవం వర్ణనాతీతం. బుద్ధి కుశలతను, ఆత్మజ్ఞానాన్ని ప్రసాదించే ఆ పరాశక్తిని స్మరించడమే సకల పాపహరణం, సర్వ శుభప్రదం.

గాయత్రీ మంత్రం అక్షరమాలా స్వరూపంగా మాత్రమే కాక, అద్భుతమైన శబ్దబ్రహ్మ స్వరూపంగా విరాజిల్లుతోంది. మహాతపస్వి అయిన విశ్వామిత్ర మహర్షి లోకకల్యాణార్థం తన కఠోర తపస్సు ద్వారా దర్శించిన మహా మంత్రం ఇది. ఋగ్వేదంలో ప్రస్తావించబడిన ఈ మంత్రరాజం ప్రధానంగా సవితృ దేవుని, అనగా సమస్త జగత్తుకు వెలుగునిచ్చే సూర్య భగవానుని ఉపాసిస్తూ చేసే అత్యున్నత ప్రార్థన. ఆ సవితృ దేవుని శ్రేష్ఠమైన తేజస్సును మేము ధ్యానిస్తున్నాము, ఆ దేవుడు మా బుద్ధిని సన్మార్గంలో ప్రేరేపించుగాక అన్నది ఈ మంత్రం అంతరార్థం. ఇది కేవలం అక్షరాల కలయిక కాదు, ప్రాణశక్తిని మేల్కొలిపి, మానసిక వికాసాన్ని కలిగించే ఒక దివ్య ప్రకంపన. మనిషిలోని మేధస్సును, విచక్షణా జ్ఞానాన్ని రగిలించే అద్భుత యోగ సాధన.








ప్రాచీన శిల్పకళా ఆగమాలు, ధ్యాన శ్లోకాలు గాయత్రీ దేవి స్వరూపాన్ని అత్యంత సుందరంగా, తాత్వికంగా వర్ణించాయి. అద్భుతమైన శిల్ప సంపదగా మలచబడిన అమ్మవారి రూపాన్ని నిశితంగా పరిశీలిస్తే, ఆ తల్లి పంచముఖాలతో, దశ హస్తాలతో వికసించిన పద్మంపై ఆసీనురాలై అసమానమైన దివ్య కాంతితో దర్శనమిస్తుంది. ముక్తా (ముత్యం), విద్రుమ (పగడం), హేమ (బంగారం), నీల, ధవళ (తెలుపు) వర్ణాల్లో భాసించే ఆ ఐదు ముఖాలు ప్రకృతిలోని పంచ భూతాలకు, మానవ శరీరంలోని పంచ ప్రాణాలకు సజీవ సాక్ష్యాలు. శంఖం, చక్రం, కమలం, గొడ్డలి, పాశం, అంకుశం తదితర ఆయుధాలను ధరించిన ఆ పది చేతులు సకల దుష్ట శక్తుల సంహారానికి, నిరంతర జ్ఞాన ప్రదానానికి సంకేతాలుగా నిలుస్తాయి. అమ్మవారి ప్రతి అలంకారం వెనుక ఒక అపారమైన వేదాంత రహస్యం దాగి ఉంటుంది.

అహోరాత్రుల ఆవృత్తంలో గాయత్రీ మాతను త్రిసంధ్యల్లో మూడు విభిన్నమైన, ప్రకాశవంతమైన రూపాల్లో ఆరాధించడం సనాతన ధర్మంలో అనాదిగా వస్తున్న సంప్రదాయం. ప్రాతః కాలంలో బ్రహ్మ స్వరూపిణిగా, హంస వాహనంపై ఎరుపు రంగులో దర్శనమిచ్చే 'గాయత్రి'గా సృష్టికి సంకేతంగా పూజ లందుకుంటుంది. మధ్యా హ్నసమయాన విష్ణు స్వరూ పిణిగా, గరుడ వాహనారూఢయై శంఖుచక్రాలను ధరించిన 'సావిత్రి'గా, జగత్ స్థితికారకు రాలిగా రక్షణ భారాన్ని వహిస్తుంది. ఇక సాయంకాలాన వృషభ వాహనంపై ఆసీనురాలై, శివ స్వరూపిణియైన 'సరస్వతి'గా, లయకారక శక్తికి, అనంత జ్ఞానానికి ప్రతీకగా ఆరాధించబడుతుంది. ఇలా ఒకే పరాశక్తి వివిధ రూపాల్లో తన ఉపాసకులకు అభయ మిస్తూ అనుగ్రహాన్ని ప్రసాదిస్తుంది.

గాయత్రీ ఆరాధన అనేది కేవలం బాహ్య ఆచారాలకే పరిమితమైనది కాదు, అది అంతరంగ శుద్ధికి బాటలు వేసే ఒక అద్భుత రాజ మార్గం. నిత్యం నిశ్చల భక్తిశ్రద్ధలతో, ఏకాగ్రతతో గాయత్రీ మంత్ర జపం చేయడం వల్ల మనిషిలోని అరిషడ్వర్గాలు నశించి, మనస్సు అనిర్వచనీయమైన ప్రశాంతతను సంతరించుకుంటుంది. దైనందిన జీవితంలో ఎదురయ్యే సవాళ్లను, ఆటంకాలను స్థితప్రజ్ఞతతో ఎదుర్కొనే అపార మైన ఆత్మబలం సిద్ధిస్తుంది. ఈ వేద మాత ఉపాసన ద్వారా సాధకుడు తన లోని దివ్యత్వాన్ని స్వయంగా అనుభూతి చెంది, లౌకిక బంధాల నుండి క్రమంగా విముక్తుడై, అంతిమంగా మోక్ష పదాన్ని చేరుకుంటాడన్నది చారిత్రక, పౌరాణిక సత్యం. సమస్త జీవకోటి పట్ల కరుణను కురిపించే గాయత్రీ దేవి చల్లని చూపులే ఈ చరాచర జగత్తుకు శ్రీరామరక్ష. ■




**తొలకరి జల్లుల మట్టి పరిమళాల సాక్షిగా, భారతీయ రైతాంగం అన్నదాతగా తన పవిత్ర కర్తవ్యాన్ని పునఃప్రారంభించే మహోన్నత పండుగే 'ఏరువాక పౌర్ణమి'. జేష్ఠ మాసపు నిండు పున్నమి వెన్నెల్లో, పచ్చని పంటలకు ప్రాణం పోసేందుకు సిద్ధమయ్యే రైతన్నకు వ్యవసాయ పనులకు నాంది పలికే తొలి వేడుక ఇది. ఈ పర్వదినాన కర్షకులు వేకువజామునే నిద్రలేచి, తమకు సాగులో వెన్నెముకగా నిలిచే బసవన్నలను శుభ్రంగా కడిగి, కొమ్ములకు సప్తవర్ణాలు పూసి, మెడలో గలగలలాడే మువ్వల పట్టీలు కట్టి సర్వాంగ సుందరంగా ముస్తాబు చేస్తారు. కన్నతల్లి లాంటి భూమాతకు, కరుణించే వరుణ దేవుడికి కృతజ్ఞతాంజలులు ఘటించి, సాగుకు ఉపయోగపడే నాగలికి, ఇతర వ్యవసాయ పనిముట్లకు భక్తిప్రపత్తులతో పసుపు కుంకుమలతో పూజలు నిర్వహిస్తారు. అనంతరం మంగళ వాయిద్యాల ఆనందపు హోరు నడుమ పొలానికి వెళ్లి, లాంఛనంగా 'తొలి దుక్కి' దున్ని అత్యంత ఉత్సాహంగా ఏరువాకను ప్రారంభిస్తారు. తెలుగు రాష్ట్రాల గ్రామీణ ప్రాంతాల్లో ఒక సామాజిక మహోత్సవంలా జరిగే ఈ ఘట్టం... ప్రకృతికి, మనిషికి, మూగజీవాలకు మధ్య ఉన్న అనంతమైన అవినాభావ బంధానికి సజీవ సాక్ష్యంగా నిలవడమే కాకుండా, రైతన్నలు తమ గత కష్టాలను మర్చిపోయి కోటి కొత్త ఆశలతో ఏరువాక సాగే అత్యంత స్ఫూర్తిదాయకమైన సుదినం.**

'కోటి విద్యలు కూటి కొరకే' అనేది సామెత. ప్రతి ఒక్కరూ రాత్రింబవళ్లు ఆహారం కొరకే శ్రమిస్తుంటారు. జీవనానికి ఆధారమైన ఆహార మును మనకు అందించే దైవం రైతు. ఆ రైతుకు ఇష్టమైన పండుగలు రెండు. మొదటిది సంక్రాంతి. రెండవది ఏరువాక. సంక్రాంతికి పంటలు పుష్కలంగా పండి రైతు గృహానికి చేరుకుంటాయి. కనుక రైతు ఆనందంగా ఆ పండుగను జరుపుకుంటాడు. రెండవది- ఏరువాక. ఈ పదానికి అర్థం దుక్కి ప్రారంభం అని. జ్యేష్ఠమాస పున్నమి రోజున ఏరువాక పండుగ వస్తుంది. ఆ రోజు వ్యవసాయ పనిముట్లను, ఎద్దులను, వ్యవసాయ పనిముట్లను పూజించి వ్యవసాయ పనులు ప్రారంభించడానికి పూనుకుంటారు రైతులు.

మృగశిర కార్తెతో ముంగిళ్లు చల్లబడతాయి. ఆపై ఆరుద్ర కార్తె అదను వాన. వ్యవసాయానికి అనువైన కాలం. వర్షాలు కురిసి భూమి పదునైనప్పుడు పునాస విత్తనాలు నాటుతారు. పునాసలు

అనగా సూర్యుడు పునర్వసు నక్షత్రంలో ఉండగా విత్తిన సజ్జలు మొదలగు ధాన్యాలు. ఏరువాక పర్వం నాడు రైతులు వేకువఝామునే లేచి స్నానాదికాలు పూర్తి చేసుకుంటారు. పిదప పశువుల కొట్టాలను శుభ్రపరిచి, వృషభాలను కడిగి, వాటి కొమ్ములకు రంగులు పూస్తారు. వాటికి గజ్జెలు, గంటలు కడతారు. కాడిని, నాగలిని శుభ్రంగా కడిగి రంగులు వేస్తారు. భక్తిభావంతో వాటిని పూజించి, పొంగలిని వండించి, వృషభాలకు తినిపిస్తారు. వాటికి ధూపదీపాలను సమర్పిస్తారు. సాయంకాలం నాగళ్లను, గొర్రులను భుజములపై పెట్టుకొని, మంగళ వాయిద్యాలతో ఎద్దులను ఊరేగిస్తూ తమ పొలాలకు వెడతారు. పొలంలో నాగళ్లను పూజించి, దుక్కిని దున్నడం ఆరంభిస్తారు. గోగునారను పేని ఒక తాడు లాగా తయారుచేసి, దానితో తోరణాన్ని కడతారు. తరువాత ఆ తోరణాన్ని చర్నాకోలుతో కొట్టి పీచు పీచులా చేస్తారు. అనంతరం ఎవరికి దొరికిన పీచును వారు తీసుకొని పోతారు. ఇది ఒక ఆచారం. ఆ పీచును ఎద్దుల మెడకు, నాగళ్లకు కడతారు. కొంతమంది రైతులు ఆ పీచును తమ ఇళ్లల్లో దాచి పెట్టుకుంటారు. అలా దాచిపెడితే పంటలు పుష్కలంగా పండుతాయని, పశువులు ఆరోగ్యంగా ఉంటాయని రైతుల నమ్మకం. ఆనాటి రాత్రి కుటుంబసభ్యులతో కలిసి పిండి వంటలతో విందు భోజనం చేస్తారు.

రైతులు వర్షాల కొరకు ఎదురు చూస్తుంటారు. తొలకరి జల్లులు వారికి ఆనందాన్ని కలిగిస్తాయి. వర్ష ఋతువు ప్రారంభం కాగానే భూమిని చదును చేసి విత్తనాలు చల్లడానికి సిద్ధమవుతారు. వ్యవసాయ పనులు ప్రారంభించడానికి జ్యేష్ఠ నక్షత్రం మంచిదని జ్యోతిషశాస్త్రం పేర్కొంటోంది. నాగలితో పొలం దున్నడానికి జ్యేష్ఠ, స్వాతి నక్షత్రాలు శుభప్రదమైనవని పరాశర మహర్షి తన గృహ్యసూత్రాలలో చెప్పాడు. ఓషధులకు సస్యానికి అధిపతి అయిన చంద్రుడు జ్యేష్ఠ నక్షత్ర సమీపాన ఉంటాడు. అందువలన జ్యేష్ఠ పూర్ణిమ నాడు, ఏరువాక పూర్ణిమను జరుపుకుంటారు.

ఏరువాకను కృషి పూర్ణిమ, హల పూర్ణిమ అని కూడా అంటారు. విష్ణు పురాణం ఏరువాకను సీతాయజ్ఞము అని పేర్కొన్నది. సీత అను పదమునకు నాగలి అని అర్థం. ఏరువాకను కర్ణాటకలో కాణిపబ్బం అంటారు. పాళిభాషలో వప్ప మంగళ దివసం అంటారని జాతక కథల ద్వారా తెలుస్తున్నది. శుద్ధోదన మహారాజు ఏరువాక పర్వదినాన్ని పురస్కరించుకొని రైతులకు బంగారు నాగళ్లను బహూకరించేవాడని బౌద్ధగ్రంథాల ద్వారా తెలుస్తోంది. హాలుడు రచించిన గాథాసప్తశతి లోనూ ఏరువాక ప్రసక్తి ఉంది. ఏ భాషలో ఏ పేరు ఉన్నా ఏరువాక పూర్ణిమ రైతులు పాటలు పాడుకుంటూ ఆనందంతో దుక్కిన దున్నుకుంటారు.



**చిల్లర సీతారామారావు**

తెలుగు సాహిత్యంలో కూడా ఏరువాక ప్రసక్తి కనిపిస్తుంది. శ్రీకృష్ణ దేవరాయలు తన ఆముక్తమాల్యద గ్రంథంలో దుక్కి సాగును మనోహరంగా వర్ణించారు. ఏరువాక పున్నమినాడు జరిగే తొలి దుక్కిలో కొందరు రైతులు కాడికి ఒక పక్కన ఉండి, ఎద్దుతో సమానంగా నడుస్తారు. వ్యవసాయ పనులలో తమకు అండగా నిలబడే మూగజీవాల పట్ల తమకున్న అభిమానాన్ని ఈవిధంగా చాటుకుంటారు. ఉత్తర భారతదేశంలో జ్యేష్ఠ పూర్ణిమ నాడు ఉద్ధృషభ యజ్ఞం చేస్తారు. వృషభం అంటే ఎద్దు, ఉద్ధృతము అంటే లేపడం అని అర్థం. మండు వేసవిలో విశ్రాంతి తీసుకున్న వృషభాలను వ్యవసాయం కొరకు సిద్ధపరచడం అని అర్థం. అధర్వణ వేదంలో జ్యేష్ఠ పూర్ణిమ నాడు అన ఉత్సవమును జరపాలని పేర్కొన్నారు. ఈ ఉత్సవంలో భాగంగా హలకర్మ, నాగపూజ, భూమిపూజ, పశువుల పూజ, వృషభ పూజ మున్నగునవి చేయాలి.

ఏరువాక పూర్ణిమ నాడు రైతులు ఎంతటి ఆవశ్యకత ఏర్పడినా అప్పు చేయరు. ఇతరులకు అప్పు ఇవ్వరు. గృహంలోని ఏ వస్తువునూ బయటికి పోనివ్వరు. దానికి కారణం అప్పు తీసుకున్నా, ఇచ్చినా ఇంటిలోని వస్తువు బయటికి పోయినా ఆ సంవత్సరమంతా తమ గృహంలో అలక్ష్మి తాండవిస్తుందని ఒక నమ్మకం.

మార్పు సహజం. కాలాన్ని అనుసరించి అనేక మార్పులు వస్తుంటాయి. వ్యవసాయ రంగంలో కూడ అనేక మార్పులు చోటు చేసుకున్నాయి. పూర్వం పొలాన్ని దున్నడానికి నాగళ్లు అవసరం అయ్యేవి. ఇప్పుడు వాటి స్థానంలో ట్రాక్టర్లు వచ్చాయి. ఎద్దుల ఆవశ్యకత కూడా తగ్గిపోయింది. అయినా జ్యేష్ఠ మాసంలో పూర్ణిమ నాడు రైతులు ఎద్దులను గౌరవిస్తూ, వాటిని పూజిస్తున్నారు. మార్పులు చోటు చేసుకున్నా కొందరు రైతులు ఏరువాక పూర్ణిమను ఆనందోత్సాహాలతో జరుపుకుంటున్నారు.

ఏరువాకకు సంబంధించిన పాటలు సినిమాలలో కూడా ఉన్నాయి. 'రైతుబిడ్డ' సినిమాలో "ఏరువాక వచ్చిందిరా...", "ముద్దుల యెద్దుకు ముత్యాలసరులు..." రోజులు మారాయి సినిమాలో "ఏరువాకా సాగారో రన్నో చిన్నన్నా..." వంటివి ఉన్నాయి.

విత్తిన ప్రతి విత్తు వర్ధిల్లాలని, పాడిపంటలతో తమ గృహాలు కళకళలాడాలని, అందరూ చల్లగా ఉండాలని నిండు మనస్సుతో రైతులు ఏరువాకమ్మను కోరుకుంటారు. ■

# ఉద్దండ పండితులు... అవధాన దిగ్దంతులు

**అపూర్వంగా ఐదవ అవధాన శిక్షణ శిబిరం**




**అవధానం... ఈ పదం ఒక రెండు మూడేళ్ల క్రితం వరకూ కొంత మేరకే తెలిసినా, ఇప్పుడు ప్రపంచం మొత్తం తెలుగు ప్రజలలో ఈ పదం తెలియనివారు లేరు. ఇందుకు ప్రధానమైన కారణం - అవధానవిద్యను దశదిశలా వికసింపజేయాలనే భూరి సంకల్పం కలిగిన 'అవధాన విద్యావికాస పరిషత్, భాగ్యనగరం' సంస్థ. నేడు 10 మంది కొత్త యువ అవధానులను, వందల మంది పద్యరచయితలను లోకానికి పరిచయం చేసిన ఈ అవధాన విద్యావికాస పరిషత్, ఈ సంవత్సరంలో 5వ వార్షికోత్సవం జరుపుకోవడంపై ప్రత్యేక కథనం.**

కన్నతల్లి, తల్లి నేల, తల్లి భాష - ఈ మూడిటిని ఆజన్మాంతం గుర్తుంచుకొని గౌరవించే మన తెలుగు భాషా జనులకు ఒక వరం, సాహిత్యక్రీడ, విలక్షణమైన మేధాప్రక్రియ ఈ 'అవధానం'. ఈ అవధానప్రక్రియ సంస్కృత భాష నుండి ఉద్భవించినప్పటికీ, కేవలం తెలుగు భాషలో జగజ్జేగీయమానమైన స్థాయికి చేరుకుంది. అయితే, మారుతున్న ఈ జెన్ - జీ యుగంలో తెలుగు మాట్లాడే వారే కరువైపోతుంటే, ఇంకా అవధానాలు చేసే వారున్నారా అనే ప్రశ్నకు అవుననే సమాధానం చెబుతోంది 'అవధాన విద్యా వికాస పరిషత్'. 2022 మే నెలలో తొట్టతొలిగా వేసవి సెలవులలో విద్యార్థులకు ఉపయోగకరంగా ఏడు రోజులపాటు అవధాన విద్యా శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసింది ఈ పరిషత్. 'సాధనాత్ సాధ్యతే సర్వం' అనే నినాదంతో ప్రారంభమై, 'సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం' సంయుక్త ఆధ్వర్యంలో ఈ 2026లోకి దిగ్విజయంగా ప్రవేశించి, ఎంతోమంది అవధానులను, పద్య కవులను తీర్చి దిద్దిన ఘనతను పొందింది. అవధాన విద్యా వికాస పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షులు మరుమాముల దత్తాత్రేయ శర్మ ఎన్నో వందల అష్టావధానాలను, శతావధానాలను నిర్వహింపజేసిన అనుభవజ్ఞులు, స్వయంగా అష్టావధాని కూడా. అవధాన విద్యను తరువాతి తరానికి అందించడమే ముఖ్య లక్ష్యంగా ఈ సంస్థను స్థాపించారు. ఇందులో భాగంగా ప్రతి సంవత్సరం, మే నెలలో ఏడు రోజుల పాటు అవధాన శిక్షణ శిబిరాన్ని ఏర్పాటు చేసి, అవధాన అభినివేశం గల ఎందరో ఆచార్యులను పాఠాలు చెప్పడానికి నియమించి, వచ్చిన విద్యార్థులకు ఉచిత భోజన ఆవాస సౌకర్యాలను అందించి, వారికి అవధానం చేయడానికి వేదికను కల్పించే ఈ బృహత్తర కార్యక్రమానికి వీరు శ్రీకారం చుట్టారు.



ఉప్పలధడియం భరత్ శర్మ

### ప్రారంభసభా సంరంభం

2026 మే 18వ తేదీ నుంచి 24వ తేదీ వరకు నేరేడ్‌మెట్, దీన్‌దయాళ్ నగర్‌లోని సెయింట్ మార్క్స్ గ్రామర్ హైస్కూల్ (మల్లినాథ అవధాన ప్రాంగణం) వేదికగా వారం రోజుల పాటు సాగిన అయిదవ అవధాన శిక్షణ శిబిరం అశేష సాహిత్యాభిమానుల హృదయాలను చూరగొంది. మే 18 ఉదయం 10:00 గం.లకు ఎందరో అష్టావధానులు, శతావధానులు, సహస్రావ

ధానులు, తెలుగు విద్యార్థులు, భావి అవధానులూ ప్రేక్షకులుగా హాజరుకాగా అంగరంగ వైభవంగా, వారి ఆనంద సందోహాల నడుమ, ముఖ్యఅతిథిగా పద్మశ్రీ పురస్కార గ్రహీత, మహా సహస్రావధాని డా. గరికపాటి నరసింహారావు ఈ అయిదవ అవధాన శిబిరానికి విచ్చేసి శిబిరాన్ని ప్రారంభించారు. అవధానం గొప్ప పరిశ్రమ ద్వారా, నియతమైన కృషి ద్వారా లభించే విద్యా అని డా. గరికిపాటి తెలియజేసారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఎఐ) అనే కృత్రిమ మేధ ఎన్ని కార్యాలను సాధించగలిగినా, అవధానకళను ఏఐ సాధించలేదు అని నొక్కి వక్కాణించారు. సమస్యపూరణలు, దత్తపది విరుపులు, వర్ణన చమత్కారాలు - ఇవన్నీ సహజమైన బుద్ధితో మానవుడు మాత్రమే చేయగలుగు తాడు గానీ, ఈ ప్రక్రియలో కృత్రిమమేధ ఎన్నటికీ మానవునికి ప్రత్యామ్నాయం కాలేదని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, ఎంతో మందిని అవధానులుగా తీర్చిదిద్దుతున్న అవధాన విద్యా వికాస పరిషత్ నిర్వాహకులైన మరుమాముల దత్తాత్రేయ శర్మ, వేంకటరమణ శర్మ, కె.వి.ఎన్. ఆచార్యలను డా. గరికిపాటి అభినందించారు. తదుపరి, మే 25వ తేదీ శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మచే శిబిరంలో నిర్వహించబడే ఏకదిన సంపూర్ణ శతావధాన కార్యక్రమ కరపత్రాన్ని గరికిపాటి నరసింహారావు అవిష్కరించారు.

ఈ ప్రారంభ సభకు విశిష్ట అతిథులుగా తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ అధ్యక్షులు బసవరాజు శ్రీనివాస్, విశ్రాంత ఐఎఎస్ ఎల్.వి. సుబ్రహ్మణ్యం, సంస్కృతాంధ్ర శతావధాని ఆచార్య డా. దోర్బల ప్రభాకర శర్మ, శతావధాని డా. జి.యం. రామశర్మ, అచ్చతెలుగు శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శతావధాని ఆముదాల మురళి, ద్విశతావధాని డా. బులుసు అపర్ణ తదితరులు విచ్చేసారు. ఈ క్రమంలో పద్మశ్రీ పురస్కృతులు, అవధాని కీ.శే. ఆశావాది ప్రకాశరావు రచించిన 'అవధానసాధన', మరుమాముల దత్తాత్రేయ శర్మ రచించిన 'దత్తానువాద సుభాషితం', 'అవధానపుష్కరిణి' అనే పుస్తకాల






అవిష్కరణలను అతిథులు నిర్వహించారు.

## అర్ధశతావధానం - అద్భుత ప్రతిభా సంధానం

ఐదవ అవధాన శిక్షణ శిబిరంలో భాగంగా, మొదటి రెండు రోజులు, అనగా, మే 18, 19 తేదీలలో, ఇదే సంస్థ మొదటి శిబిరం ద్వారా అవధానిగా ప్రపంచానికి పరిచయమైన నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌చే అర్ధశతావధానం కార్యక్రమాన్ని నిర్వహించారు. 13 సమస్యలు, 13 దత్తపదులు, 12 వర్ణనలు, 12 ఆశువులతో మొత్తం 50 అంశాలతో నల్లాన్ చక్రవర్తుల సాహిత్ చేత అర్ధశతావధానం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమానికి సంచాలకులుగా మధురభారతి డా. మల్లాప్రగడ శ్రీమన్నారాయణమూర్తి వ్యవహరించారు. మొదటిరోజు సమస్యలు, దత్తపదులకు ఒక్కొక్క పాదాన్ని, వర్ణనలకు రెండు పాదాలను పూరించి, రెండవరోజు అన్ని పద్యాలను పూర్తిగా పూరణ చేసి, 38 అంశాలను ధారణ చేసి, పండితులచేత ప్రశంసలనందుకున్నారు. అవధాన విద్యావికాస పరిషత్ సంస్థ ద్వారా అవధానిగా తయారైన నల్లాన్ చక్రవర్తుల సాహిత్, అష్టావధానాల నుండి నేడు అర్ధశతావధానం చేసే స్థాయికి ఎదగడం నిర్వాహకుల కృషికి నిదర్శనమని విద్వాంసులు, అతిథులు పేర్కొన్నారు. ధారణ సభ తరువాత రెండవరోజు సాయంత్రం అర్ధశతావధానం విజయోత్సవ సభకు అతిథులుగా సహస్రావధాని కోట లక్ష్మీనంసింహం, శతావధాని డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, శతావధాని ఆముదాల మురళి, శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం విచ్చేయగా, నిర్వాహకులు అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్‌ను ఘనంగా సత్కరించారు.

## విద్యార్థి సందోహం

అవధాన విద్యా వికాస పరిషత్ నిర్వహిస్తున్న ఈ ఐదవ అవధాన శిక్షణ శిబిరానికి దేశంలోని నలుమూలల నుండి విద్యార్థులు బహుళ సంఖ్యలో విచ్చేసారు. అనంతపురం కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి, తిరుపతి రాష్ట్రీయ సంస్కృత విశ్వవిద్యాలయం నుండి, హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం నుండి అనేక విద్యార్థులు వచ్చి, శ్రద్ధాసక్తులతో అవధాన శిక్షణ, పద్యరచనా శిక్షణలో పాల్గొన్నారు. ఈ విధంగా మొత్తం

10 మంది వరకు పద్యరచన శిక్షణలో, 30 మంది అవధాన శిక్షణలో పాల్గొన్నారు

**అధ్యాపక బృందం**

ఈ ఐదవ శిక్షణ శిబిరంలో, అవధాన శిక్షణతో పాటు సమాంతరంగా పద్య శిక్షణ కూడా నిర్వహించడం విశేష ఆకర్షణగా నిలిచింది. అవధాన శిక్షణలో శతావధాని ఆముదాల మురళి ప్రధాన అధ్యాపకులుగా కీలకపాత్ర పోషించి నిషిద్ధాక్షరి నిర్వహణ, నిఘంటు పరిజ్ఞానం మొ॥ అంశాలపై తరగతులను బోధించగా, వ్యాకరణ విద్వాంసులు చిటితోటి విజయ్ కుమార్- వారగణనం, యతిప్రాసలు అనే అంశాలను; సంస్కృతాంధ్ర విద్వాంసులు నల్లాన్ చక్రవర్తుల శ్రీరామ చక్రవర్తి - బాల వ్యాకరణం మెలకువలను బోధించారు. అచ్చ తెలుగు శతావధానిని డా. జంధ్యాల సుబ్బలక్ష్మి అచ్చ తెలుగు పదాల వ్యవహారం గురించి విశదీకరించగా, అష్టావధానంలో యాంత్రిక గణనం అనే అంశం గురించి శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం వివరించారు. అలాగే, డా. బోచ్కర్ ఓంప్రకాశ్ తిరుపతి వేంకట కవుల పద్యాల గురించి వివరించగా, అవధాని నల్లాన్ చక్రవర్తుల సాహిత్- 'అవధానాలలో సాంకేతిక పరిజ్ఞానం' అంశాన్ని గురించి వివరించారు. అవధానాల్లో అప్రస్తుతప్రసంగం చమత్కారం అనే అంశాన్ని దండిభొట్ల దత్తాత్రేయ శర్మ, మావుడూరు సూర్యనారాయణ వ్యాఖ్యానించారు. పురాణ పఠనం అనే అంశం గురించి అన్నమరాజు ప్రభాకర్ రావు, దేశి ఛందస్సుల వినియోగంపై డా. సంగనభట్ల నరసయ్య, చిత్రబంధ కవిత్వాల గూర్చి చింతా రామకృష్ణారావు ప్రస్ఫుటీకరించారు.

అదేవిధంగా, సమాంతరంగా నడుస్తున్న పద్య శిక్షణ తరగతులను శతావధాని నారాయణం బాలసుబ్రహ్మణ్యం ప్రధాన అధ్యాపకులుగా నడిపించగా, ఇదే సంస్థ ద్వారా అవధానులుగా పరిచయమైన యర్రంశెట్టి ఉమామహేశ్వరరావు, డా. బోరెల్లి హర్ష తదితరులు పద్య శిక్షణలో భాగస్వాములయ్యారు.

**బ్రహ్మశ్రీ డా. మాడుగుల నాగఫణి శర్మ ప్రసంగం**

అవధాన శిక్షణ శిబిరం ఐదవ రోజు, అనగా, 2026 మే 22వ తేదీ సాయంత్రం సభకు ప్రత్యేక అతిథిగా పద్మశ్రీ పురస్కృ




తులు, బృహద్ద్విసహస్రావధాని డా. మాడుగుల నాగఫణి శర్మ విచ్చేసి, అవధాన విద్యార్థులకు తమ అనుభవాలను, అవధాన రహస్యాలను ప్రసంగం ద్వారా తెలియజేసారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అవధాన విద్యా వికాస పరిషత్ ఎన్నో ఏళ్ళుగా అవధానుల కోసం పరిశ్రమిస్తుండడం అభినందనీయమని, డా. మాడుగుల నాగఫణి శర్మ కూడా స్వయంగా ఈ సంవత్సరంలో తమ వంతుగా అవధాన పద్య రచన శిక్షణ తరగతులను తమ అవధాన సరస్వతి పీఠంలో వారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు తెలియజేస్తూ, అవధాన విద్యా వికాసం కోసం ప్రతి ఒక్కరూ తమ తమ దారులలో పనిచేయాలని, అందరి గమ్యం ఒక్కటే అని పిలుపునిచ్చారు. అదేవిధంగా, ద్విశతావధానం, మహా సహస్రావధానం వంటి నూతన ప్రక్రియలను వారే స్వయంగా మొదలుపెట్టారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా, అవధాన విద్యా వికాస పరిషత్ నిర్వాహకులైన మరుమాముల దత్తాత్రేయ శర్మ, వెంకటరమణ శర్మ గార్ల నిరంతర కృషిని అభినందించి సత్కరించారు డా. నాగఫణి శర్మ. ఇదే క్రమంలో, అష్టావధాని బైరపనేని పోతురాజు చౌదరి రచించిన రంగనాథ శతకాన్ని నాగఫణి శర్మ ఆవిష్కరించారు.

**ప్రతిదినం - అష్టావధానం**

ఐదవ అవధాన శిబిరంలో భాగంగా, విద్యార్థులకు స్ఫూర్తిగా రోజుకు ఒక అష్టావధానాన్ని నిర్వాహకులు ఏర్పాటు చేసారు. ఈ నేపథ్యంలో, మే 19న అవధాని తిరుక్కోవళ్ళూరు శ్రీహర్ష, 20వ తేదీ అవధానిని శ్రీమతి మండపాక మహేశ్వరి, 21న అవధాని శ్రీ













గట్టెడి విశ్వంత్, మే 22న శ్రీ బైరపనేని పోతురాజు చౌదరి, 23వ తేదీ వింజమూరు సంకీర్త్య శర్మ అష్టావధానాలను నిర్వహించారు. ఈ నిర్వహణలో స్వయంగా శిబిరానికి వచ్చిన విద్యార్థులే పాలుపంచుకొని అనుభవాన్ని పొందే విధంగా నిర్వాహకులు ఏర్పాట్లు చేశారు.

**తెలుగు తల్లి సేవాధుర్యులకు సత్కారాలు**

శిబిరం ఆఖరి రోజైన మే 24న అత్యంత వైభవంగా జరిగిన విజయోత్సవ సభలో ఛందశ్శాస్త్ర రత్నాకర తోపెల్ల బాలసుబ్రహ్మణ్యం, సమస్యా పృచ్ఛక చక్రవర్తి కంది శంకరయ్య, తెలుగు భాషా వికాసోద్యమ సారథి జాగర్లపూడి సీతారామకృష్ణ శర్మ గార్లను పరిషత్ విశేష పురస్కారాలతో సత్కరించడం సత్సంప్రదాయానికి నిదర్శనంగా నిలిచింది. అదేవిధంగా, తాము నిర్వహించే అవధాన శిబిరం కార్యక్రమాలకు ఆర్థికంగా, హార్దికంగా వెన్నుదన్నుగా నిలుస్తున్న అమెరికా వాస్తవ్యులు శంకరమంచి రఘు, సంస్కృత సోదరులలో ఒకరైన కొడవటిగంటి మహాదేవ శర్మ తదితరులకు నిర్వాహకులు ఘనంగా సత్కరించారు.


**విజయోత్సవ సభా వైభవం**

ఈ ఐదవ శిక్షణ శిబిరం మే 24వ తేదీతో దిగ్విజయంగా సమాపన కార్యక్రమాన్ని సంతరించుకుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ కోట్ల హనుమంతరావు హాజరయ్యారు. సభాధ్యక్షులుగా అష్టావధాని డా. రేవూరి అనంత పద్మనాభరావు వ్యవహరించగా, జగర్లపూడి సీతారామకృష్ణ శర్మ, తోపెల్ల బాల సుబ్రహ్మణ్య శర్మ, కంది శంకరయ్య, తెలుగు పద్య సాహిత్యంలో విశేష కృషి చేసినందుకుగాను అవధాన విద్యా వికాస పరిషత్ సంస్థ వారు విశిష్ట పురస్కారాల ప్రదానం చేసారు. ఈ సందర్భంగా, వ్యాకరణంలో, ఛందశ్శాస్త్రంలో కృషి చేసిన డా. సంగనభట్ల నరసయ్యకు 'దేశిచ్ఛందోంబుధి' అనే బిరుదు ప్రదానం చేశారు. అదేవిధంగా, ముఖ్య అతిథి అయిన తెలుగు విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ కోట్ల హనుమంతరావు మాటాడుతూ, ఒక విశ్వవిద్యాలయం చేపట్టవలసిన కార్యక్రమాన్ని అవధాన విద్యా వికాస పరిషత్ స్వయంగా ఆ భారాన్ని తీసుకొని నిర్వహిస్తుండడం ముదావహం అని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో, శిక్షణ శిబిరానికి విచ్చేసిన అవధాన విద్యార్థులకు పద్య రచన విద్యార్థులకు అతిథులు సురవరం ప్రతాపరెడ్డి తెలుగు విశ్వవిద్యాలయ ఆమోదిత ధ్రువపత్రాల ప్రదానం చేసారు.

**అవధానుల సమ్మేళనంగా నిలిచిన శిక్షణ శిబిరం**

ఈ అయిదవ అవధాన శిక్షణ శిబిరం ఎందరిందరు శతావధానుల, సహస్రావధానుల సంగమంగా నిలిచింది. మొదటిరోజు శిబిరానికి మహా సహస్రావధాని డా. గరికిపాటి నరసింహారావు, సహస్రావధాని కోట లక్ష్మీ నరసింహం విచ్చేయగా, మే 22వ తేదీ బృహద్ద్విసహస్రావధాని డా. మాడుగుల నాగఫణి శర్మ, సమాపనోత్సవంలో ఏకదిన సంపూర్ణ శతావధానానికి సంచాలకులుగా త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ డా. వద్దిపర్తి పద్మాకర్ విచ్చేసిన ఈ సహస్రావధానుల సమ్మేళన ఘట్టం అపురూపంగా నిలిచింది. అదేవిధంగా, శతావధానులైన శ్రీ ఆముదాల మురళి, నారాయణం బాలసుబ్రహ్మణ్యం, డా. పాలపర్తి శ్యామలానంద ప్రసాద్, ఉప్పలధడియం భరత్‌శర్మ, ద్విశతావధాని డా. బులుసు అపర్ణ మొదలైన ఎందరో శతావధానులు, అష్టావధానులు విచ్చేసిన ఈ శిబిరం వైశిష్ట్యాన్ని సంతరించుకుంది. ■





# అవధాన చరిత్రలో సువర్ణాధ్యాయం

## ఏకదిన సంస్కృతాంధ్ర సంపూర్ణ శతావధానం



ఈ ఐదవ శిబిరంలో భాగంగా, చివరి రోజున అనగా, 2026 మే 25వ తేదీన తిరుపతికి చెందిన శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ 5వ శతావధానం - ఏకదిన సంపూర్ణ శతావధానం జగజ్జీగీయమానంగా నిర్వహించబడింది. ఈ శతావధానానికి సంచాలకులుగా త్రిభాషా మహాసహస్రావధాని బ్రహ్మశ్రీ డా. వద్దిపర్తి పద్మాకర్ వ్యవహరించారు. అవధాన సాహిత్య చరిత్రలో కేవలం 12 గంటల లో ధారణా సహితంగా ఈ ఏకదిన సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం ఒక కొత్త రికార్డును సృష్టించింది. ఉదయం 8:30 కు ప్రారంభమైన ఈ శతావధానంలో మధ్యాహ్నం 2:00 గం.లలో 25 సమస్యలకు 25 దత్తపదులకు నాలుగు పాదాలూ అమోఘమైన వేగంతో పూరించారు భరత్ శర్మ. ఈ శతావధానం ఉదయం సభకు సంధానకర్తగా శతావధాని ఆముదాల మురళి వ్యవహరించారు. అటు పై తిరిగి 3:00 గం.లకు ప్రారంభమై, త్రిభాషా మహా సహస్రావధాని బ్రహ్మశ్రీ వద్దిపర్తి పద్మాకర్ సంచాలకత్వంలో, శతావధాని ఉప్పలతడియం భరత్ శర్మ కేవలం మూడు గంటలలో 25 వర్ణనలు 25 ఆశువులను వ్రాసుకోవడానికి కూడా వీలు లేనంత వేగంతో పూరించారు. ఈ విధంగా సాయంత్రం 6:00 గం.లకు శతావధానంలోని వంద పద్యాల పూరణ పూర్తి చేసారు భరత్ శర్మ. తదనంతరం, శతావధానంలోని ప్రాశ్నికులను అవధాన విద్యా వికాస పరిషత్, దర్శనం మాస పత్రికల నిర్వాహకులు ఘనంగా సత్కరించారు. అదేవిధంగా, ప్రాశ్నికులు ఈ ఏకదిన శతావధానంపై ప్రశంసాల వర్షం కురిపిస్తూ తమ స్పందనలను పద్యాల రూపంలో తెలియజేసారు. ఈ క్రమంలో, అవధాన శిక్షణ శిబిరం నిర్వహణలో వెన్నుదన్నుగా ఉన్న కెవియెన్










ఆచార్య, దుగ్గిరాల వాసుదేవరావు, పంతుల విట్టుబాబులను నిర్వాహకులు సత్కరించారు. తదుపరి, సాయంత్రం 8:00 గంటలకు శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మ ఉదయం నుండి సాయంత్రం వరకు పూరించిన 25 సమస్యలు 25 దత్తపదులు 25 వర్ణనలు - మొత్తం 75 పద్యాలను పొల్లు పోకుండా ధారణ చేసి అవధాన చరిత్రలో జగజ్జీగీయమానమైన కొత్త రికార్డును సృష్టించారు. సభలోని వారంతా కరతాళధ్వనులతో అవధాని భరత్ శర్మకు నీరాజనం పట్టారు. ఈ ధారణ సభకు సంధానకర్తగా అచ్చతెనుగు శతావధాని డాక్టర్ పాలపర్తి శ్యామలానంద ప్రసాద్ వ్యవహరించగా, విశిష్ట అతిథులుగా 'శతావధాన పంచానన' డాక్టర్ జి ఎం రామశర్మ, అష్టావధాని శ్రీ మాడుగుల నాగగురునాథ శర్మ, అవధాని మరుమాముల దత్తాత్రేయ శర్మ వేదికను అలంకరించి, కేవలం 20 సంవత్సరాల వయసు గల ఉప్పలధడియం భరత్ శర్మ ప్రపంచంలో ఏకదిన సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానం ధారణాసహితంగా చేసిన అతిపిన్న వయస్కుడిగా కీర్తి గడించారని, శతావధానంలోని పద్యాలన్నీ అలంకార భరితంగా, చమత్కారపూరితంగా పూరించారని కొనియాడారు. సమస్యలను పరిష్కరించిన తీరు, దత్తపదులను విరచిన విధానం, వర్ణనలలోని కల్పనాశక్తి, ఆశువులలోని శరవేగం - అన్నీ కలగలిసిన ఈ శతావధానం అవధాన విద్యార్థులకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఉదాహరణకు- మానిని, శార్దూలం, మత్తేభం, స్రగ్ధర అనే పదాలను ఇచ్చి రామాయణార్థంలో పూరించమని ప్రాశ్నికులు అడగగా-

**మ. రజనీసంచర! మాని నీ మదము శ్రీరామాంఘ్రులన్ జేరుమా!**
**వృజినధ్వంసక్నుఁడైన రాఘవుడు తానే రాజశార్దూల మో**
**అజవంశోద్భవ! విన్మ, నిల్వవిట నౌరా! శత్రుమత్తేభముల్**
**విజయస్రగ్ధర్నుఁడౌచు రామ్నుఁడదె భావిన్ గెల్చు యుద్ధంబులో**

అని హనుమంతుడు రావణాసురుణ్ణి హెచ్చరిస్తున్నట్టుగా అవధాని భరత్ శర్మ పూరించిన తీరు ప్రశంసనీయం. ఈ నేపథ్యంలో, నిర్వాహకులు శతావధాని ఉప్పలధడియం భరత్ శర్మను ఘనంగా సత్కరించి, 'ఏకదిన శతావధాన ధురీణ' అనే బిరుదును ప్రదానం చేసారు. ఈ విధంగా, అవధాన విద్యా వికాస్ పరిషత్ నిర్వహించిన 5వ శిక్షణ శిబిరం, చివరి రోజు సమాపనోత్సవంలో భాగంగా ఏకదిన సంపూర్ణ సంస్కృతాంధ్ర శతావధానంతో దిగ్విజయంగా పూర్తయ్యింది. ■





# శృంగేరీ జగద్గురువుల ఆగమనం.. నేపాల్ ధార్మిక ప్రభంజనం





సనాతన ధర్మ రక్షణార్థం సాక్షాత్తు శ్రీ ఆదిశంకరులు స్థాపించిన దక్షిణామ్నాయ శ్రీ శృంగేరి శారదా పీఠానికి పవిత్ర నేపాల్ దేశానికి మధ్య ఉన్న ఆధ్యాత్మిక బంధం అనాదిగా వస్తున్నది. ఈ చారిత్రక వారసత్వాన్ని మరింత పటిష్టం చేస్తూ, శృంగేరీ పీఠం జగద్గురు శంకరాచార్య శ్రీశ్రీశ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు నేపాల్ దేశంలో చేపట్టిన ధర్మ విజయ యాత్ర అత్యంత వైభవంగా, దిగ్విజయంగా ముగిసింది. ఉభయ దేశాల భక్తుల హృదయాల్లో చెరగని ముద్ర వేసిన ఈ వారం రోజుల పర్యటన ఒక అపూర్వ ఆధ్యాత్మిక ఘట్టంగా చరిత్రలో నిలిచిపోతుంది. మంగళూరు నుండి ప్రత్యేక విమానంలో ఖాట్మండు చేరుకున్న జగద్గురువులకు నేపాల్ ప్రభుత్వ యంత్రాంగం, ఆలయ ధర్మకర్తలు, నేపాల్‌లోని భారత రాయబార కార్యాలయం అధికారులు, వేలాది భక్తులు పూర్ణకుంభంతో, మంగళ వాయిద్యాలు, వేదమంత్రోచ్చారణల నడుమ కన్నుల పండువగా జరిగిన శోభాయాత్రలో పాల్గొని, ఘన స్వాగతం పలికారు.

ఈ పర్యటనలో ప్రధాన ఘట్టాలన్నీ ఖాట్మండులోని పరమ పవిత్రమైన శ్రీ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలోనే సాగడం




విశేషం. ఆదిశంకరాచార్యులు స్వయంగా పశుపతినాథుని అర్చించి, ఈ క్షేత్ర ప్రాశస్త్యాన్ని పెంచారు. నేటికీ దక్షిణ భారతదేశానికి చెందిన విద్వాంసులే అక్కడ ప్రధాన అర్చకులుగా సేవలు అందిస్తున్నారని చరిత్ర చెబుతోంది. ఈ సుదీర్ఘ పరంపరను స్మరించుకుంటూ, శ్రీ విధుశేఖర భారతీ సన్నిధానం వారు స్వయంగా పశుపతినాథునికి జరిపిన విశేష రుద్రాభిషేకాలు, మహాపూజలు చూపరులను భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. జగద్గురువుల రాకతో ఆలయ ప్రాంగణమంతా శివపంచాక్షరీ మహామంత్ర నాదంతో మారుమోగింది. స్వామివారి కరకమలాలతో జరిగిన ఈ పవిత్ర పూజల ద్వారా పశుపతినాథుని దివ్య అనుగ్రహం యావత్ విశ్వానికి ప్రసరించిందని భక్తులు ఆనంద పారవశ్యానికి లోనయ్యారు.

కేవలం పూజా కార్యక్రమాలతోనే కాకుండా, జగద్గురువులు ప్రతిరోజూ పశుపతినాథ్ ఆలయ ప్రాంగణంలో అందించిన అమృతతుల్యమైన అనుగ్రహ భాషణాలు నేపాల్ ప్రజల్లో గొప్ప ధార్మిక చైతన్యాన్ని రగిలించాయి. వేదాల ప్రాశస్త్యం, సనాతన ధర్మం గొప్పదనం, ఆధునిక కాలంలో మానవాళి ఆచరించాల్సిన నైతిక విలువల గురించి స్వామివారు చేసిన ప్రవచనాలు వినడానికి భక్తులు విశేష సంఖ్యలో తరలివచ్చారు. నేపాల్ ప్రభుత్వ యంత్రాంగం, స్థానిక ట్రస్ట్ సభ్యులు చేసిన కట్టుదిట్టమైన ఏర్పాట్ల వల్ల ఈ యాత్ర ఆద్యంతం అత్యంత ప్రశాంతంగా, శోభాయమానంగా సాగింది. భౌగోళికంగా రెండు వేర్వేరు దేశాలైనా, ఆధ్యాత్మికంగా భారతదేశం, నేపాల్ ప్రజల ఆత్మ ఒక్కటేనని ఈ యాత్ర మరోసారి లోకానికి చాటిచెప్పింది. ధర్మసంస్థాపన దిశగా శృంగేరీ పీఠం చేస్తున్న నిరంతర కృషికి ఈ పర్యటన ఒక నిలువెత్తు దర్పణంగా, భవిష్యత్ తరాలకు మార్గదర్శకంగా నిలుస్తుంది.

# రామేశ్వరంలో శివలింగాన్ని లంకకు వెళ్లే ముందే ప్రతిష్ఠించిన రాముడు

రాముడు రామేశ్వరంలో శివలింగప్రతిష్ఠ చేసాడా? చేస్తే, ఎప్పుడు చేసాడు? అనే చర్చ చాలాకాలంగా జరుగుతూనే ఉన్నది. వాల్మీకి రామాయణం మీద రాయబడిన ప్రసిద్ధ వ్యాఖ్యానాలు కూడా ఈ విషయంపై భిన్నంగా స్పందించాయి. కొందరు రాముడు రావణునిపైకి యుద్ధానికి బయలుదేరేముందు శివలింగప్రతిష్ఠ రామేశ్వరంలో చేసాడంటే, ఇంకొందరు రాముడు రావణవధానంతరం బ్రహ్మహత్యాపాతకం నుండి విడివడడానికి అయోధ్యకు పుష్పకవిమానంలో తిరిగివెళుతూ రామేశ్వరలింగ ప్రతిష్ఠ చేసాడన్నారు. మరికొందరు అసలు రాముడు లంకకు వెళ్ళేప్పుడుగాని తిరిగివచ్చేప్పుడుగాని శివలింగప్రతిష్ఠ చేయలేదని, వాల్మీకి రామాయణంలో రాముడు సీతతో చెప్పిన "అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమ్ అకరోత్ ప్రభుః" అన్న వాక్యంలో మహాదేవః అంటే సముద్రుడు అని, కనుక సముద్రుడు అనుగ్రహించాడని, మహాదేవః అంటే శివుడు కాదని అన్నారు.

అవన్నీ పక్కనపెట్టి ఈ విషయాన్ని ఒక కొత్తకోణంలో చూసే ప్రయత్నం చేద్దాం. అనంతకాలంలో అసంఖ్యాక రామాయణాలు జరిగాయి, జరుగుతాయి అని అనాదిగా చెప్పబడుతున్న మాట. ఇప్పుడున్న బ్రహ్మవయస్సు 51వ సంవత్సరంలో మొదటి రోజు నడుస్తున్నది. దీని ప్రకారం గణిస్తే 360 రోజులు ఐ 50 సంవత్సరాలు = 18,000 ం 1 రోజు = 18,001 రోజుల వయస్సు ప్రస్తుతం బ్రహ్మది. ఆయన ఒక రోజును ఒక కల్పం అంటాం (864 కోట్ల మానవ సంవత్సరాలు). ప్రతీ కల్పంలో ఒక రామాయణం జరుగుతుంది. ఆ లెక్కన ప్రస్తుత బ్రహ్మకాలంలో ఇప్పటికి 18,001 రామాయణాలు జరిగాయన్నమాట.



**ప్రతికల్పం భవేద్రామో రావణశ్చాపి రాక్షసః**
**తథైవ జాయతే యుద్ధం తథైవ త్రిదశాగమః శ్రీ**
**ఏవం రామసహస్రాణి రావణానాం తథైవ చ**
**భవితవ్యాని భూతాని తేషు దేవీ ప్రవర్తతే శ్రీశ్రీ**
(కాళికా పురాణం-అధ్యాయం-60, శ్లోకాలు- 40, 41)



**డా. ఇందారం శ్రీనివాస్ రావు**

భావం: "ప్రతికల్పం (బ్రహ్మదేవుని ఒక రోజు)లో రాముడు పుడతాడు. రాక్షసుడైన రావణుడు కూడా పుడతాడు. యుద్ధమూ అలాగే జరుగుతుంది. అలాగే దేవతలు వస్తారు. ఇలా వేలాది రాముళ్ళు, రావణులు పుట్టారు, పుట్టగలరు. దేవి (అమ్మవారు) తదనుగుణంగా తన కార్యాన్ని నిర్వహిస్తుంది." అని కాళికా పురాణ వచనం.

ప్రస్తుత బ్రహ్మకాలంలో 18,001 రామాయణాలు జరిగితే అందులో కొన్నింటి ప్రస్తావన మాత్రమే మనకు పురాణాల్లో కనిపిస్తుంది. అలాగే, లభ్యమయ్యే అన్ని పురాణాలలో, ఉపపురాణాదులలో రామాయణంగాని, రామచరిత్రగాని లేదు. అవసరమైన పురాణాదులలో మాత్రమే అవసరమైనంతమట్టుకే రామకథ ప్రస్తావించబడినది. పద్మ పురాణంలో చెప్పినట్టు:

**చరితం రఘునాథస్య శతకోటి ప్రవిస్తరమ్ ।**
**క్వచిత్ క్వచిత్పురాణేషు విరోధో యది దృశ్యతే ॥**

భావం: రఘురాముని చరిత్రలు శతకోటి లేదా అనంతాలు. అందుకే మనకు అవి పురాణాల్లో కొంచెం భేదంతో కనిపిస్తాయి.

అధ్యాత్మరామాయణం, శ్రీమద్భాగవతం, మహాభారతంలోనే కాక శివపురాణం, లింగపురాణం, స్కాందపురాణం, పద్మ పురాణం, కూర్మపురాణం మొదలైన పురాణాల్లో కూడా రామకథ ఉన్నది. అలా పురాణాల్లో కనిపించే రామాయణాల్లో, రామ కథల్లో ఉన్న విషయభేదాలవల్ల, దేన్ని అనుసరించాలో, దేన్ని ప్రమాణంగా తీసుకోవాలో అన్న విషయం గురించి కొంచెం అయోమయం కలుగుతుంది. ఆ అయోమయంలో పుట్టిన ప్రశ్నల్లో ఒకటి "రామేశ్వర ప్రతిష్ఠ రాముడు చేసాడా? చేస్తే, ఎప్పుడు చేసాడు?" అన్నది.

సీతాపహరణం తరువాత ఆమెను వెతుకుతూ బయలుదేరిన రామలక్ష్మణులు ఋశ్యమూక పర్వతప్రాంతంలో సుగ్రీవహనుమంతాదులను కలుసుకొని, ఆ తరువాత ఆమె రావణలంకలో

ఉన్నదని హనుమంతుని ద్వారా తెలుసుకొని అశేషవానరసేనతో లంకపైయుద్ధానికి బయలుదేరి దక్షిణసముద్రతీరంలో విడిది చేసారు.

శతయోజనదూరంలోని రావణలంకకు సేతునిర్మాణం చేయాలని సంకల్పించాడు రాముడు. వానరవీరుడైన నలుని ఆధ్వర్యవంలో, తన వెంట మహేంద్రగిరి నుండి రామేశ్వరం వరకు సముద్రతీరంలో నిండి ఉన్న కోట్లకొద్ది వానరసేనకు అనువుగా ఉండేట్లుగా పదియోజనాల వెడల్పు శతయోజనాల పొడవైన సేతునిర్మాణం మొదలు పెట్టేముందు రాముడు తాను తలపెట్టిన కార్యవిజయం కోసం శివస్వరూప మైన రామేశ్వరుణ్ణి (నేటి రామేశ్వరం ప్రాంతంలో) ప్రతిష్టించి ఆయన అనుగ్రహాన్ని పొందాడని వాల్మీకి రామాయణంలో రావణ వధ తరువాత రాముడు పుష్పకవిమానంలో అయోధ్యకు తిరిగివెళుతూ "అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమ్ అకరోత్ ప్రభుః" అని సీతతో అన్న మాటలద్వారా తెలుస్తున్నది.

సాధారణంగా మనం ఇళ్ళలో ఈశాన్యం లోనే దేవుణ్ణి పెట్టుకుంటాం. వాస్తుశాస్త్ర నిపుణుడైన రాముడు రావణలంకకు బయలు దేరేముందు మహేంద్రగిరిపర్వతానికి (నేటి కన్యాకుమారికి పైన ఉన్నది) ఈశాన్యంగా ఉన్న ప్రాంతంలో (ఇప్పటి రామేశ్వరంలో) శివప్రతిష్ఠచేసి పూజించాడు.

రావణవధ తరువాత పుష్పకవిమానంలో అయోధ్యకు తిరిగివెళుతూ రాముడు సీతకు వివిధప్రాంతాలను చూపిస్తూ వాటిగురించి చెపుతున్న సందర్భంలో రామేశ్వరం ప్రాంతాన్ని గురించి ఇలా అన్నాడు:

**ఏతత్తు దృశ్యతే తీర్థం సాగరస్య మహాత్మనః ।**
**సేతుబంధ ఇతిఖ్యాతం త్రైలోక్యేనా2భిపూజితమ్ ॥**
**ఏతత్ పవిత్రం పరమం మహాపాతకనాశనమ్ ।**
**అత్ర పూర్వం మహాదేవః ప్రసాదమ్ అకరోత్ ప్రభుః ॥**

భావం: "ఇక్కడ కనిపిస్తున్నది మహాత్ముడైన సముద్రుని (ఉత్తర) తీరం. ఇది సేతుబంధం అని ప్రసిద్ధమై ముల్లోకవాసుల చేత పూజలందుకుంటున్నది. పరమ పవిత్రమైన ఈ ప్రదేశం మహాపాతకాలను నశింపజేస్తుంది. ఇక్కడనే పూర్వం ప్రభువైన పరమేశ్వరుడు నన్ను అనుగ్రహించాడు" (వాల్మీకి రామాయణం, యుద్ధకాండ, అధ్యాయం- 126, శ్లోకాలు- 16, 17).

కనుక రాముడు రామేశ్వరలింగాన్ని రావణలంకకు బయలు దేరేముందు ప్రతిష్టించి పూజించాడు కాని రావణవధ తరువాత తిరుగుప్రయాణంలో కాదు అని దీనివల్ల తెలుస్తున్నది.



బ్రహ్మాండ పురాణాంతర్గత అధ్యాత్మరామాయణంలోని యుద్ధకాండ ఇలా చెపుతున్నది:

**సేతుమారభమాణస్తు తత్ర రామేశ్వరం శివమ్ ।**
**సంస్థాప్య పూజయిత్వాహ రామో లోకహితాయ చ ॥**
**ప్రణామేత్సేతుబంధం యో దృష్ట్వా రామేశ్వరం శివమ్ ।**
**బ్రహ్మహత్యాదిపాపేభ్యో ముచ్యతే మదనుగ్రహాత్ ॥**

భావం: సేతునిర్మాణ ప్రారంభంలో అక్కడ రామేశ్వరుడు అన్న పేరుతో శివుణ్ణి ప్రతిష్టించి పూజించిన రాముడు లోకహితం కోసం ఇలా అన్నాడు - "సేతుబంధాన్ని దర్శించి రామేశ్వరం శివునికి ఎవడైతే నమస్కరిస్తాడో, అతడు నా అనుగ్రహం వల్ల బ్రహ్మహత్యాది పాపాలనుండి ముక్తుడౌతాడు. "అలాగే, సేతునిర్మాణానికి ముందే రాముడు శివలింగాన్ని ప్రతిష్టించినట్లు కూర్మపురాణం తెలియజేస్తున్నది.

ఐతే, పద్మపురాణంలో, రావణసంహారం తరువాత అయోధ్యకు తిరుగు ప్రయాణంలో రాముడు రామేశ్వరంలో లింగప్రతిష్ఠ చేసినట్టు ఉన్నది.

అలాగే పద్మపురాణంలో మరోచోట అంటే, పాతాళఖండంలోని, 8వ అధ్యాయం ప్రకారం:

దాన సత్కార భోజనాల ద్వారా సన్మానించ దగిన బ్రాహ్మణులను తాను బాణాలతో చంపి మహాపరాధం చేసానని, ఆ ఘోరపాపం నుండి తనను ముక్తుణ్ణి చేసే తీర్థంగాని, యజ్ఞంగాని, తపంగాని, దానంగాని, వ్రతంగాని కనిపించడంలేదని అగస్త్యమహర్షితో రాముడు అంటాడు.

దానికి అగస్త్యమహర్షి- "రామా! రావణాది దుష్టులను నాశనం చేయాలనుకున్నావు కనుక బ్రహ్మహత్యాపాపం నీకు తగలదు. అలాగే నీవు పురాణపురుషుడవు. సీతనే మహావిద్య. మిమ్ములను స్మరిస్తే సకలపాపాలు తొలగి ముక్తి కలుగుతుంది" అన్నాడు. అయినప్పటికీ తాను చేసింది పాపమని, ప్రాయశ్చిత్తాన్ని చెప్పమని మహర్షిని అర్థిస్తాడు రాముడు. దానికి అగస్త్యుడు బ్రహ్మహత్యాపాతకం నుండి ముక్తి పొందడానికి రాముణ్ణి అశ్వమేధయాగం చేయమంటాడు.

ఇంకోచోట, అదే పద్మపురాణంలో పాతాళఖండంలోని, 116వ అధ్యాయం "పురా కల్పీయ రామాయణం" ప్రకారం రాముడు విభీషణుణ్ణి లంకకు రాజును చేసి సీతతో పాటు పుష్పక విమానంలో అయోధ్యకు తిరిగివెళ్తూ సముద్రతటానికి రాగానే అక్కడ శివప్రతిష్ఠ చేసి అయోధ్యవైపు వెళ్ళాడు.

ఇలా వివిధ పురాణాల్లో, పలుసందర్భాల్లో చెప్పబడిన రామకథ రకరకాలుగా ఉండడంవల్ల ఏది సరైనదో, ఏ

రామకథను ప్రమాణంగా తీసుకోవాలో తెలియని సందిగ్ధత ఏర్పడుతున్నది.

దీనికి సమాధానం: పురాణాల్లో ఉటంకించబడిన అన్ని రామాయణాలు లేదా రామకథలు నిజమైనవే. గుర్తుపెట్టుకోవలసిన విషయం ఏమిటంటే వివిధ కల్పాల్లో స్వల్పభేదాలతో జరిగిన రామచరిత్రలే వివిధ పురాణాల్లో సంక్షిప్తంగా వివిధ సందర్భాల్లో చెప్పబడ్డాయి.

మరి అలాంటప్పుడు ప్రస్తుతం కలియుగంలో ఏ రామకథను ప్రామాణికంగా తీసుకోవాలి? అంటే దీనికి సమాధానం:

మనకు అతి సమీపంలోని చారిత్రక గ్రంథమైన మహాభారతంలోని సభాపర్వంలో ఉన్న రాజసూయపర్వం, 38వ అధ్యాయాన్ని అనుసరించి రామావతారం వైవస్వత మన్వంతరంలో 24వ మహాయుగంలోని త్రేతాయుగం సంధ్యాంశలో (చివరిభాగంలో) మరియు ద్వాపరయుగం సంధ్యలో (ప్రారంభంలో) జరిగిందని భీష్ముడు ధర్మరాజుతో చెబు తాడు. వైవస్వత మన్వంతరంలోని 24వ మహాయుగంలో జరిగినది, వాల్మీకి రామా యణంగా ప్రసిద్ధమైన రాముని చరిత్రనే నేడు మనకు గ్రంథరూపంలో లభ్యమౌతున్నది. దీనినే ప్రస్తుతం కలియుగంలో మనం ప్రామాణికంగా తీసుకోవడం ఉత్తమం. ఈ రామాయణాన్ని కనుక ప్రామాణికంగా తీసుకుంటే:



1) రాముడు సీతతో చెప్పినట్టు, యుద్ధానికి వెళ్లేముందే రామేశ్వరంలో రాముడు శివలింగ ప్రతిష్ఠ చేసాడు. తిరిగి వచ్చేటప్పుడు కాదు.

2) "మహాదేవః" అన్న పదం యుద్ధకాండలోని సర్గల్లో శివునికి పర్యాయపదంగా వాడబడింది కాని సముద్రునికి కాదు. ("షడర్థనయనః శ్రీమాన్ మహాదేవో వృషధ్వజః" - యుద్ధకాండ, సర్గ - 120, శ్లోకం -3; "మహాదేవ వచః శ్రుత్వా కాకుస్థః సహ లక్ష్మణః" - యుద్ధకాండ, సర్గ - 122, శ్లోకం -- 9; అలాగే, "మహాదేవ ప్రసాదాచ్చ పిత్రా మమ సమాగమమ్"- యుద్ధకాండ, సర్గ - 128, శ్లోకం - 11.) కనుక వాల్మీకి రామాయణం, యుద్ధకాండ, అధ్యాయం - 126లోని శ్లోకంలో కూడా "మహాదేవః" అంటే "శివుడు" అనే గ్రహించాలి.

3) రాముడు విష్ణువు అవతారం మరియు దుష్టశిక్షణ శిష్టరక్షణలో భాగంగా రావణుణ్ణి అతని పరివారాన్ని నిర్మూలించాడు కనుక అతనికి బ్రహ్మహత్యాపాతకం అంటదు.

4) "ఆత్మానం మానుషం మన్యే"అంటే "నన్ను నేను మానవుడు అనే అనుకుంటున్నా" అని రాముడు అన్నాడు కదా! మరి అలాంటప్పుడు బ్రహ్మహత్యాపాతకం అతనికి అంటదా అని ప్రశ్నిస్తే అంటదు అనే సమాధానం. ఎందుకంటే స్వధర్మం ప్రకారం జీవిస్తున్న బ్రాహ్మణుణ్ణి చంపడంవల్ల బ్రహ్మహత్యాపాతకం అనే మహాపాతకం చుట్టుకుంటుంది. కానీ స్వధర్మాన్ని వదిలేసి పరధర్మాన్ని అంటే ఉదాహరణకు క్షత్రియధర్మాన్ని అనుసరిస్తున్న బ్రాహ్మణుణ్ణి యుద్ధంలో చంపడంవల్ల బ్రహ్మహత్యాదోషం అంటదు అనడానికి మహాభారతంలో ఆధారం కనిపిస్తున్నది. పరశురాముడు తన శిష్యుడైన భీష్మునితో యుద్ధం చేయడానికి వచ్చినపుడు భీష్ముడు పరశురామునితో ఇలా అంటాడు:

**ఉద్యతేషుమథో దృష్ట్వా బ్రాహ్మణం క్షత్రబంధువత్ ।**
**యో హన్యాత్ సమరే క్రుద్ధం యుధ్యంతమపలాయినమ్ ॥**
**బ్రహ్మహత్యా న తస్య స్యాత్ ఇతి ధర్మేషు నిశ్చయః ।**
**క్షత్రియాణాం స్థితో ధర్మే క్షత్రియో2స్మి తపోధన ॥**

భావం: "బ్రాహ్మణుడై కూడా క్షత్రియుని లాగ యుద్ధానికి వచ్చి, పారిపోకుండా యుద్ధంలో కోపంతో దూకుడుగా పోరాడుతుంటే అతణ్ణి సంహరించినవానికి బ్రహ్మహత్యా పాపం అంటదు - ఇదే ధర్మశాస్త్రాలు నిశ్చయంగా చెపుతున్నాయి. ఓ తపస్వీ! క్షత్రియధర్మంలో స్థిరంగా ఉన్న నేను క్షత్రియుడినే" అని భీష్ముడు పరశురామునితో అన్నాడు (మహాభారతం, ఉద్యోగపర్వం, అధ్యాయం - 178, శ్లోకాలు - 51, 52).

రావణుని తల్లి రాక్షసి మరియు తండ్రిది బ్రహ్మవంశం. ఒకవేళ రావణుణ్ణి అతని తల్లి పక్షాన రాక్షసునిగా అనుకుంటే, అతణ్ణి చంపడంవల్ల రామునికి బ్రహ్మహత్యా పాపం రాదు. ఒకవేళ రావణుణ్ణి అతని తండ్రి వైపునుండి బ్రహ్మ వంశం వాడు అనుకుంటే రావణుడు బ్రాహ్మణధర్మాన్ని పక్కన పెట్టి ఒక క్షత్రియునిలా, క్షత్రియుడైన రామునితో యుద్ధం చేసాడు. కనుక మహాభారతంలో భీష్ముడు అన్నట్టు, రావణుణ్ణి యుద్ధంలో చంపడంవల్ల రామునికి బ్రహ్మహత్యా పాపం రాదు. అలాంటప్పుడు రాముడు లంక నుండి అయోధ్యకు తిరుగు ప్రయాణంలో, రావణుణ్ణి చంపడంవల్ల వచ్చిన బ్రహ్మహత్యా దోషం పోవడానికి, రామేశ్వరంలో శివలింగప్రతిష్ఠ చేసాడన్నది ప్రస్తుతం మనకు లభిస్తున్న వాల్మీకి రామాయణం ప్రకారం సత్యదూరం.

వాల్మీకి రామాయణాన్ని చదవండి - వాస్తవ చరిత్రను గ్రహించండి.

(వ్యాసకర్త చారిత్రక పరిశోధకుడు)

# నాట్యోపాసన - కూచిపూడి భాగవతుల ప్రస్థానం

సదాశివ సమారంభాం శంకరాచార్య మధ్యమాం ।
అస్మదాచార్య పర్యంతం వందే గురుపరంపరామ్ ॥

వేదభూమిలో కళాకౌముది భారతదేశం కేవలం ఒక భౌగోళిక ఖండం కాదు ఇది వేద విజ్ఞాన భాండాగారం. తరతరాల హైందవ సంస్కృతీ సంప్రదాయాలను కాలప్రవాహంలో కొట్టుకుపోకుండా భావితరాలకు సజీవంగా అందించే వారధులు మన సంప్రదాయ కళారూపాలు. ఈ కళా ప్రపంచంలో సంగీత నాట్యాలు కేవలం వినోద సాధనాలు కావుఅవి సాక్షాత్తూ దైవదత్తమైన పరమ పవిత్ర విద్యలు. అట్టి దైవకృపా కటాక్షంతో, నిత్యానుష్ఠాన గరిష్ఠులై, సాత్విక స్వభావంతో పురాణేతిహాసాలను గానంచేస్తూ, అభినయిస్తూ లోకాన్ని విజ్ఞానపథంలో నడిపించే మహోన్నత సంప్రదాయం --- కూచిపూడి భాగవతులది.

పంచమ వేద సృజన బ్రహ్మదేవుడు తన తపోశక్తితో నాలుగు వేదాల సారాన్ని గ్రహించి 'నాట్యవేదాన్ని' సృజించాడు:

"జగ్రాహ పాఠ్య మృగ్వేదా త్సామభ్యో గీత మేవచ । యజుర్వేదా దభినయాన్ రసానాథర్వణా దపి ॥" ఋగ్వేదం నుండి పాఠ్యాన్ని, సామవేదం నుండి గానాన్ని, యజుర్వేదం నుండి అభినయాన్ని, అథర్వణ వేదం నుండి రసాన్ని స్వీకరించి, ఉపవేదాల సారంతో 'లలితామృతమైన' ఈ పంచమ వేదాన్ని జగత్తుకు ప్రసాదించారు. నాట్యం కేవలం దృశ్య కావ్యం మాత్రమే కాదు, అది ధర్మార్థ కామ మోక్షాలను ప్రసాదించే ఒక అద్భుత ఆధ్యాత్మిక సాధనం.

గ్రామ నామమే నాట్య నామమై... కృష్ణా నదీ సైకత తీరంలో కొలువుదీరిన ఒక చిన్న అగ్రహారం నేడు విశ్వవ్యాప్తమై, భారతీయ శాస్త్రీయ నాట్య పటమున ధ్రువతారగా వెలుగుతోంది. కూచిపూడి పేరులోనే ఒక విలక్షణమైన అర్థం ఉంది. 'కుచ్చి' అనగా నర్తకులు నడుముకు ధరించే వస్త్ర





ఖండం (ఆహార్యం), 'పూడి' అనగా గ్రామ గ్రాసపు పల్లె. ఆహార్యాభినయమే గ్రామ నామంగా స్థిరపడటం ఈ కళాక్షేత్ర విశిష్టత.

చారిత్రక ఆధారాల ప్రకారం, క్రీస్తు పూర్వం శాతవాహనుల కాలం నాటి 'గాథా సప్తశతి' లోనే ఈ భాగవతుల ప్రశస్తి కనిపిస్తుంది. తొలుత 'కుశలవపురి'గా పిలవబడి, ఆపై 'కుచేలపురి' గా మారి నేడు 'కూచిపూడి' గా స్థిరపడింది. దక్షిణ కాశీగా పేరొందిన పెద్ద కల్లేపల్లికి, క్షేత్రయ్య జన్మస్థలమైన మొవ్వకు చేరువలో ఉన్న ఈ గ్రామం, వేద విద్యలకూ, నాట్య విద్యలకూ పురుడు పోసిన పుణ్యభూమి.

షోడశ వంశాల సుకృతం - అఖండ గురుపరంపర కూచిపూడి అగ్రహారంలోని వేదాంతం, వెంపటి, తాడేపల్లి, చింతా, భాగవతుల, మహంకాళి, జోశ్యుల, పసుమర్తి వంటి పదహారు సుప్రసిద్ధ పండిత కుటుంబాలు ఈ కళాజ్యోతిని ఆరిపోకుండా కాపాడాయి. వీరు కేవలం కళాకారులు మాత్రమే కాదు, నిత్యం వేద పారాయణ అనుస్థాన నిత్యాగ్నిహోత్ర పండితులు.

ఆద్యులు: వెంపటి వెంకటనారాయణ, చింతా వెంకట్రామయ్య, తాడేపల్లి పేరయ్య శాస్త్రి, వేదాంతం లక్ష్మీనారాయణ శాస్త్రి వంటి మహనీయులు కూచిపూడికి శాస్త్రీయ బద్ధతను చేకూర్చారు.

- వారసులు: పద్మభూషణ్ డాక్టర్ వెంపటి చినసత్యం, పద్మశ్రీ వేదాంతం సత్యనారాయణ వంటి వారు ఈ కళను ప్రపంచ దేశాలకు విస్తరింపజేశారు.

భామాకలాపం: వేదాంత విజ్ఞాన - బ్రహ్మజ్ఞానాల సమ్మేళనం



కూచిపూడి నాట్య సర్వస్వంలో 'భామాకలాపం' ఒక మకుటాయమానమైన ప్రక్రియ. ఇది 'శ్రీగదితము' అనే ఉపరూపకానికి చెందినది. బాహ్యంగా ఇది శృంగార భూయిష్టంగా కనిపించినా, అంతరార్థంలో ఇది ఒక గొప్ప వేదాంత ప్రబోధం.

• జీవాత్మ - పరమాత్మ సంవాదం: ఇక్కడ సత్యభామ అంటే కేవలం ఒక నాయిక కాదు; ఆమె 'జీవాత్మ'. శ్రీకృష్ణుడు 'పరమాత్మ'. అహంకార మమకారాలనే ప్రతిబంధకాలను తొలగించుకుని, జీవాత్మ పరమాత్మలో ఎలా లీనం కావాలనేదే ఈ కలాప పరమార్థం.

• మాధవి పాత్ర విశిష్టత: సిద్ధేంద్ర యోగి సృష్టించిన 'మాధవి' పాత్ర అత్యంత రసభూయిష్టమైనది. మాధవి అంటే స్త్రీ రూపంలో ఉన్న శ్రీకృష్ణుని అంశ. సత్యభామలోని అజ్ఞానాన్ని పరీక్షించి, ఆమెను భగవంతుని వైపు నడిపించే గురువు ఈ మాధవి.



• సత్యభామ జడ - యోగ తత్వం: సత్యభామ ధరించే 'రత్నాల జడ' లో సిద్ధేంద్ర యోగి విశ్వచక్రాన్ని నిక్షిప్తం చేశారు. ఈ జడ యోగ తత్వానికి ప్రతీక. ఇది మూలాధార చక్రాన్ని స్పృశిస్తూ, కుండలినీ శక్తిని నిద్రలేపుతుంది. జడలోని షట్ చక్రాలను దాటినప్పుడే విశ్వమంతా ఆత్మస్వరూపంగా కనిపిస్తుంది.

రాజపూజితం - చారిత్రక సువర్ణాధ్యాయం కూచిపూడి భాగవతుల కళా తపస్సు చక్రవర్తులను సైతం మంత్రముగ్ధులను చేసింది.గోల్కొండ నవాబు తానీషా: భామాకలాప ప్రదర్శనకు ముగ్ధుడై, 70 కత్తుల భూమిని (కూచిపూడి అగ్రహారాన్ని) వారికి సర్వహక్కులతో దానం చేశారు.

• శ్రీకృష్ణదేవరాయలు: సత్యభామ పాత్రలోని వైదుష్యాన్ని మెచ్చి, వజ్రవైఢూర్య ఖచితమైన 'జడ'ను బహుకరించారు.

• త్యాగరాజ స్వామి: వీరి సంగీత వైశిష్ట్యానికి పరవశించి, తన 'భైరవి' రాగాన్ని ఈ పరంపరకు అంకితం ఇవ్వడం చరిత్రలో అరుదైన ఘట్టం.

మంత్ర సిద్ధం: నాట్యంలో దైవిక శక్తి కూచిపూడి భాగవతులు కేవలం నాట్యకోవిదులే కాదు, అఖండ మంత్రశాస్త్ర నిష్ణాతులు.

• తాడేపల్లి పేరయ్య శాస్త్రి గారు (1866): అఖండ బాల ఉపాసకులు. మంత్ర, తంత్ర, ఆగమ శాస్త్రాలలో వీరు దిట్టలు. వీరు సమాధి యోగం ద్వారా బ్రహ్మరంధ్రాన్ని ఛేదించి పరమాత్మలో ఐక్యమైన 'బ్రహ్మీభూతులు'.

• మంత్రశక్తి: ఒకానొక సందర్భంలో క్షుద్రశక్తిని ప్రయోగించిన మంత్రగాడిని తన మంత్రశక్తితో కట్టడి చేసి, రంగస్థల స్తంభం నుండి నీరు కారేలా చేసిన గాథలు వీరి ఆధ్యాత్మిక బలానికి నిదర్శనాలు. "దంతాలు లేని వానికి మంత్రశక్తి ఉండదు" అని నిరూపిస్తూ, కళాకారుల రక్షణ కోసం వారు మంత్రాన్ని శస్త్రంగా వాడేవారు.

8. బాలా త్రిపుర సుందరి అనుగ్రహం కూచిపూడి భాగవతుల ఇలవేల్పు ఆ 'బాలా త్రిపుర సుందరి'.

"అంబా పరాకు.. జగదమ్బా పరాకు.. మూడు మూర్తులకు మూలమైన బాలా పరాకు.." బీజాక్షర యుక్తమైన ఈ ప్రార్థన వెనుక ఒక దివ్య గాథ ఉంది. ముత్తైదువ రూపంలో సాక్షాత్కరించిన అమ్మవారు స్వయంగా ఒక వటవృక్షం నీడన కూర్చుని ఈ గీతాన్ని ప్రసాదించిందని ప్రతీతి. నవవిధ భక్తి మార్గాలలో 'కీర్తనం' ఏ స్థాయిలో భగవంతునికి చేరువ చేస్తుందో, నాట్యం కూడా అదే స్థాయిలో సాధకుడిని కైవల్యానికి చేరుస్తుంది.

నిత్యకల్యాణం - సరస్వతీ పీఠం నేడు కూచిపూడి గ్రామంలో అడుగుపెడితే... ఒకవైపు మృదంగ నిస్వనాలు, మరోవైపు వేదాంత శాస్త్ర చర్చలు, పగటి వేషధారుల చాతుర్యం, తాళపత్ర గ్రంథాల పరిశోధనల మధ్య ఆ గ్రామం ఒక 'సరస్వతీ పీఠం' వలె భాసిల్లుతోంది. నాట్యమే శ్వాసగా, మోక్షమే ధ్యాసగా బ్రతికిన కూచిపూడి భాగవతుల ప్రయాణం కేవలం కళా చరిత్ర కాదు.. అది ఒక ఆత్మ సాక్షాత్కార యజ్ఞం! తాళపత్ర గ్రంథాలలోని రహస్యాలను మధిస్తూ, వంశ పారంపర్య విద్యను కాపాడుకుంటూ వస్తున్న ఈ భాగవతుల అడుగుజాడల్లో నడవడం మనందరి బాధ్యత.

**- శ్రీమతి జ్యోత్స్న విక్కిరాల**
నాట్య పరిశోధకురాలు, నాట్య గురువు




(గత సంచిక తరువాయి)

ఇంటి కవసరమైన పదార్థములను తెచ్చుటకు బజారునకు బయలుదేరిన ఆ బాలకుడు మనసులో వేదాంత విషయములను స్మరించుచునో, దేవతాస్తోత్రములను పఠించుచునో, నడిచి నడిచి బజారును, ఊరును గూడ దాటి వెలుపలనున్న అడవుల వైపునకు పోవుచుండెడివాడు. ఎంతోదూరము పోయిన తరువాత బాహ్య ప్రజ్ఞ కలిగి తాను ఇంటి నుండి బయలుదేరినది బజారునకైనను చేరినది విపినముకని స్మృతికి వచ్చెడిది. ఆ వయస్సులోనే ఎంతటి తాదాత్మ్యము!

విద్యతోడనే వినయము, వినయముతోడనే శీలము, శీలముతోడనే సాత్వికత నృసింహునిలో వెలుగొందసాగినవి. గురుజనులయెడ గౌరవాదరములు, బంధుమిత్రుల యెడ ప్రీతివిశ్వాసములు, దీనులయెడ దయాదాక్షిణ్యములు అన్నిటిని మించి సర్వత్ర సమదృష్టియు వానియందు నెలకొనినవి.


నృసింహ భారతీ స్వామివారు 1907లో సంచారము బయలుదేరిరి. అప్పుడు నృసింహుడు పాఠశాలలో నింకను ప్రారంభవిద్యార్థి. శ్రీవారు తమ ఆశ్రయములో నున్న పండితుల కందరకు సమస్య నొకదానినిచ్చి తాము సంచారము నుండి తిరిగి వచ్చునప్పటికి సమాధానము సిద్ధము చేసి ఉంచవలెనని ఆజ్ఞాపించిరి. ఆ సందర్భమున నక్కడనే యుండిన నృసింహుడా సమస్యను వినెను. గురువర్యులు సంచారము ముగించుకొని శృంగేరికి వచ్చుచు మార్గమధ్యము నందున్న ఒక పల్లెకు వచ్చి విడిసియుండిరి. బాల నృసింహు డా సమస్యను పూరించి గురువర్యులకు తాను చేసిన సమస్యాపూరణమును నివేదించుటకు వారు విడిసియున్న గ్రామమునకు వచ్చెను. గురువులకు సాష్టాంగ ప్రణామ మొనరించి తాను సమస్యను పూరించితినని విన్నవించి దానిని వివరించెను. పెద్ద పెద్ద పండితులకు అలవిగాని ఆ సమస్యను ఈ బాలకు డత్యంత సరళముగా పూరించుటను విన్న అచ్చటి సభ్యులందరకు ఆశ్చర్యమయ్యెను. గురువర్యులు గూడ ఈ మేధావి బాలకుని ఎక్కువగా మెచ్చుకొని ప్రశంసించిరి.

ఇట్లు గురువుల అనుగ్రహము, భగవంతుని రక్ష, పెద్దల వాత్సల్యము, బంధుమిత్రుల ఆదరణము, ఆత్మీయుల విశ్వాసము మున్నగువానితో పెరుగుచు వచ్చిన నృసింహుడు సర్వ సద్గుణఖని యయ్యెను. అందర నాకర్షించు తేజః ప్రభావ మధికము కాసాగెను. విద్యార్థులు పాఠములలో తమకు కలిగెడి సందేహములను పరిహరించుకొనుటకు నప్పుడప్పుడతని నాశ్రయించుచుండెడివారు. ఉపాధ్యాయులు కూడ నొక్కొక్క సారి తరగతికి పాఠము చెప్పుమని నృసింహునే నియోగించుచుండెడివారు. పాఠము చెప్పుటకును, సహపాఠులకు కష్టమైన పాఠములను వివరించుటకును నృసింహునకు కష్టమే తోచెడిది కాదు. తానందరికంటె బుద్ధిమంతుడనని ఉపాధ్యాయులు తనయందపార విశ్వాసము చూపుచున్నారని నృసింహుడెన్నడు నహంకారము పొందలేదు. సరిగదా తన పాలబడిన ఇట్టి పనులను వినయవిధేయతలతో నొప్పికొని నిర్వహించెడివాడు.

పాఠశాల కప్పుడప్పుడు శ్రీ నృసింహభారతీ స్వామివారు ఎవరికిని తెలుపకుండగనే వచ్చుచుండుట కలదు. ఎట్టి సూచనయు లేకుండ అకస్మాత్తుగ వచ్చిన గురువర్యులను

చూచి తరగతియందలి విద్యార్థులును ఉపాధ్యాయులును తికమక పడుచుండిరి. గురువర్యులు మందస్మితముఖులై విద్యార్థులను ప్రశ్నలడుగుట మూలముగా పరీక్షించుచుందురు. ఇట్టి సందర్భములో గురువు లడిగిన ప్రశ్నలకు సరియైన సమాధానములు తెలిసియుండియు తబ్బిబ్బుపడి తప్పు చెప్పెడి విద్యార్థులే హెచ్చుమంది. అయినను నృసింహుడు మాత్రము సరికాని సమాధానము నెన్నడు చెప్పలేదు. ఉపాధ్యాయులు నిరీక్షించిన దానికి సమానముగా సరియయిన సమాధానములనే చెప్పి వారి మెప్పునకును శ్రీ గురువర్యుల కృపాశీర్వాద మునకును పాత్రుడగుచుండెడివాడు.

విద్యాభ్యాసమున నృసింహుని ప్రగతిని గూర్చి శ్రీ నృసింహ భారతీస్వామివారు ఉపాధ్యాయుల నుండి ఎప్పటికప్పుడు తెలిసికొనుచుండిరి. పరీక్షలలో విద్యార్థులు వ్రాసిన ఉత్తరపత్రికలను స్వామి వారు తామే స్వయముగా పరిశీలించెడివారు. నృసింహుని ఉత్తరపత్రికలు శ్రీవారికి తృప్తిని పరమసంతోషమును కలిగించుచు ఆ బాలకుని యందు వారుంచిన నిరీక్షకు తగినంత నమ్మకమును తోపజేసెడివి. గురువర్యులా బాలకుని తర్కశాస్త్ర వ్యాసంగ మొనర్చుటకు నియోగించిరి. అతని బుద్ధిమత్తకు ప్రతీకలై యున్న సమాధానపత్రములు అతని మేధావిత్తమును, శాస్త్రవిషయములందాతని కున్న విశేషమైన జ్ఞానమును వ్యక్తపరచు చుండెడివి. "సర్వజ్ఞం శ్రీ నృసింహం కురు శివ దయితే" అని జగన్మాతను ప్రార్థించుచుండెడి గురువర్యులు తమ ప్రార్థన ఫలించుచుండుటను తామే చూచి ఆనందముతో పులకితు లగుచుండిరి.




## 9

శ్రీ సచ్చిదానంద శివాభినవ నృసింహభారతీ స్వామివారు తమ దక్షిణదేశ సంచారము నుండి తిరిగి వచ్చుచు బెంగుళూరులో కొంతకాలము విడిసియుండిరి అక్కడ క్రీ.శ. 1907లో శ్రీ శంకరమఠము స్థాపితమైనది. ఆ మఠమునందు మీమాంసా వేదాంత శాస్త్రములలో ప్రౌఢ విద్యాభ్యాసమునకై ఒక మహాపాఠశాల గూడ స్థాపింప సంకల్పించిరి. ఆ పాఠశాల 1911లో భారతీయ గీర్వాణ ప్రౌఢవిద్యాభివర్ధినీ పాఠశాలయను పేరుతో ప్రారంభమయినది. అందులో ఏబదిమంది విద్యార్థు లను చేర్చుకొనుటకును, వారికి అనుకూలమైన నివాసస్థలముల నొసనగి అశన వసనాది సౌకర్యములు సమకూర్చుటకును పూర్వోత్తర మీమాంసాశాస్త్రములు, ధర్మశాస్త్రము, వేదభాష్యాది ప్రౌఢవిద్యలు ప్రాచీన పద్ధతిలో నేర్పుటకును ఏర్పాటు జరిగినది. ఈ పరీక్షలలో నుత్తేర్ణులైన విద్యార్థులకు జీవనమార్గము కల్పించు నేర్పాటు కూడ జరిగినది. వేదాంతము నందును, పూర్వమీమాంసా శాస్త్రమునందును పారంగతులైన గొప్ప విద్వాంసులు ఉపాధ్యాయులుగా నియమింపబడిరి. విద్యార్థు లకును, ఉపాధ్యాయులకును నివాసమున కనుకూలముగా నుండునట్లు దివాన్ మాధవరాయలుగారు శంకరమఠమునకు దగ్గరగానే గృహములను కట్టించి యిచ్చిరి. మఠమునకు వచ్చు రాబడిలో కొంతభాగమును ఆ పాఠశాల ఖర్చు వెచ్చములకై కేటాయించిరి. ఆ పాఠశాల ప్రారంభదినములలో ప్రౌఢ విద్యా వ్యాసంగమునకై ఎనిమిది మంది విద్యార్థులు వచ్చిరి.

తర్కశాస్త్ర వ్యాసంగమును పూర్తిచేసిన నరసింహశాస్త్రి గారికి పూర్వమీమాంసా శాస్త్రా ధ్యయనమున కవకాశము కల్పింపవలెనని శ్రీ జగద్గురువులు యోచన చేసిరి. అందుకే నరసింహశాస్త్రిని బెంగుళూరుకు పంపవలెనని ఆలోచించి తమ ఆప్తకార్య నిర్వాహకులైన శ్రీకంఠశాస్త్రిగారికి కబురంపి నరసింహశాస్త్రి బెంగుళూరు విద్యాభ్యాసమున కన్ని అను కూల్యములను కల్పింపవలెనని సూచించిరి.

శ్రీకంఠశాస్త్రిగారి నుంచి గోపాలశాస్త్రిగారికి కబురు వచ్చినది. శ్రీ గురువర్యుల యిచ్ఛను శ్రీకంఠశాస్త్రిగారి వలన గోపాలశాస్త్రిగారు తెలిసికొనిరి. తమ కుమారుని యందు మొదటినుండియు విశేషానుగ్రహము కలిగియున్న గురు వర్యుల ఈ ఆదేశము గోపాలశాస్త్రిగారి కత్యంత సంతోషము కలిగించినది కాని స్వల్పచింతకు గూడ కారణమయ్యెను. నరసింహశాస్త్రిగారిని బెంగుళూరుకు పంపించు విషయములో శ్రీకంఠశాస్త్రిగారు తమ సమ్మతిని సూచించిరి. గురువర్యుల ఇచ్ఛను నెరవేర్చుట ఎల్లరకు శ్రేయస్కరమనియు, పవిత్రమైన గుర్వాజ్ఞను శిరసావహించుటచే శ్రీవారికి సంతోషమగుట మాత్రమేగాక శాస్త్రిగారికిని వారి కుమారునకును శ్రేయస్కర మనియు హితమును చెప్పిరి. గోపాలశాస్త్రిగారు తమ నిర్ణయ మేమియు చెప్పక "శ్రీ గురువుల యిచ్ఛ యెట్లో అట్లే కానిండ"ని పలికి ఇంటికి పోయిరి.


నృసింహుని విద్యాభ్యాసము విషయములో పూర్వము నిదేరీతిగా జరిగినది. అప్పుడు మాధ్యమిక పాఠశాలలో ఆంగ్ల కన్నడ వ్యాసంగము పూర్తి చేసిన నరసింహుడు సంస్కృత పాఠశాలలో విద్యాభ్యాసము సాగింపవలెనని గురువర్యులు సూచించి యుండిరి. ఇప్పుడు తర్కవ్యాసంగము ముగించిన

కుమారుని బెంగుళూరు పాఠశాలకు పంపవలెనని గుర్వాజ్ఞ యయినది. ఇది గూడ పూర్వజన్మసుకృతమే. బాలకుని అదృష్టమే కదా! అయినను గోపాలశాస్త్రిగారి మనస్సు ఒక నిర్ధారణమునకు రాలేక ఎందుదో ఆందోళనమందెను. అందుచే శ్రీకంఠశాస్త్రిగారికి తమ నిర్ణయమును చెప్పకయే ఇంటికి బయలుదేరిపోయిరి.

తల్లి లక్ష్మమ్మకును విషయము తెలిసినది. గుర్వాజ్ఞ తమ అభ్యుదయమునకు అయినను కొంత ఆందోళనమునకు కారణ మయ్యెను. చాలామంది బిడ్డలను కోల్పోయిన ఆ దంపతులకు దక్కక దక్కక దక్కిన ఏకమాత్రపుత్రుడు నరసింహుడు. అతడు కొంచెము దూరముపోయి తమకు కనుపింపకుండినను వారి మనసంతయు వాని వైపనకే పరువెత్తుచుండును. వాడుండినవే వారికి వెలుగు, లేకున్నచో లేదు. ఇప్పుడా బాలకు నొక్కనినే బెంగుళూరుకు పంపించుటెట్లు? వాని నంతదూరము పంపించి విడిచి యుండుటకు వారిర్వురకు మనసొప్పలేదు. వాత్సల్యపూర్ణులైన ఆ తల్లిదండ్రులు తమ కుమారుడున్న చోటుననే తాము ఉండవలెననియు, తామున్న చోటునే తమ కుమారుడుండవలెననియు అభిలషించుచుండిరి. నేటివరకు తమ కనులముందే నడయాడుచు పెరిగిన బాలకుడు ఇప్పుడు తమనుండి దూరము పోవలెననిన తామే ఎట్లొప్పికొందురు. ఇంటిలో నా దంపతులు ఈ విషయమును గురించియే ఆందోళన పడుచుండగా మరొకమారు శాస్త్రిగారికి కబురు వచ్చినది. ఈసారి శ్రీకంఠశాస్త్రిగారి నుండి కాదు శ్రీ గురువర్యుల నుండియే వచ్చినది కబురు.

పుత్రస్నేహముచే కొట్టుమిట్టాడుచున్న మనస్సును ఎట్లో చిక్కబట్టుకొని మఠము నుండి కబురు తెచ్చిన వారి వెంబడి శాస్త్రిగారు గురుదర్శనార్థమై బయలుదేరిరి.

సాష్టాంగప్రణామ మాచరించిన శాస్త్రిగారిని నారాయణస్మరణ పూర్వకముగా గురువర్యు లాశీర్వదించిరి. నిలబడియే యుండి సంకోచము వలన ముఖము ముడుచుకొని యున్న శాస్త్రిగారిని కూర్చుండుడని సూచించిరి. గురువర్యుల శ్రీముఖము నుండి ప్రవహించు వాణి నాలకించుటకు శాస్త్రిగారు వినమ్ర శిరస్కులై కూర్చుండిరి. కుశల ప్రశ్నానంతరము నరసింహుని విద్యా ప్రగతిని మెచ్చుకొనుచు నాలుగు మాటలాడిన పిదప "శాస్త్రిగారూ! నరసింహుడు తర్కశాస్త్రాధ్యయనము పూర్తి చేసినాడు. ముందు చదువును గూర్చి మీరే మాలోచించితిరి?" అని గురువర్యు లడిగిరి. కొంతసేపు శాస్త్రిగారి కేమనుటకును తోచలేదు. తాము ఇంటిలో భార్యతో చర్చించుచున్న విషయమునకే ఇది పీఠికయని వారి కర్థమైనది. శాస్త్రిగారు వినమ్రతతో "పిల్లవాని ముందు చదువును గూర్చి యింతవరకు



నేనేమియు నాలోచింపలేదు. కాని శ్రీకంఠశాస్త్రిగారు బెంగుళూరు మహాపాఠశాలకు కుమారుని పంపవలెనని తమ ఆనతి యైనట్లు తెలిపినారు" అని విన్నవించిరి.

"ఔను. అదే మా అభిలాష. నరసింహుని ప్రగతిని, కీర్తి శ్రేయస్సును సమస్తమును ఆలోచించియే మేమా నిర్ణయమునకు వచ్చియున్నాము. అయినను తల్లిదండ్రులంగీకరింపనిదే మేమేమియు చేయుటకు సాధ్యము కాదుగదా" అని చిరునవ్వు నవ్వుచునే గురువులు పలికిరి.

"తమ మహదాజ్ఞను పరిపాలించుటే మాకును మా కుమారునకును శ్రేయస్కరమని మా నమ్మకము. కాని ఒకే ఒక యోచనతో మేము చింతపడుచున్నాము. మాది ఏకపుత్ర విచారము. మాకు దక్కినది వాడొక్కడే కదా! వాడు గూడ మా కనుల ముందు నుండి దూరమేగినచో ఏమగునో ఎట్లుందుమో యన్న భయముతోడి బెంగయే మా చింతకు కారణము" అని తడబడుచు శాస్త్రిగారు బదులు పలికిరి.

"దానిని గూర్చి యోచింపవలసిన అగత్యమే లేదు. నరసింహుడున్న చోటనే మీరు, మీరున్న చోటనే నరసింహుడు నుండవలయుననియే గదా మీ కోరిక. నరసింహుడు బెంగుళూరు పాఠశాలలో చేరుట నిశ్చయమైన వెంటనే మీరు కూడ బెంగుళూరులో నుండుట నిశ్చయమైనట్లే. ఇక్కడ మీ ప్రీత్యాదరములతో పెరిగిన బాలకుడు అక్కడ గూడ మీ ప్రీత్యాదరములతోనే పెరుగును. దీనికింత యోచ నెందులకు?"

(సశేషం)




(గత సంచిక తరువాయి)

## పదార్థం యొక్క స్థితులు

మన చుట్టూ ఉన్న ప్రతిదీ పదార్థం (matter). ఈ పదార్థం సాధారణంగా నాలుగు ప్రధాన స్థితులలో ఉంటుంది:

1. ఘనపదార్థాలు (Solids) : ఇవి నిర్దిష్ట ఆకారం, పరిమాణం కలిగి ఉంటాయి. వీటిలోని పరమాణువులు లేదా అణువులు చాలా దగ్గరగా, నిర్దిష్ట అమరికలో బంధించబడి ఉంటాయి. ఉదాహరణకు, రాయి, ఇనుము, కలప.

2. ద్రవాలు (Liquids) : వీటికి నిర్దిష్ట ఆకారం ఉండదు, కానీ నిర్దిష్ట పరిమాణం ఉంటుంది. ఇవి ఏ పాత్రలో పోస్తే ఆ పాత్ర ఆకారాన్ని సంతరించుకుంటాయి. వీటిలోని పరమాణువులు లేదా అణువులు ఘనపదార్థాల కంటే కొంచెం వదులుగా, ఒకదానికొకటి జారుతూ ఉంటాయి. ఉదాహరణకు, నీరు, పాలు, నూనె.

3. వాయువులు (Gases) : వీటికి నిర్దిష్ట ఆకారం గానీ, పరిమాణం గానీ ఉండదు. ఇవి ఏ పాత్రలో ఉంచితే ఆ పాత్ర మొత్తాన్ని ఆక్రమిస్తాయి. వీటిలోని పరమాణువులు లేదా అణువులు చాలా దూరంగా, వేగంగా కదులుతూ ఉంటాయి. ఉదాహరణకు, ఆక్సిజన్, గాలి, కార్బన్ డయాక్సైడ్.

4. ఈథర్‌లు (Ethers) : ఈ వాక్యంలో 'ఈథర్‌లు' అనే పదం ఆధునిక భౌతిక శాస్త్రంలో సాధారణంగా ఉపయోగించే 'ఈథర్' (ఒక రసాయన సమ్మేళనం) లేదా చారిత్రాత్మకంగా విశ్వాన్ని నింపే ఒక ఊహాత్మక మాధ్యమం (luminiferous aether) అనే అర్థంలో కాకుండా, పదార్థం యొక్క మరింత సూక్ష్మమైన లేదా ఉన్నతమైన స్థితిని సూచించడానికి వాడబడింది. ఇది ఘన, ద్రవ, వాయువుల కంటే కూడా సూక్ష్మమైన, ఇంద్రియాలకు గోచరం కాని ఒక స్థితి. కొన్ని ఆధ్యాత్మిక లేదా తాత్విక సందర్భాలలో 'ఆకాశం' లేదా 'ప్రాణశక్తి' వంటి వాటికి దగ్గరగా దీనిని ఉపయోగిస్తారు. ఇది మన భౌతిక ప్రపంచంలో కనిపించని, కానీ సైన్స్ ద్వారా గుర్తించబడే శక్తి క్షేత్రాలు లేదా కణాలు (ఉదాహరణకు, ప్లాస్మా లేదా బోస్-ఐన్‌స్టీన్ కండెన్సేట్ వంటి అత్యంత శక్తివంతమైన పదార్థ స్థితులు) లేదా ఇంకా సూక్ష్మమైన రూపాలను సూచిస్తుంది.

## ఒకే రకమైన పరమాణువులతో కూడి ఉండటం


పైన పేర్కొన్న అన్ని పదార్థ స్థితులు ఘన, ద్రవ, వాయు, మరియు ఈథర్ (ఇక్కడ సూక్ష్మ స్థితిని సూచిస్తుంది) అన్నీ కూడా పరమాణువులతోనే (atoms) నిర్మితమై ఉంటాయి. ఈ పరమాణువులు అన్నిటికీ ప్రాథమిక నిర్మాణ విభాగాలు. ఉదాహరణకు, ఒక మంచు ముక్క (ఘన), నీరు (ద్రవం), మరియు నీటి ఆవిరి (వాయువు) అన్నీ కూడా ఒకే రకమైన హైడ్రోజన్ మరియు ఆక్సిజన్ పరమాణువులతో ($H_2O$) ఏర్పడతాయి. వాటి మధ్య బంధాలు మరియు కణాల అమరికలో తేడా ఉండటం వల్ల అవి వేర్వేరు స్థితులలో ఉంటాయి.

ఈథర్ అనే భావన వచ్చినప్పుడు, అది కూడా ఈ ప్రాథమిక

పరమాణు నిర్మాణాల నుండే ఉద్భవించిన లేదా వాటితో సంబంధం ఉన్న ఒక సూక్ష్మ రూపంగా పరిగణించబడుతుంది. అంటే, స్థూలంగా కనిపించే ఘనపదార్థం నుండి అత్యంత సూక్ష్మమైన ఈథర్ వరకు, పదార్థం యొక్క అన్ని రూపాలు అంతిమంగా ఒకే ప్రాథమిక నిర్మాణ యూనిట్, అంటే పరమాణువులచే నిర్మించబడతాయి.

సారాంశం : మనం చూసే, చూడలేని పదార్థం యొక్క అన్ని రూపాలు, వాటి స్థితులు వేరువేరుగా ఉన్నప్పటికీ, మూలతః అన్నీ పరమాణువులతోనే నిర్మితమై ఉంటాయి. ఈ పరమాణువులు వివిధ స్థితులలో వేర్వేరుగా అమరి ఉండటం వల్ల పదార్థం ఘన, ద్రవ, వాయు, లేదా మరింత సూక్ష్మమైన "ఈథర్" వంటి రూపాలలో వ్యక్తమవుతుందని భావం)

ఈ ప్రపంచంలో భాగం కాని, మనకు కాని కొన్ని ఇతర ప్రపంచాలు ఉన్నాయని మనం పెద్దల ద్వారా విన్నాము, అవి చనిపోయిన తరువాత ఈ భూమి నుండి మానవులు వెళ్ళే లోకాలు. మనము త్రిలోకాల (మూడు లోకాలు) గురించి చదువుతాము. ప్రతి ఒక్కరూ వీటి గురించి కొంత తెలుసుకోవాలి. ఎందుకంటే ఈ మూడు లోకాలలో జీవుడు జనన మరణాల చక్రానికి కట్టుబడి ఉంటాడు. వీటిలో అతని పరిణామం కొనసాగుతుంది. ఈ మూడు ప్రపంచాలు బ్రహ్మ దినం అని పిలువబడే అపారమైన కాల ప్రారంభంలో తయారు చేయబడ్డాయి. బ్రహ్మదినపు ముగింపులో ఈ మూడు లోకాలు నశిస్తాయి. (పంద్రెండు మాసములు సంవత్సరము. ఇట్టి మూడువందల అఱువది సంవత్సరములు ఒక దేవ సంవత్సరము. పన్నెండువేల దేవసంవత్సరములు ఒక చతు ర్యుగము. అనగా కృతత్రేతద్వాపర కలియుగములు నాలుగు అగును. వేయిచతుర్యుగములు ఒక బ్రహ్మదినము. ఈ వివరణ బ్రహ్మ పురాణములో ఉన్నది.) బ్రహ్మాండాన్ని పూర్తి చేసే మరో నాలుగు గొప్ప లోకాలు లేదా ప్రపంచాలు బ్రహ్మ జీవితాంతం వరకు కొనసాగుతాయి. మేము ఇక్కడ వాటిని పేర్కొనటం లేదు. మహా లోకాలలో కొన్ని ఉపలోకాలు కూడా ఉన్నాయి. భువర్లోకంలో ప్రేతలోకం మరియు పితృలోకం, స్వర్గలోకంలో ఇంద్రలోకం మరియు సూర్యలోకం వంటివి ఉన్నాయి.


SANATANA DHARMA
AN ELEMENTARY TEXT-BOOK
OF
HINDU RELIGION AND ETHICS
PUBLISHED BY THE BOARD OF TRUSTEES
CENTRAL HINDU COLLEGE
BENARES
1916

మనకు సంబంధించిన మూడు ముఖ్యమైన లోకాలు, అంటే త్రిలోకాలు, ఇవి:

- భూర్లోకం (Bhûrloka) : ఇది భౌతిక ప్రపంచం, లేదా భూమి.
- భువర్లోకం (Bhuvarloka) : ఇది భూమికి, స్వర్గానికి మధ్యలో ఉంటుంది.
- స్వర్గలోకం (Svargaloka) : ఇది స్వర్గలోకం.


తాడేపల్లి పతంజలి

ఈ మూడింటిలో, భూర్లోకం పాక్షికంగా మనకు కనిపిస్తుంది, పాక్షికంగా కనిపించదు. భువర్లోకం మరియు స్వర్గలోకం పూర్తిగా అదృశ్యంగా ఉంటాయి.

భూర్లోకంలో, అన్ని రూపాలకు పృథ్వీ తత్త్వం ఆధారం. ఇది ఏడు రకాలుగా ఉంటుంది: ఘన (solid), ద్రవ (liquid), వాయు (gaseous), తేజోమయం (radiant), ఈథరిక్ (etheric), సూపర్-ఈథరిక్ (super-etheric), మరియు అణు (atomic). ఈ చివరి నాలుగు రకాలను "ఈథర్‌లు" అని పిలుస్తారు.


భువర్లోకంలో కూడా ఇలాంటి ఏడు రకాల రూపాలు ఉంటాయి, కానీ వాటికి ఆధారం అపస్ తత్త్వం. (నీటి తత్త్వం)

స్వర్గలోకంలో కూడా ఇలాంటి ఏడు రకాల రూపాలు ఉంటాయి, కానీ వాటికి ఆధారం అగ్ని తత్త్వం.

(అనువాద కర్త వివరణ)

భూర్లోకం అంటే మనం నివసించే భౌతిక ప్రపంచం, అంటే భూమి. ఈ ప్రపంచంలో కనిపించే ప్రతి రూపానికి, అది రాయి కావచ్చు, నీరు కావచ్చు, గాలి కావచ్చు లేదా మన కంటికి కనిపించనిది కావచ్చు - అన్నిటికీ పృథ్వీ తత్త్వం (Earth Element) ఆధారం అని ఇక్కడ చెప్పబడుతోంది. సాధారణంగా, పంచభూతాలలో (భూమి, నీరు, అగ్ని, గాలి, ఆకాశం) పృథ్వీ తత్త్వం అంటే స్థూలమైన భూమి అని అర్థం చేసుకుంటాం. కానీ ఇక్కడ, పృథ్వీ తత్త్వం అనేది కేవలం మట్టిని మాత్రమే కాకుండా, భౌతిక పదార్థం యొక్క వివిధ స్థితులను సూచిస్తుంది.

ఈ పృథ్వీ తత్త్వం ఏడు రకాలుగా వ్యక్తమవు



తుంది:

1. ఘన (Solid) : ఇది మనకు బాగా తెలిసిన పదార్థ స్థితి. రాయి, లోహాలు, చెట్లు, మనం కూర్చునే కుర్చీలు - ఇవన్నీ ఘన పదార్థాలే. వీటి అణువులు చాలా దగ్గరగా, స్థిరంగా బంధించబడి ఉంటాయి.

2. ద్రవ (Liquid) : నీరు, పాలు, నూనె వంటివి ద్రవాలు. వీటికి నిర్దిష్ట ఆకారం ఉండదు కానీ పరిమాణం ఉంటుంది. వీటి అణువులు ఘన పదార్థాల కంటే కొంచెం స్వేచ్ఛగా కదులుతాయి.

3. వాయు (Gaseous) : గాలి, ఆక్సిజన్, కార్బన్ డయాక్సైడ్ వంటివి వాయువులు. వీటికి నిర్దిష్ట ఆకారం గానీ, పరిమాణం గానీ ఉండవు. వీటి అణువులు చాలా దూరంగా, వేగంగా కదులుతాయి.



ఈ మొదటి మూడు స్థితులు మనకు సాధా రణంగా కనిపించే భౌతిక రూపాలు. అయితే, తదుపరి నాలుగు స్థితులు మరింత సూక్ష్మమైనవి, వీటినే "ఈథర్‌లు" అని పిలుస్తారు :

4. తేజోమయం (Radiant) : దీన్నే ప్లాస్మా స్థితి అని కూడా అనొచ్చు. ఇది అత్యంత వేడిమి వల్ల ఏర్పడే పదార్థ స్థితి, దీనిలో పరమాణువులు అయాన్లుగా విడిపోతాయి (అంటే వాటిలోని ఎలక్ట్రాన్లు వేరుపడతాయి). సూర్యుడు, నక్షత్రాలు, మెరుపులు, నియాన్ లైట్లు- ఇవన్నీ ప్లాస్మా రూపంలో ఉం టాయి. ఇది ఒక రకమైన కాంతి లేదా శక్తి రూపంగా కూడా కనిపిస్తుంది.

5. ఈథరిక్ (Etheric) : ఇది తేజోమయం కంటే కూడా సూక్ష్మమైన స్థితి. దీనిని భౌతిక పదార్థానికి, మరింత సూక్ష్మమైన లోకాలకు మధ్య వారధిగా భావిస్తారు. మన నాడీ వ్యవస్థ, శక్తి కేంద్రాలు (చక్రాలు) వంటివి ఈ ఈథరిక్ స్థాయిలో ఉంటాయని ఆధ్యాత్మికంగా చెబుతారు. దీనిని సాధారణ ఇంద్రియాలతో గుర్తించడం కష్టం.

6. సూపర్-ఈథరిక్ (Super-etheric) : ఇది ఈథరిక్ కంటే కూడా ఉన్నతమైన, మరింత సూక్ష్మమైన స్థితి. దీనిని ప్రాణశక్తికి లేదా జీవశక్తికి సంబంధించిన సూక్ష్మ రూపంగా భావించవచ్చు. ఇది అత్యంత వేగవంతమైన కంపనాలతో (vibrations) ఉంటుంది.


7. అణు (Atomic) : ఇక్కడ "అణు" అంటే మనకు తెలిసిన పరమాణువుల కంటే కూడా అత్యంత సూక్ష్మమైన ప్రాథమిక కణాలను సూచిస్తుంది. ఇది పదార్థం యొక్క మూలకణాలు విడిపోయి, వాటి ప్రాథమిక శక్తి రూపంలో ఉన్న స్థితి. ఇది పదార్థం యొక్క అత్యంత సూక్ష్మమైన, అంతర్లీనమైన స్థితిగా పరిగణించబడుతుంది.

ముఖ్యమైన విషయం ఏమిటంటే, ఈ ఏడు రకాల పదార్థ స్థితులు అన్నీ ఒకే పృథ్వీ తత్త్వం నుండి ఉద్భవించినవని, మరియు అన్నీ భౌతిక ప్రపంచంలోనే (భూర్లోకంలో) విభిన్న స్థాయులలో వ్యక్తమవుతాయని ఈ సిద్ధాంతం చెబుతుంది. మన ఇంద్రియాలు మొదటి మూడు స్థితులను మాత్రమే గుర్తించగలిగినప్పటికీ, మిగిలిన నాలుగు "ఈథరిక్" స్థితులు కూడా భూర్లోకంలోనే ఉనికిలో ఉన్నాయని, కాకపోతే అవి మనకు కనిపించవని లేదా స్పృశించడానికి వీలు కావని ఇక్కడ వివరణ. ఇది స్థూలమైన పదార్థం నుండి సూక్ష్మమైన శక్తి రూపాల వరకు విస్తరించి ఉన్న ఒక విస్తృతమైన పదార్థ భావన.)

జీవుడు ఈ లోకాలకు అనుగుణ మైన అన్నమయకోశం, ప్రాణమయ కోశం, మనోమయ కోశమను మూడు కోశాలను కలిగి ఉన్నాడు- అన్నమయ కోశ, లేదా ఆహారపు తొడుగు - మనం తిన్న ఆహారం నుండి నిర్మించబడినందున-దీనిని అన్నమయ కోశంగా పిలుస్తారు. ఇది మనకు కనిపించే భూ భాగంతో సంబంధం కలిగి ఉంటుంది. ఇది, పృథివీ, జల, వాయువులతో కూడి ఉంటుంది. (1. స్త్రీ, పురుషుల సంయోగం వల్ల శుక్ల శోణితాలు కలసి, పిండమై, పెరిగి, వివిధ అవయవాలతో జన్మించి, ప్రారబ్ధ కర్మలను అనుభవించి, పంచభూతాలలో లయమయ్యే స్థూల రూపం అన్నమయకోశం. అన్న రసంతో వృద్ధి పొంది, అన్న రసమయమయిన పృథ్వియందు లయమయ్యే ఈ అన్న కోశమే స్థూల శరీరం. 2. అన్నం తాలూకు సూక్ష్మమైన రూపం మనస్సు. దానికి సంబంధించిన కోశం అన్నమయ కోశం. ఇలా పెద్దలు ఈ అన్నమయ కోశాన్ని నిర్వచించారు) .

◆ ప్రాణమయకోశం లేదా ప్రాణశక్తి పొర : ఇది భూమి యొక్క కనబడని భాగానికి (సూక్ష్మ శరీరానికి) అనుగుణంగా ఉంటుంది. ఇది ఈథర్‌లతో (ముందు వివరించిన సూక్ష్మమైన పదార్థ స్థితులు) నిర్మితమై ఉంటుంది. ప్రాణం అనేది జీవశక్తి. సైన్స్ అయస్కాంత మరియు విద్యుత్ శక్తులు అని పిలిచే అన్ని శక్తులను ఇది కలిగి ఉంటుంది, కానీ ప్రాణం వాటికంటే చాలా ఎక్కువ.

(సశేషం)




సమాధానం: ఎంతటి మధురమైన, ఇష్టమైన తియ్యటి పదార్థం (పాయసం వంటిది) తింటున్నా, మధ్యమధ్యలో రుచిని మార్చడానికి, ఆ మధురాన్ని మరింత ఆస్వాదించడానికి కొంచెంఉప్పగాఉండే పదార్థం ఎలా అవసరమో, ఇక్కడ నా రచన కూడా అటువంటిదే.

విశేషార్థాలు:

- రుచ్యంతర యోజన: తీపి పదార్థం తిన్నతరువాత నోరు మొద్దుబారకుండా ఉండటానికి 'నిమ్మరసం' (నింబూరస) వంటి పుల్లని లేదా ఉప్పని పదార్థాలను ఎలాఉపయోగపడి రుచిని పెంచుతాయో (రుచ్యుత్పాదాయ), నా ఈ సాధారణ పద్యాల అమరిక (మత్పద్య నివేశ భంగీ) కూడా ప్రాచీన కవుల మనోజ్ఞమైన పద్యాల పట్ల పాఠకులకు మళ్ళీ కొత్త ఆసక్తిని, రుచిని కలిగిస్తుందనివిద్యారణ్యస్వామివారిభావం.
- వినమ్రత: పూర్వ కవుల పద్యాలు 'మధురమైనవి' అని చెబుతూ, తన పద్యాలు ఆ మధురాన్ని ఆస్వాదించడానికి తోడ్పడే 'రుచ్యంతరాలు' మాత్రమేనని కవితన వినయాన్ని చాటుకున్నారు.

**స్తుతోఽపి సమ్యక్ కవిభిః పురాణైః కృత్యాఽపి నస్తుష్యతు భాష్యకారః ।**
**క్షీరాబ్ధివాసీ సరసీరుహాక్షః క్షీరం పునః కిం చకమే న గోష్ఠే ॥ 4**

తాత్పర్యం: పూర్వకవులందరూ భాష్యకారులైన శ్రీశంకరులను ఎంతో గొప్పగా స్తుతించారు. అయినప్పటికీ, నా ఈ వినయపూర్వకమైన రచనతో ఆయన సంతుష్టుడు అవుతారని నమ్ముతున్నాను. సాక్షాత్తు క్షీరసముద్రంలో నివసించే ఆ కమలలోచనుడైన విష్ణుమూర్తి, కృష్ణావతారంలో గోపికల ఇళ్లలోని పాలను కోరుకోలేదా? (అంటే భగవంతుడు అర్పించే వస్తువు కంటే భక్తినే చూస్తారని భావం).

వ్యాఖ్య : ప్రశ్న (శంక): "పూర్వకాలం నుండి ఎందరో మహర్షులు, గొప్ప కవులు శంకర భగవత్పాదులను (భాష్యకారులను) అత్యద్భుతమైన స్తోత్రాలతో స్తుతించారు. మరి నీవు చేసే ఈ స్వల్పమైన రచనతో ఆ మహానుభావుడు ఎలా తృప్తి చెందుతాడు?" అని ఎవరైనా ప్రశ్నిస్తే, దానికి సమాధానం ఇక్కడ ఉంది:

సమాధానం: సాక్షాత్తు పరమేశ్వరుడైన శంకరుడు 'ఆప్తకాముడు' (అన్ని కోరికలు తీరినవాడు). ఆయనకు కావాల్సింది పాండిత్యం కాదు, భక్తి. భక్తితో సమర్పించేది చిన్నదైనా ఆయనకు అది ఎంతో ప్రీతిని కలిగిస్తుంది.

విశేషార్థాలు:


- బహువచన ప్రయోగం: ఇక్కడ 'నః' (మమ్ములను/మా యొక్క) అనే బహువచనాన్ని వాడారు. ఇది రచయిత యొక్కవాక్కు, మనస్సు మరియు కాయము (శరీరము)అనే త్రికరణాలను సూచిస్తుంది. అంటే తన సర్వస్వాన్ని అర్పించి ఈ రచన చేస్తున్నానని భావం.
- క్షీరాబ్ధివాసీ - గోష్ఠే: దీనికి విద్యారణ్య స్వామివారు ఒక అద్భుతమైన ఉదాహరణ ఇచ్చారు. సాక్షాత్తు క్షీరసముద్రంలో నివసించేవాడు, పద్మముల వంటి కన్నులు కలిగినవాడు అయిన ఆ విష్ణుమూర్తి, కృష్ణావతారంలో ఉన్నప్పుడు ఆనందంతో

'గోష్ఠము' (గోపికల నివాస ప్రాంతం) లో గోపికలు భక్తితో ఇచ్చేకొద్దిపాటి పాలనుఎందుకు కోరుకున్నాడు? తన వద్ద పాల సముద్రమే ఉన్నా, గోపికల ప్రేమతో కూడిన ఆ స్వల్ప క్షీరం ఆయనకు పరమానందాన్ని ఇచ్చింది.

◆ దృష్టాంతాలంకారం: పూర్వకవుల స్తుతిని 'క్షీరసముద్రం' తోనూ, తన అల్పమైన స్తుతిని గోపికల ఇళ్లోని 'చిన్న గిన్నె పాలు'తోనూ పోల్చడం వల్ల ఇక్కడ 'దృష్టాంతాలంకారం' ఏర్పడింది. బింబ-ప్రతిబింబ భావం (ఒకదానిని చూసి మరొకటి గుర్తుకు రావడం) ఇక్కడ స్పష్టంగా కనిపిస్తుంది.

**పయోబ్ధివివరీసునిఃసృతసుధాఝురీ మాధురీ-**
**ధురీణభణితాధరీకృతఫణాధరాధీశితుః ।**
**శివంకరసుశంకరాభిధజగద్గురోః ప్రాయశో**
**యశో హృదయశోధకం కలయితుం సమీహామహే ॥ 5**

తాత్పర్యం: క్షీరసముద్రం నుండి ఉద్భవించిన అమృత ధారల మాధుర్యాన్ని మించినది, సాక్షాత్తు ఆదిశేషుడు కూడా గర్వపడేంతటి అద్భుతమైన వాక్చాతుర్యం కలిగినది అయిన జగద్గురువు శ్రీశంకరుల కీర్తిని వర్ణించడానికి నేను (విద్యారణ్య స్వామివారు) ప్రయత్నిస్తున్నాను. వారి చరిత్రను కీర్తించడం మన హృదయాలను శుద్ధి చేస్తుంది.




1. నామ వైశిష్ట్యం (శివంకర - సుశంకర): భగవత్పాదులైన భాష్యకారులకు 'శివం కరుడు' మరియు 'సుశంకరుడు' అనే పేర్లు ఎందుకు వచ్చాయో ఇక్కడ వివరిస్తున్నారు:

◆ శివంకర: 'శివం' అంటే మంగళం లేదా సుఖం. లోకానికి మంగళాన్ని కలిగించేవాడు కాబట్టి ఆయన శివంకరుడు.

◆ సుశంకర: అత్యంత శ్రేష్ఠమైన రీతిలో సుఖాన్ని ప్రసాదించేవాడు కాబట్టి ఆయన 'సుశంకరుడు'. అలాంటి జగద్గురువు యొక్క యశస్సును (కీర్తిని) వర్ణించడానికి, తద్వారా మన హృదయాలను శుద్ధి చేసుకోవడానికి (హృదయ శోధకం) మేము ప్రయత్నిస్తున్నాము. ఇక్కడ 'సమీహామహే' అంటే కేవలం కోరుకోవడం మాత్రమే కాదు, ఆ దిశగా గొప్ప ప్రయత్నం (సమ్యక్ చేష్ట) చేస్తున్నాము అని అర్థం.

2. వాక్చాతుర్యం (అమృత మాధుర్యం): శంకరుల వాక్కులు ఎంతటి మధురమైనవో ఒక అద్భుతమైన పోలికతో విద్యారణ్య స్వామివారు వివరించారు:

◆ క్షీరసముద్రం లోపల ఉండే అతి సూక్ష్మమైన రంధ్రాల (వివరీభ్యః) నుండి అతి సున్నితంగా ప్రవహించేఅమృత ధారల మాధుర్యాన్నికూడా మించిపోయేవి శంకరుల భాషితాలు.

◆ ఆయన మాటల ముందు సాక్షాత్తు వెయ్యి తలల ఆదిశేషుడు (సర్పాధిపతి) కూడా తల వంచుకోవాల్సిందే. అంటే, ఆదిశేషుడి పాండిత్యం కూడా శంకరుల వాక్ ప్రవాహం ముందు చిన్నబోతుంది.

3. సాహిత్య విశేషాలు (శబ్దాలంకారం మరియు ఛందస్సు): ఈ శ్లోకంలో కవి మాధవాచార్యులవారు అద్భుతమైన కవితా శిల్పాన్ని ప్రదర్శించారు:

◆ వృత్త్యనుప్రాస: ఈ శ్లోకంలో 'ర' అనే అక్షరం పదే పదే రావడం వల్ల (రేఫస్య అసకృదావృత్యా) వినడానికి ఎంతో ఇంపుగా ఉంటుంది. దీనిని 'శబ్ద టంకారము' అని కూడా అంటారు.

◆ పృథ్వీ వృత్తం: ఈ శ్లోకం 'పృథ్వీ' అనే ఛందస్సులో ఉంది.

**కేమే శంకరసద్గురోర్గుణగణా దిగ్జాలకూలంకషాః**
**కాలోన్మీలితమాలతీ పరిమలావష్టమ్భ ముష్టింధయాః ।**
**క్వాహం హంత తథాఽపి సద్గురుకృపాపీయూషపారంపరీ-**
**మగ్నోన్మగ్నకటాక్షవీక్షణబలాదస్తి ప్రశస్తాఽర్హతా ॥ 6॥**

తాత్పర్యం : నది రెండు గట్లు తెంచుకుని ప్రవహించే వరదలాగా, శంకరాచార్యులవారి కీర్తి దిగంతాలకు వ్యాపించింది.

వసంత, శరదృతువులలో వికసించి సువాసనలు వెదజల్లే మల్లెపూలు సైతం, గురువుగారి సద్గుణాల పరిమళం ముందు వెలవెలబోయి సిగ్గుపడుతున్నాయి. (అనగా ఆయన గుణాలు మల్లెపూల కన్నా పవిత్రమైనవి, సుగంధభరితమైనవి).

"అంతటి మహానుభావుడి చరిత్ర రాయడానికి నేనెంతటివాడిని? నా శక్తి చాలా స్వల్పం. కానీ, నా గురువుగారి కరుణాకటాక్షం అనే అమృతం నాపై కురుస్తోంది. ఆ కృపా బలంతోనే నేను ఈ పవిత్ర చరిత్రను పూర్తి చేయగలను"

వ్యాఖ్య : 'సదేవ సోమ్యేదమగ్ర ఆసీదేకమేవాద్వితీయమ్' (ఓ సౌమ్యుడా! సృష్టికి పూర్వం అద్వితీయమైన పరమాత్మ ఒక్కడే ఉన్నాడు) వంటి శ్రుతి వాక్యాల ద్వారా బోధించబడే అద్వైత తత్త్వాన్ని ఉపదేశించే సద్గురువుల (శంకరాచార్యుల) గుణగణాలను ఇక్కడ వర్ణిస్తున్నారు.

(సశేషం)

# శ్రీమద్దేవీభాగవతం

## నవమ స్కందం



(గత సంచిక తరువాయి)

తనను సంతృప్తి పఱచిన వానిని మెచ్చుకొంటుంది. సంతృప్తి పఱచనివానిని చీదరించుకొంటుంది. దుఃఖిస్తుంది. తన కంటికి నచ్చిన వానిని యౌవనం కలిగిన వానిని, గుణ రూప రసికుని మాత్రమే స్త్రీ కామిస్తుంది. ముసలివానిని, ఓపికలేనివాడిని, శత్రువును చూసినట్లు చూస్తుంది. కలహిస్తుంది. పాము ఎలుకను పట్టుకొన్నట్లుగా, మాటలతో పట్టుకొని అనగా అనరాని మాటలని హింసిస్తుంది. బ్రహ్మవిష్ణుమహేశ్వరులను కూడా మోహితులను చేసేది మానినియే. ఈ శరీరం మలమూత్ర నిలయం. దీనిపై ఎందుకు మోహం?

తులసి ఇలా అనగానే శంఖచూడుడు ఆమెకు సమాధానం ఇస్తూ అన్నాడు -- నీవన్న మాటలు కొన్ని నిజమే. కొన్ని అసత్యాలు. బ్రహ్మ ఉత్తమ స్త్రీని, అధమ స్త్రీని కూడా సృష్టించాడు. లక్ష్మి, సరస్వతి, దుర్గ, సావిత్రి, రాధ- ఈ ఐదుగురూ త్రిమూర్తులకు కూడా అతీతురాండ్రు. సృష్టికి మూలకారిణులు. వీరి నుండి ఆవిర్భవించిన స్త్రీలు శుభస్త్రీలు. శతరూప, దేవహూతి, స్వధ,స్వాహా, దక్షిణ, ఛాయావతి, రోహిణి, వరుణపత్ని,శచి, కుబేరపత్ని, అదితి, దితి, లోపాముద్ర, అనసూయ, కోటభి, తులసి, అహల్య, అరుంధతి, మేనక, తార,మండోదరి, దమయంతి, వేదవతి, గంగ, మానస, పుష్టి, తుష్టి,స్మృతి, మేధ, కాళిక, వసుంధర,షష్ఠి, మంగళచండి, మూర్తి, ధర్మకామిని, స్వస్తి, శ్రద్ధ, శాంతి, కాంతి, క్షాంతి, నిద్ర,క్షుత్తు, పిపాస, సంధ్య, రాత్రి, దినములు, సంపత్తి,ధృతి, కీర్తి, క్రియ, శోభ, ప్రభ, శివ, - వీరంతా ప్రతియుగంలో ఆవిర్భవించే ఉత్తమ స్త్రీలు. స్వర్గ లోకంలోని అప్సరః స్త్రీలు ప్రశంసార్హత లేనివారు. సత్త్వప్రధానసాధ్వీ రూపం ఉత్తమమైనది. పండితులు సాత్త్విక స్త్రీలను ప్రశంసిస్తారు. భిన్న భిన్న కళలతో రజోరూపం, తమోరూపం కల స్త్రీలుంటారు. రజోగుణ కళతో పుట్టిన వారు మధ్యమ స్త్రీలు. తమోగుణాంశతో పుట్టిన వారు అధమ స్త్రీలు. ఇది ప్రక్కన పెడదాం. నేనిపుడు బ్రహ్మ పంపగా వస్తున్నాను. నా పేరు శంఖచూడుడు. నిన్ను గాంధర్వ వివాహం చేసుకొంటాను. దేవతలను కూడా జయించగల దానవ వీరుడను. ఒకప్పుడు విష్ణువు అనుచరుడను. సుదాముడను. శ్రీకృష్ణుని దగ్గర ఉండే ఎనిమిదిమంది గోపాలకులలో ప్రధానుడను. రాధా శాపం వల్ల రాక్షసుడను అయ్యాను. నాకు, నీకు కూడా పూర్వజన్మ జ్ఞానం ఉంది. నీవు తులసివి. రాధా శాపం వల్ల భూలోకంలో భరత వర్షంలో జన్మించావు. నేను నిన్ను ఆకాలంలో ప్రేమించాను. రాధానుగ్రహం లేక అది ఫలించలేదు.



డా॥ వద్దిపర్తి పద్మాకర్

శంఖచూడుని మాటలు విన్న తులసి సంతోషించి ఇలా అంది. నీ వంటి బుధుడు లోకంలో నిత్యం పొగడబడతాడు. నీ వంటి వానిని స్త్రీ ప్రేమిస్తుంది. నీ సత్య వాక్కులతో నన్ను జయించావు. ఆడుదాని చేతిలో ఓడిపోయిన వాడిని లోకం నిందిస్తుంది. నీ విద్యాశక్తిని పరీక్షించాను. వివాహం చేసుకోబోయే ముందు, వరుడిని పరీక్షించడం స్త్రీ ధర్మం. గుణహీనుడు, వృద్ధుడు, అజ్ఞాని, దరిద్రుడు, మూర్ఖుడు, రోగి,కుత్సితుడు, అత్యంత కోపం కలవాడు, దుర్ముఖుడు, కుంటివాడు, అంగహీనుడు, అంధుడు, చెవిటివాడు, జడుడు,మూగవాడు, నపుంసకుడు, పాపి అయిన వరునకు పిల్లనిచ్చేవాడు బ్రహ్మహత్యా పాపం

పొందుతాడు. శాంతుడు, గుణి, యువకుడు, పండితుడు, సాధువు, అయినవరునకు కన్యాదానం చేయడం వల్ల పది యజ్ఞాలు చేసిన ఫలం లభిస్తుంది. కూతురును పెంచి, డబ్బు కోసం అమ్ముకొనేవాడు కుంభీపాక నరకంలో పడతాడు. తానమ్మిన కన్య యొక్క మలమూత్రాలను కుంభీపాక నరకంలో తింటాడు. 14మంది ఇంద్రుల జీవితకాలం, ఆ వ్యక్తి నరకంలో ఉండి, క్రిముల చేత, కాకుల చేత తినబడతాడు.



అనంతరం భూలోకంలో రోగిగా పుడతాడు. మాంసం అమ్ముతూ, మోస్తూ బ్రతుకుతాడు. ఇలా తులసి పలికిన వెంటనే బ్రహ్మ అక్కడకు వచ్చాడు. శంఖచూడా!ఈమెను గాంధర్వ వివాహం చేసుకో!, తులసీ !నీవుశంఖచూడుని భర్త గా స్వీకరించు. ఇతడుఉత్తమ జాతులను జయించగల వీరుడు. ఈతనికి భార్యవై సౌభాగ్యాలు పొందు. అనంతరం గోలోకం చేరి శ్రీకృష్ణుని అనుగ్రహం పొంది శంఖ చూడ మరణానంతరం చతుర్భుజ నారాయణుని, వైకుంఠంలో సేవించి తరించు.

ఇలా బ్రహ్మ వారితో పలికి, తన లోకానికి వెళ్ళాడు. శంఖచూడుడు తులసిని గాంధర్వ వివాహం చేసుకొన్నాడు. ఆమెతో అనేక భోగాలు అనుభవించాడు. శంఖచూడుడు త్రిలోకాలలో దుర్లభాలైన అనేక వస్తువులను ఆమెకు ఇచ్చాడు. వరుణుని రత్నమాల, వస్త్రాలు, స్వాహాదేవి యొక్క నూపురాలు, ఛాయాదేవీ భుజకీర్తులు, రోహిణీ కుండలాలు, రతీదేవి యొక్క రత్నాంగుళీయకాలు, గాజులు, విశ్వకర్మ ఇచ్చిన శంఖం, విచిత్ర పద్మాలు, శయ్య, భూషణాలు తులసికి శంఖచూడుడిచ్చాడు.

(సశేషం)




# శ్రీ సాందీపని గురుకుల సేవాట్రస్ట్

**Founded By:Maharanyam Sri Sri MuraliDhara Swamiji (Chennai)**



Sri Hari

మన సనాతన ధర్మంలో మన జీవన ఆధారం వేదం, వేదం మన హిందూ ధర్మానికి భారతదేశానికి హృదయం వంటిది. ఎటువంటి సౌకర్యాలు లేని ప్రాచీన కాలంలో ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొని మహాత్ములు,ఋషులు చాలా కష్టపడి వేదాన్ని సంరక్షించి ఇప్పుడు మన తరానికి అందించారు. వాళ్ళు అందించిన వేదాన్ని కాపాడవలసిన బాధ్యత మన అందరి మీద ఉన్నది.

హైదరాబాద్ నగరంలో ECIL సాకేత్, కాప్రా నందు శ్రీ ప్రేమిక వేదాశ్రమం అను పేరుతో శ్రీ కృష్ణ యజుర్వేద పాఠశాల నిర్వహింపబడుతున్నది, కావున ఆస్తిక జనులందరూ ఈ వేద పాఠశాలకు ధన, వస్తు రూపేణ సహాయ సహకారములు అందించి ఆ వేదమాత యొక్క అనుగ్రహమునకు పాత్రులు కాగలరని కోరుకుంటున్నాము.


ఈ వేద పాఠశాల యందు బ్రాహ్మణ సమారాధన తమ తమ గోత్ర నామములతో చేయించుకున్న వారికి ప్రసాదముగా కుంకుమ, మంత్రాక్షతలు తగు రసీదు పంపడం జరుగుతుంది.

ఆ వేదమాత యొక్క అనుగ్రహం అందరికీ లభించుగాక

Donation Type:One Day Samaradhana-Rs.5000/- One Vidhyarthi Expenses/Month-Rs.8000/- One Day Patasala Expenses-Rs.14000/-
Donations can be made by cheques favoring '' SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.)''
donation can be made by online fund transfer : IFSC Code : **SBINOO12739**
Account Number : **34134951509** Name : SRI SANDEEPANI GURUKULA SEVA TRUST (A.P.),
Branch : SAKETH (HYDERABAD) UPI:ssgsthyd@icici

**Donations are eligible for exemption U/S 80G of Income - Tax Act**

**Admin & Patasala Address : Door no.1-1-31/399A, Lane - 26,Phase-1 Saket nagar,Saket, Kapra, Hyderabad-62. cell:9440875114 - 8667000419**




# మహాభారతసారసంగ్రహము

153


కీ.శే. ఆచార్య పుల్లెల శ్రీరామచంద్రుడు

(గత సంచిక తరువాయి)

తద్వాక్యం పార్థివాః సర్వే హృదయైః సమపూజయన్,
న తత్ర కశ్చిద్వక్తుం హి వాచం ప్రాక్రామదగ్రతః

(ఉద్యోగపర్వం 95.63)

### దంభోద్భవుని వృత్తాంతం

అందరూ మౌనంగా కూర్చొని ఉండగా పరశురాముడిలా అన్నాడు- "రాజా! నేనొక కథ చెపుతాను. దానిలో ఏదైనా మంచి అంశం ఉందని తోస్తే గ్రహించుము."

పూర్వం దంభోద్భవుడను ఒక సార్వభౌముడుండేవాడు. అతడు సకల భూమండలమూ జయించి అనుభవించాడట. అతడు ప్రతిరోజూ కూడ ప్రొద్దుటనే లేచి బ్రాహ్మణులనూ, క్షత్రియులనూ పిలిచి- "యుద్ధంలో నాకంటె చాలా బలవంతుడు గాని, నాతో సమానుడు గాని ఎవడైనా ఉన్నాడా" అని అడుగుతూండేవాడట. ఇలా గర్వం మంచిది కాదని చాలామంది బ్రాహ్మణులు అతనికి బోధిస్తూండేవారట.

ఒకనాడు అతి గర్వాతిశయంతో మాటలాడుతూన్న వానితో కొందరు బ్రాహ్మణులు- "గంధమాదనపర్వతం మీద నర-నారాయణు లను ఇద్దరు తాపసు లున్నారు. నీవే నాటికీ వాళ్లతో సమానుడు కాజాలవు" అన్నారు.

వెంటనే అతడు షడంగసైన్యం (బండ్లు, ఒంటెలు కలిస్తే షడంగ బలం) తో వెళ్లి నేను మీతో యుద్ధానికి వచ్చానని నర-నారాయణులతో అన్నాడు.

"ఇది ద్వేషాలకు యుద్ధాలకు అవకాశం ఉన్న భూమి కాదు. ఇది పుణ్యభూమి. పృథివి మీద ఎందరో మహావీరులైన క్షత్రియులున్నారు కదా; వాళ్ల దగ్గరికి వెళ్లు" అని వాళ్లు ఎంత చెప్పినా ఆ రాజు వినలేదు.

అప్పుడు నరుడు ఒక గుప్పెడు ఇషీకలు (ఒక గడ్డి) తీసికొని, "సరే! యుద్ధానికి రా" అన్నాడు. ఆ రాజూ సైన్యమూ కూడ ఆ మునిని చంపడానికై బాణవర్షం కురిపించారు. నరుడు వాటి నన్నింటినీ వ్యర్థమయ్యే టట్లు చేసి ఇషీకలు విసిరాడు. అవి వాళ్లందరి ముక్కులలోను, చెవులలోను, కళ్లలోను గుచ్చుకొని బాధించడం ప్రారంభించాయి. వెంటనే ఆ రాజు నరుని పాదాలమీద పడి వేడుకొన్నాడు.

అప్పు డా ముని అతనికి తగువిధాల ఉపదేశించి "ఇతరుల

బలాబలాలను తెలిసికొనకుండా ఎవరినీ చులకనగా చూడకు" అని చెప్పి పంపివేశాడు.

రాజా! ఆ విధంగా దంభోద్భవుణ్ణి పరాభవం పొందించిన నరునికంటె కూడ నారాయణుడు గొప్పవాడు. ఆ నరనారాయణులే అర్జునవాసుదేవులు. ఈ విషయం తెలిసికొని మీరు యుద్ధం నుండి విరమించడం మంచిది.

**మాతలి ఉపాఖ్యానం**

పరశురాముని మాటలు విని కణ్వమహర్షి సుయోధనునితో ఇలా అన్నాడు. లోకపితామహుడైన బ్రహ్మదేవుడు, నర-నారాయణులు, సనాతనుడైన విష్ణువు వీరు నలుగురు మాత్రమే అంతరహితులు. మిగిలిన దేవతలు అందరూ నశిస్తూ మరల పుడుతూ ఉంటారు. మానవుల మాట చెప్ప నవసరమే లేదు. వీళ్ల జీవితాలు క్షణికాలు. సుయోధనా! నేను బలవంతుణ్ణి అని ఎవ్వడూ, ఎన్నడూ అనుకొనకూడదు. ఒకణ్ణి మించి ఒకడు బలవంతుడు ఉంటూనే ఉంటాడు.

ఈ విషయంలో ఒక కథ చెపుతాను, విను.

మూడు భువనాలకీ ప్రభువైన ఇంద్రుని సారథి మాతలి అనే వాడున్నాడు.

అతనికి సర్వలక్షణసంపన్న యైన, మహాసౌందర్యవతి యైన కుమార్తె ఉండేది. ఆమె పేరు గుణకేశి.

ఆమెకు వివాహయోగ్య మైన వయస్సు వచ్చింది. ఆమెను ఎవరికిచ్చి వివాహం చెయ్యాలా అని మాతలి ఎంతగా ఆలోచించినా దేవ-దైత్య-గంధర్వ-మానవులలో తగిన వరు డెవ్వడూ కనబడలేదు.

ఒకనాడు భార్యయైన సుధర్మతో ఆలోచించి, తన కుమార్తెకు తగిన వరుడు నాగలోకంలో దొరకవచ్చు నని నిశ్చయించుకొని బయలుదేరాడు.

దారిలో నారదమహర్షి కనబడ్డాడు. "మాతలీ! ఎక్కడికి వెడుతున్నావు; స్వంత పనిమీద వెడుతున్నావా దేవేంద్రుడు పంపగా అతని పనిమీద వెడుతున్నావా?" అని నారదుడడిగాడు.

మాతలి తాను వెడుతున్న పని చెప్పాడు. "నేను కూడ వరుణదేవుణ్ణి చూడడానికి వరుణలోకం వెడుతున్నాను. ఇద్దరమూ కలిసే వెడదాం; నడు" అన్నాడు నారదుడు. వరుణుని దగ్గరికి వెళ్లి అతని ఆతిథ్యాదులు స్వీకరించి, వరాన్వేషణకై, ఇద్దరూ నాగలోకం వెపు బయల్దేరారు. నారదునికి ఆ ప్రదేశాలన్నీ చిరపరిచితా లవడం చేత అన్ని ప్రదేశాలను గూర్చీ అక్కడివాళ్లనందరినీ గూర్చీ మాతలికి వర్ణించి చెప్పాడు. వరుణలోకంలోని విచిత్ర ప్రదేశాలన్నీ చూపించి ఇవి చూస్తూ ఉంటే కాలం మించిపోతుంది అంటూ ముందుకు తీసుకొని వెళ్లాడు.



చాలా దూరం ప్రయాణం చేసిన తరువాత - "ఇది నాగలోకానికి నాభిస్థానం పాతాళం. ఇక్కడ దైత్యులూ, దానవులూ ఉంటారు" అని చెపుతూ "ఇక్కడ నీ కెవరైనా నచ్చితే చెప్పు, వెళ్లి వాళ్లతో మాటలాడతాను" అన్నాడు నారదుడు.

అక్కడనే ఒక జాజ్వల్యమానమైన పెద్ద అండం (గ్రుడ్డు) చూపించి "జగత్ సృష్టి అయిన నాటి నుండీ ఇది ఇలాగే ఉంది. దీని తల్లి ఎవరో, తండ్రి ఎవరో ఎవరికీ తెలియదు. ప్రళయకాలంలో దీని నుండి మహాగ్ని బయలుదేరి భువనత్రయాన్నీ కాల్చివేస్తుంది అని చెపుతారు" అని మాతలికి చెప్పాడు.

"ఇక్కడ మనకు తగినవా డెవ్వడూ కనబడడం లేదు; ముందుకు వెడదాం అన్నాడు మాతలి. నారదుడు హిరణ్యపురానికి తీసికొని వెళ్లి, ఇది దానవులు నివసించే నగరం. వీళ్లను దేవతలు ఏమీ చేయజాలరు. వీళ్లు గొప్ప మాయాబలం ఉన్నవాళ్లు. ఇక్కడ నీకు నచ్చిన వరు డెవడైనా ఉంటాడేమో చూచుకో" అన్నాడు.

"భ్రాతలైన దేవ-దానవులు నిత్య విరోధులు కదా? మా దేవతల శత్రువులతో సంబంధం చేసికొనడం మంచిది కాదు" అని మాతలి అన్నాడు.

తరువాత వాళ్లిద్దరూ గరుడ లోకానికి వెళ్లారు. అక్కడ నారదుడు గరుడ సంతతికి చెందిన సుపర్ణులను గూర్చి వర్ణించి చెప్పాడు. వీళ్లందరూ విష్ణుభక్తులు. విష్ణువునే స్మరించుకొంటూ ఉంటారు అని అంటూ కొంతమంది ప్రముఖుల నామధేయాలు కూడ చెప్పాడు.

అక్కడ కూడ తగిన వాళ్లెవరూ లభించకపోవడంతో కామధేనువు సంతతికి చెందిన సురభుల లోకమైన రసాతలం అనే ఏడవ పృథివీతలానికి వెళ్లాడు. "ఈ లోకంలో పాల నురుగు మాత్రమే భక్షించి జీవిస్తూ తపస్సు చేసికొన్న ఫేనపులు అనే మునులు నివసిస్తూంటారు. వీళ్లకి దేవతలు కూడా భయపడతారు.

సురభిలోకంలోని సురభుల పాలను సాగరజలంతో కలిపి పూర్వం దేవాసురులు మథించి అమృతాదులు సంపాదించారు. రసాతలం వంటి సుఖకరమైన లోకం మరొకటేదీ లేదని పెద్ద చెపుతారు'' అన్నాడు నారదుడు.

అక్కడి నుండి వాళ్లిద్దరూ వాసుకి చేత పాలింపబడిన భోగవతి అను నగరానికి వెళ్లారు. నారదుడు అక్కడ ప్రధానులైన నాగరాజుల పేర్లు వర్ణించి చెప్పాడు.

అక్కడ ఒక యువకుని చూడగానే మాతలి మనస్సు ఆకర్షింపబడి ఇత డెడరు అని నారదుణ్ణి అడిగాడు. అప్పుడు నారదుడు - ఇతడు సుముఖు డను నాగరాజు. ఐరావత నాగుని వంశానికి చెందినవాడు. ఆర్యకుని పౌత్రుడు. వామననాగుని దౌహిత్రుడు. ఈ మధ్యనే ఈతని తండ్రి యైన చికురుణ్ణి వైనతేయుడు చంపివేశాడు'' అని చెప్పాడు.

''నాకు ఇతనిమీద ప్రతి కలిగినది. ఇతడు నా పుత్రికను వివాహమాడడానికి తగినవాడు. అందుచేత ప్రయత్నం చెయ్యి'' అని మాతలి నారదుణ్ణి కోరాడు.

నారదుడు నాగరాజైన ఆర్యకునితో మాతలిని పరిచయం చేస్తూ ''ఇతడు దేవరాజైన ఇంద్రునికి అత్యంత ప్రియుడైన సారథి. ఇతని పేరు మాతలి. యుద్ధాలలో చాలా వరకు దేవేంద్రునితో సమానమైన ప్రభావం కలవాడు. దేవాసురయుద్ధాలు జరిగినప్పుడు వెయ్యి అశ్వాలు కట్టిన జైత్రరథాన్ని మనస్సుచేతనే నడిపేస్తాడు.

**అయం హరిసహస్రేణ యుక్తం జైత్రం రథోత్తమమ్,**
**దైవాసురేషు యుద్ధేషు మనసైవ నియచ్ఛతి**
(ఉద్యోగపర్వం 104.3)

ఇతడు అశ్వాలతో జయించిన వాళ్లని తరువాత ఇంద్రుడు బాహువులతో జయిస్తూంటాడు. ముందు ఇతడు కొట్టిన తరువాతనే అలా కొట్టబడిన వాళ్లని ఇంద్రుడు కొడతాడు.

**అనేన విజితానశ్వైర్బాహ్యాం జయతి వాసవః**
**అనేన బలభిత్ పూర్వం ప్రహృతే ప్రహరత్యుత**
(ఉద్యోగపర్వం 104.3)

అంతటి గొప్పవాడు ఈ మాతలి. ఇతడు తన కుమార్తె కొరకు వరుణ్ణి అన్వేషిస్తూ మూడు లోకాలూ తిరిగాడు. నీ పౌత్రుడైన సుముఖుడు ఇతనికి అల్లుడుగా చేసికొనడానికి నచ్చాడు. ఇతనికి తండ్రి లేకపోయినా ఇతని సద్గుణాలను చూచి నీమీద, ఐరావతుని మీదా ఉన్న గౌరవభావం చేత మేం వరిస్తూన్నాం, నువ్వు అంగీకరిచాలి'' అన్నాడు.

ఆర్యకుడు సంతోషించినా దీనుడై - ''మహామునీ! ఇంద్రుని మిత్రునితో సంబంధానికి ఇష్టపడని వాడెవడైన ఉంటాడా? ఒక కారణం చేత నేను ఆలోచిస్తున్నాను. ఇతని తండ్రి యైన నా



పుత్రుణ్ణి వైనతేయుడు భక్షించి వేశాడు. అందుకే మేం దుఃఖిస్తూండగా - వైనతేయుడు వెళ్లిపోతూ ''ఇంకొక మాసంలో సుముఖుణ్ణి కూడ భక్షిస్తాను'' అని చెప్పి వెళ్లిపోయాడు. అది తప్పకుండా అలా జరుగుతుం దని మాకు తెలుసు. అందుచేత మాకు హర్షం లేకుండా అయిపోయంది'' అన్నాడు.

ఆ మాటలు విని మాతలి - ''నేను ఈతనిని అల్లుణ్ణిగా వరించాను. ఇతడు మా ఇద్దరితో కలిసి దేవేంద్రుని వద్దకు వస్తే, ఈతని ఆయుర్దాయం ఇంకా మిగిలి ఉండగానే గరుత్మంతుణ్ణి అడ్డుకొనడానికి ప్రయత్నిస్తాను'' అన్నాడు.

అందరూ కలిసి దేవరాజు దగ్గరికి వెళ్లారు. యాదృచ్ఛికంగా ఇదే సమయంలో విష్ణువు కూడ అక్కడున్నాడు.

నారదుడు మాతలి విషయం అంతా చెప్పారు. విష్ణువు - ''ఇతనికి అమృతం ఇచ్చి మరణం లేనివానిగా చెయ్యి వీళ్ల ముగ్గురి కోరికా తీరుతుంది'' అని ఇంద్రునితో అన్నాడు.

ఇంద్రుడు వైనతేయుని పరాక్రమాన్ని స్మరించి, అత డేమి చేస్తాడో అని భయపడ్డాడు. ''నువ్వే ఇయ్యి ఇతనికి అమృతం'' అన్నాడు విష్ణువుతో. ''నువ్వు సకల చరాచర జగత్తుకు ఈశుడవు. నువ్వు ఇస్తే ఎవ్వడు కాదనగలడు?'' అన్నాడు ఇంద్రునితో విష్ణువు.

అప్పుడు ఇంద్రుడు వానికి అమృతం ఇవ్వలేదు కాని దీర్ఘాయుర్దాయం ఇచ్చాడు. సుముఖుడు ఆ వరం పొంది సంతోషిస్తూ వివాహం చేసికొని స్వలోకానికి వెళ్లిపోయాడు.

ఈ విషయం తెలిసి గరుత్మంతుడు తీవ్రమైన కోపంతో ఇంద్రుని దగ్గరికి వెళ్లి ''నన్నే మాత్రము లెక్కచేయక ఇలా వరం ఎలా ఇచ్చావు? నేనూ మహాబలవంతుడనే. ఎందరో దానవులను సంహరించినవాడనే. నీ తమ్ముని ధ్వజం మీద ఉంటున్నాననీ, అతనిని మోస్తున్నా ననీ, నువ్వు నన్నిలా నిర్లక్ష్యం చేస్తున్నావు. నా ఆహారం అడ్డుకొంటున్నావు!'' అని ఇంద్రుణ్ణి దూషించి, విష్ణువుతో - ''అదితిపుత్రులలో నువ్వు చాల బలవంతుడు వంటారు కదా! అలాంటి నిన్ను నా రెక్క చివర భాగంతో మోస్తూన్న నేను నీ కంటె అధిక బలశాలివి. ఆలోచించుకో'' అన్నారు.

(సశేషం)




# తిరుమల చరితామృతం

**148**

(గత సంచిక తరువాయి)

అందుకని ప్రతి విషయాన్ని అతిశయింపచేసి చూపించాలని ప్రయత్నం. ఇందులో ఒక ఛానల్ వాళ్లకు ఇంకొక ఛానల్‌తో పోటీ. చివరకు దెబ్బతినేది తిరుమల తిరుపతి దేవస్థానాల పరపతి. లక్షల మందికి మించి వెసులుబాటు చేసినది వార్త కాదు, ఒక్కరికి ఇబ్బంది కల్గినా వార్తే...!

వీరిందరికీ ఎవరైనా వి.ఐ.పి వస్తుంటే ఎక్కడలేని ఆసక్తి. ఎవరు వి.ఐ.పి. అన్న పదానికి ఒక నిర్దిష్టమైన నిర్వచనం లేకపోవడంతో కొంత దేవస్థానం సీనియరు అధికారులు వారి విచక్షణ ఉపయోగించి దర్శనానికి ఏర్పాటు చెయ్యాలి. కొంతమంది రాజకీయ ప్రముఖుల విషయంలో ఇబ్బంది లేదు. వీరందరినీ మీడియావారు ప్రోటోకాల్ వి.ఐ.పిలుగా గుర్తిస్తారు. కాని సమస్య- వారితో వచ్చే వారి పరివారంతో. అంతకంటే ఇబ్బంది సినిమా ప్రముఖులు. పెద్ద పెద్ద వ్యాపారవేత్తలు వచ్చినప్పుడే.

అంబానీ వచ్చినా, విజయమాల్యా వచ్చినా, అమితాబ్ బచ్చన్ వచ్చినా, ఐశ్వర్యారాయ్ వచ్చినా... రజనీకాంత్ వచ్చినా, టెండూల్కర్ వచ్చినా ఇలాంటి పేర్లున్న వాళ్లెవరు వచ్చినా అన్ని ఛానళ్ల కెమెరాలు దేవాలయం ముందే ఉండి, వారిని ప్రతిక్షణం అనుసరిస్తూ తిరుమలలో దేవస్థానం వారి ప్రతి చర్యను నిశితంగా విమర్శించడం పరిపాటి అయింది. వారి దర్శనాన్ని సామాన్య భక్తుని దర్శనంతో పోల్చి, ''వీరందరూ వి.ఐ.పి.లా? వీరికి ప్రత్యేక దర్శనాలా?'' అన్న విమర్శ చేస్తుంటారు. వీరు ప్రత్యేకులు కాకపోతే మీడియా వారంతా వారి వెనుక ఎందుకు వస్తున్నట్లు? గంటల తరబడి వారికేం జరుగుతుందో తెలుసుకోవడానికి వారు పాటు పడడం ఎందుకు? రాజకీయ నాయకులే విఐపిలా? దేవస్థానం కూడా ఈ ప్రోటోకాల్‌నే పాటించాలా?


కీ.శే. పివిఆర్‌కె ప్రసాద్

ఈ ఛానళ్ల, ఇతర మీడియా ఉన్నతాధికారులూ, వారి పెట్టుబడిదార్లు ఆలయానికి వచ్చినప్పుడు వారిని వి.ఐ.పిలుగా దర్శనాలు చేయించాలన్న తపన వీళ్లకి లేకుండా ఉందా? ప్రజాదరణ విశేషంగా పొందినవారూ, దేవస్థానానికి వివిధ పథ కాల్లో విరాళాలు భారీగా అందించినవారూ వి.ఐ.పి.లు కారా?... ఈ విషయంలో దేవస్థానం వారు ఒక స్పష్టమైన నిర్ణయం తీసుకొని ప్రోటోకాల్ వారే కాకుండా దేవస్థానం తరఫున ''ఫలానా వారు వి.ఐ.పి.లు'' అని ప్రకటన చేయాలి. అధికారుల సొంత విచక్షణాధికారంతో చేసినట్టుగా కనబడటం సమంజసం కాదు.

ఈ ఆలయంలో ధనికులకు, ఇతర ప్రముఖులకు ప్రత్యేక సదుపాయాలు, దర్శనాలు ఇప్పటివి కావు. గత వెయ్యి సంవత్సరాలుగా వస్తున్నవే.

ఇది ఆర్కాటు నవాబు కాలంలో, ఇంగ్లీషు వారి పాలనలో పరాకాష్ఠకు చేరుకుంది. అన్ని శతాబ్దాలలోనూ అధికారం ఉన్నవాళ్లెప్పుడూ వి.ఐ.పిలే. ఆలయానికి నిధులిచ్చేవారూ, దేవాదాయాలు చేసేవారూ ఆలయానికి వి.ఐ.పి.లే. అర్జిత

సేవలకు రుసుం కట్టేవారికి, వారు ఆలయానికి ఇచ్చిన ధనాన్ని బట్టి ఆలయ మర్యాదలు చేయడం మొదటి నుంచి ఈ ఆలయంలో ఉంది. సమాజంలో ధనికులు, పేదలు, వ్యత్యాసం ఉన్నంతవరకూ, పలుకుబడి, అధికారం ఉన్నవారూ-లేనివారూ అన్న వివక్ష ఉన్నంతవరకూ ఈ తారతమ్యం ఆలయంలో ఉండే అవకాశం ఉంది. ఒకవేళ 'వి.ఐ.పి' లనబడే వర్గమే లేకుండా టి.టి.డి. వారు నిబంధనలు రూపొందించినా, 'శాత్తుమొరై' దర్శనం కోసం వచ్చే శ్రీవైష్ణవులు ముఖ్యులవుతారు. ఇంకా టి.టి.డి చైర్మన్, ట్రస్టుబోర్డు సభ్యులూ ముఖ్యులవుతారు. ఆ స్థానం జరిగేటప్పుడు చోటు చేసుకొనే సర్కారు హారతి, ఇతర మర్యాదల కారణంగా వరుసగా ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జాయింట్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, ఇంకా ఇతర అధికారులు, వలంటీర్లు ముఖ్యులవుతారు. అప్పుడు కూడా సామాన్య భక్తులకు వచ్చే ప్రశ్న- వీళ్లంతా వి.ఐ.పి.లా?



అందుకే అనవసరమైన రాద్ధాంతాలు లేకుండా చేయాలంటే, ఎవరు 'వి.ఐ.పి'లు? అన్న విషయంపై టి.టి.డి.కి ఒక స్పష్టత ఉండాలి. స్పష్టమైన నిర్వచనమిచ్చి, దాన్ని బహిరంగంగా ప్రకటించాలి. కేవలం అధికార్ల విచక్షణాధికారిని బట్టి 'వి.ఐ.పి'లను నిర్వ చించే విధానానికి స్వస్తి పలకాలి. మన ప్రజాస్వామిక వ్యవస్థలో 'విఐపి'లు లేకుండా ఎలాగూ చేయలేం. కనీసం స్పష్టమైన నిర్వచనమిచ్చి, ఆ విధానాన్నైనా పాటిస్తే, విమర్శలు ఇంతలా ఉండవు. అసలు సమస్య నిజమైన 'విఐపి'లతో కన్నా వారి సిఫార్సు లేఖలతో వచ్చే వాళ్ల తోనూ, 'విఐపి'ల వందిమాగధులతోనే. వాళ్లను కూడా 'విఐపి'లు గానే పరిగణించడం వల్లనే ఈ గొడవలన్నీ వస్తున్నాయి.

అంతకంటే ముఖ్యంగా ఆలోచించాల్సింది సామాన్య భక్తునికి తిరుమల యాత్ర చేసినప్పుడు తృప్తి కలిగేలా ఎలా చెయ్యాలో ఆలోచించడం. నేను త్రిసభ్య కమిటీకి అధ్యక్షుడుగా వెయ్యికాళ్ల మంటపం, మాస్టరు ప్లాను విషయాలను అధ్యయనం చేస్తున్నప్పుడు ఈ విషయంపై చాలా చర్చ జరిగింది. ధనికులు అందరూ తృప్తిగా దర్శనం చేసుకొని వెళ్తున్నారా అంటే అదీ లేదు. స్వామివారి సేవకు డబ్బులు కట్టి చూద్దామన్నా అందరికీ అవకాశం లేదు. ఎందుకంటే - స్థలాభావం వలన మూలవర్లకు జరిగే సేవల కంటే అర్థం ఉంది. అక్కడ 100 మంది కంటే ఎక్కువ పట్టరు కాబట్టి. కాని ఇతర సేవలకు డబ్బు కట్టినా కట్టకపోయినా అందరూ చూసి తరించే వ్యవస్థ రావాలి.

దాన్ని దృష్టిలో ఉంచుకొనే నేను కార్యనిర్వహణాధికారిగా ఉన్నప్పుడు ఆలయం బయట 'సహస్రదీపాలంకార సేవ' మొదలుపెట్టింది. టిక్కెట్టు కొన్నవారూ చూస్తారు. కొనలేని భక్తులూ చూసి ఆనందిస్తారు. వెయ్యికాళ్ల మండపం కూలగొట్టినప్పుడు, ఆలోచించి ఒక మహామండపం (చుట్టూ తెరిచి పైకప్పు మాత్రమే ఉండేది) ఆలయం ముందు కట్టాలని సూచించాం. అది వెయ్యికాళ్ల మండపంలా అన్పించేలా ఎలా కట్టాలో కూడా చాలా సూచనలు చేశాం. ఉత్సవరులకు ఇప్పుడు గుడిలోపల, బయట వైభవ మండపం హాలులో జరుగుతున్న అన్ని సేవలూ ఉదయం నుండి సాయంత్రం వరకూ భక్తులందరి సమక్షంలో ఆలయం బయట జరగాలని సూచించాం. 5000 మంది టిక్కెట్లు కొని చూడవచ్చు. 10,000 మంది ఇతర భక్తులు పైసా కట్టకుండా చూడవచ్చు.

ఆలయం లోపల మూలవరులను ఒక్కక్షణం కూడా చూడలేని సామాన్య భక్తులు డబ్బు కట్టకపోయినా రోజంతా ధనికులలాగా స్వామివారి సేవలన్నీ ఇప్పుడు సహస్రదీపాలంకార సేవ చూసినట్లే చూసి తరించి తృప్తిగా తిరుమల యాత్ర సఫలం చేసుకోవచ్చు. అప్పుడు శ్రీనివాసుడు ధనికుల దేవుడన్న భావనపోయి, భక్తుల దేవుడన్న విశ్వాసం కలిగే పరిస్థితి ఏర్పడుతుంది.

◆◆◆

## 88. హనీమూన్‌కి తిరుమల!

ఆ మధ్య ఒక వివాహం సందర్భంగా వధువు తండ్రి నన్ను అడిగారు.

"అమ్మాయిని, అల్లుణ్ణి పెళ్లయ్యాక తిరుమల కొండమీద మూడు నిద్రలు చేయించి, అక్కడ్నుంచి ఊటీ పంపిద్దామను కుంటున్నాను. కొంచెం మీరు కాటేజీలకు సిఫార్సు చేయాలి!"

నాకు బాధ కలిగింది. ఆ మిత్రుణ్ణి కూర్చోబెట్టి నాకు తెలిసిన విషయాలన్నీ చెప్పాను.

◆◆◆

పురాణాల్లో తీర్థయాత్ర ఎలా చేయాలో చాలా విపులంగా చెప్పారు. కుమారస్వామికి పరమశివుడు చెప్పినా, మార్కండే యునికి నారద, గరుత్మంతులు చెప్పినా, శుద్ధ అన్న బ్రాహ్మణునికి అగస్త్యుల వారు చెప్పినా, బ్రహ్మదేవులు దేవతలకు చెప్పినా, రుద్రుని అవతారమైన శుకమహర్షి తాను

వేంకటాచల యాత్ర ఎలా చేశాడో పురాణం వివరించినా... అందరూ కర్మభూమిగానే ఆ క్షేత్రాన్ని చూశారు.

ఎందరో మహాత్ములు, దేవతలు, రాజులు, చక్రవర్తులు, ధనికులు ఎలా యాత్రలు చేశారో పురాణాల్లో చాలా సందర్భాలలో విపులంగా చెప్పబడింది... వీరు కాక, పాప ప్రక్షాళనకు ప్రాయశ్చిత్తంతో వచ్చిన పాపులు ఎంతమందో ఈ తిరుమల క్షేత్రానికి వీరందరూ ఎలా వచ్చింది, ఎలా సాధన చేసింది స్వామివారి అనుగ్రహానికి అర్హత సంపాదించడానికి, ఎటువంటి కఠోర తపస్సు చేసింది ఎన్నో గాథల్లో విన్నాం.

కాని ప్రాపంచిక సుఖాలు అనుభవించడానికి ఇక్కడికి వచ్చిన భక్తుల సందర్భాలు లేవు. ఇది ఒక దివ్యక్షేత్రం. పర్యాటక స్థలం కాదు గదా!

శుకులు, అగస్త్యుల వంటి మునీశ్వరులు, ఆ పర్వతాన్ని భగవంతుని రూపంగా చూశారని చెప్పుకొన్నాం. పవిత్రమైన ఆ కొండపై నివసిస్తే శక్తి లేక పాపాలు చేస్తామేమోనని కొండ కింద నివాసమున్నట్లు పురాణం చెబుతుంది.

అదంతా పురాణకాలంలో అనుకుంటే చరిత్రలో చూశాం - ఎందరో మహారాజులు చక్రవర్తులు, మంత్రులు, సామంతులు, సేనాధిపతులు, భక్తులు ఆర్తితో, భక్తితో స్వామికి కానుకలతో వచ్చి, ఎన్నో కష్టాలకోర్చి, కొండ ఎక్కి, స్వామివారి దర్శనం కోసం తపనతో కష్టపడ్డారని.

తీర్థయాత్రకు బయలుదేరేవారు, దీక్ష తీసుకోవడం మన హిందూ సంప్రదాయం, కొండకు దర్శనానికి వెళ్లామన్న సంకల్పం చేశాక, పూర్వం మన పెద్దలు, క్షురకర్మ చేసుకోవడం ఆపి, వేంకటాచలంలోనే జుట్టు సమర్పించడానికి పెంచేవారు.

తాము ధనవంతులమైనా, తమ డబ్బుతో సుఖంగా యాత్రకు ఖర్చుపెట్టగలవారైనా, యాత్ర కోసం అహం చంపుకొని, పసుపు బట్టలు కట్టుకొని, వీథుల్లో బిచ్చమెత్తి, ఆ వచ్చిన ధనంతో కొండకు వచ్చే వాళ్లని చాలామందిని చిన్నతనంలో చూసేవాళ్లం.

ఇప్పటికీ, ఎంతోమంది ఐశ్వర్యవంతులు, కొందరు వెళ్లడానికి కార్లు, బస్సులు, విమానాలు ఉన్నా, వాటిల్లో వెళ్లే సుఖం కన్నా, తమ గ్రామాల నుంచి, పట్టణాల నుంచి కాలినడకన తిరుమల క్షేత్రానికి పసుపు బట్టలతో దీక్షగా గుంపులు గుంపులుగా వెళుతుండటం చూస్తూంటాం.

యాత్రకు వెళ్తామని సంకల్పం చేసినవారు ఆనాటి నుంచి సంసారసుఖం వదిలేసి, ఒక్క పొద్దు భోజనం చేసి, పక్కమీద పడుకోకుండా, నేలపై పడుకొని, కాళ్లకు చెప్పులు కూడా తొడగని వారిని ఈనాటికీ ఎంతోమందిని చూడగలం.

చాలామంది భక్తులు కొండ ఎక్కేటప్పుడు చెప్పులు



ధరించకుండా, కొండమీద కూడా చెప్పులతో నడవకుండా ఉండటం చూస్తూంటాం. రామానుజుల వారు చేసిన సంస్కరణలతో, విధించిన నిషేధాలలో - కొండపై చెప్పులు వేసుకోకూడదని, కొండమీద పుష్పాలు ధరించరాదని, స్వామివారి ప్రసాదమే భుజించాలని, ఏదైనా కారణాన కావలసినంత ప్రసాదం లభించకపోతే, నిషిద్ధ పదార్థాలు కాకుండా తమ కోసం వండుకొని స్వామివారికి తామే నివేదన చేసి, లేదా వారివద్దనున్న స్వామివారి ప్రసాదాన్ని ఆ వండిన పదార్థంలో కలిపి, దానిని నైవేద్యంగా స్వీకరించాలని ఉంది.

ఎండైనా, వానైనా ఆ కొండలరాయుడే దిక్కు అనుకుని యాత్రకు వచ్చినప్పుడు, తీర్థాల్లో స్నానం చేయడం ఒక విధిగా మన పురాణాలు చెప్తున్నా, ఎంతమంది ఆచరిస్తున్నాం? పైగా వేడినీళ్లు లేందే స్నానం చెయ్యలేం. కొండమీద కూడా ఒకటి రెండు రోజులు చన్నీళ్ల స్నానం (తీర్థస్నానం సంగతి వదిలేయండి) చేయడం కష్టమయింది.

స్వామివారికి అర్చన చేసే వైఖానస అర్చకుల విషయంలో ఒక నిబంధన ఉంది. పూర్వం ఆలయం సిబ్బంది కొంతమంది, అర్చకులు, ఆచార్యపురుషులు కొండపైనే నివాసముండేవారు. మిగతా భక్తులందరూ సాయంత్రానికి కొండ దిగేవారు. కొండమీద సంసార సుఖాలు అనుభవించరాదన్నది నియమం. అందుకే మిరాశీదార్లు, ఇతర అర్చక గుమాస్తాలు ఇతర కొండమీద నివసించే ఆలయ సిబ్బంది, కొండమీద కుటుంబాలతో ఉండే సంప్రదాయం లేదు... అర్చకుల విషయంలో కొండమీద రెండు నెలలు బ్రహ్మచర్యం పాటిస్తూ అర్చకత్వ విధులు నిర్వర్తిస్తూ, తర్వాత తమ గ్రామానికి వెళ్లేవారు.

(సశేషం)

(తిరుమల చరితామృతం పుస్తకం నుంచి)

అరణ్య కాండ




‘ఆంధ్ర వాల్మీకి’

**వాసుదాసస్వామి**

(వావిలికొలను సుబ్బారావు)

**విరచిత**

# ‘మందర-మకరందం’




## సర్గ-6

(గత సంచిక తరువాయి)

“దుష్టుల పెట్టే బాధల వల్ల దుఃఖపడుతూ, బాధపడుతున్న వారిని రక్షించే సామర్థ్యం కల శ్రీరామచంద్రమూర్తీ! యథార్థం చెప్తున్నాం. విను. ఈ వానప్రస్థ సమూహాల్లో బ్రాహ్మణులు చాలా మంది వున్నారు. కొద్దిమంది క్షత్రియ, వైశ్యులు కూడా వున్నారు. వీరంతా గొప్ప తపో మహిమవల్ల కీర్తిపొంది నువ్వే దిక్కని నమ్మారు. క్షత్రియులు, వైశ్యులు కూడా స్వశక్తితో తమ్ము కాపడుకునే శక్తి కలవారు కాదు. దుష్టులైన రాక్షసులు పెట్టే బాధలు సహించలేకపోతున్నారు. ఇక నువ్వు ఉపేక్షించ కూడదు. మామీద ప్రేమతో మాకు అభయం ఇవ్వు. మాకు భయం లేకుండా చేయి. శ్రీరామచంద్రా! రాక్షస సమూహాల వల్ల హింసించబడ్డ మునుల దేహాల నుండి వెడలిన ఎముకలు దూరంగా పడి వున్నాయి, మా వెంట రా...చూపిస్తాం. మందాకినీ తీరంలో పంపానది ఒడ్డున, చిత్రకూట పర్వతం దగ్గర నివసిస్తున్న ఋషులను రాక్షసులు బాధించి చంపుతున్నారు. మృత్యువును లక్ష్యపెట్టక తపస్సు చేసే మాకెందుకు మరణభీతి అంటావేమో? మాకుగా మేం దుఃఖించడం లేదు. సంసారాన్ని వదలి అడవులకు వచ్చి తపస్సు చేసుకుంటున్న మునిజనులకు కలుగుతున్న అపకారాన్ని చూసి మేం సహించ లేకపోతున్నాం. కాబట్టి నువ్వు రక్షించాలి. అమోఘబలవంతుడివి కాబట్టి నిన్ను రక్షించమని శరణుజొచ్చాం. మేం రాక్షసుల చేతిలో చావకుండా నీ దయాగుణంతో ఆలోచించి మమ్మల్ని కాపాడు. మమ్మల్ని కాపాడమని నిన్ను నిర్భందించం. నీ కళ్యాణగుణాలకు హాని రాకుండా కాపాడుకో. మేం అనన్యులం... కాబట్టే... నీ రక్షకత్వాన్ని కోరి, నువ్వెప్పుడు అవతరిస్తావా? ఎప్పుడు దర్శనమిస్తావా? ఎప్పుడు మమ్మల్ని కృతార్థులను చేసి రక్షిస్తావా? అను ఎదురు చూస్తున్నాం. నువ్వుతప్ప మాకు వేరే గతిలేదు. మా విషయంలో దయచూపాలా? వద్దా? అనే విషయం సీతాదేవిని అడిగి చూడు”.



అనువక్త-వాచవి
**వనం జ్వాలా నరసింహారావు**

### మునులకు అభయం ఇచ్చిన శ్రీరాముడు

ఋషులందరూ చెప్పిన మాటలు విన్న శ్రీరామచంద్రమూర్తి ఇలా వారితో ఇలా అన్నాడు: “మహానుభావులారా! మీరు నన్ను ఇలా గొప్పవాడిని చేసి మాట్లాడవచ్చా? నేను మీ ఆజ్ఞానుసారం నడుచుకునేవాడినే! మీరు ఆజ్ఞాపించాల్సిన వారే కాని విజ్ఞాపించాల్సిన వారు కాదు. నేను ఈ అడవుల్లోకి నా స్వకార్యం కొరకే వచ్చా. ఈ అడవుల్లోని రాక్షసులందరినీ వధించి మీకు మేలు చేయదమే నా స్వకార్యం. నా తండ్రిని సత్యవాదిని చేయడానికి అడవులకు రావడం నెపం మాత్రమే కాని యదార్థం కాదు. ఆశ్రితులను రక్షించడం రక్షకుని విధి. నేను చేయాల్సిన కార్యాన్ని ఇంతవరకూ చేయకపోవడం నా లోపమే. నన్ను

క్షమించండి. ఈ కారణం వల్ల మాకు అరణ్యావాసం గొప్ప ఫలితాన్ని ఇస్తుంది. యుద్ధంలో తమ్ముడితో కలిసి విరోధులను చంపుతా. అప్పుడు నా భుజ శక్తి చూడండి''.

## సర్గ-7
## సుతీక్ష్ణాశ్రమానికి చేరిన శ్రీరాముడు

ఇలా ఆ ఋషులకు అభయమిచ్చిన శ్రీరామచంద్రమూర్తి తన మాట నెరవేర్చడానికి అభిలాషతో, తన వెంట మునీశ్వరులందరూ వస్తుంటే, సుతీక్ష్ణాశ్రమానికి పోయే దారిలో పయనించాడు. తన వెంట వచ్చిన వానప్రస్థులతో ముచ్చ టించుకుంటూ నడిచిన శ్రీరాముడు అందమైన ఆశ్రమాన్ని చూశాడు. పూలతో నిండి, కొండలాగా నల్లగా వ్యాపించిన పర్వతంతో, సౌందర్య సంపత్తితో అలరారుతున్న ఆ శు భాశ్రమాన్ని సమీపించి, అక్కడ కూచున్న సుతీక్ష్ణుడిని శ్రీరామ చంద్రమూర్తి చూసి, ప్రీతితో ఇలా అన్నాడు: "ఋషీశ్వరా! పాపరహితుడా! నేను రాముడిని. నిన్ను దర్శించుకోవాలని మిక్కిలి సంతోషంగా వచ్చాను. మనసారా ప్రేమగల చూపులతో నన్ను చూడు''. వెంటనే ఆ మునిశ్రేష్ఠుడు రాముడిని కౌగలిచుకుని, "సీతేశ్వరా, నీకు క్షేమమే కదా?'' అని కుశల ప్రశ్న వేస్తూ ఇలా అన్నాడు: "ఇతరులు చూసి సహించలేని తేజస్సుకలవాడా! నువ్వు రావడం వల్ల ఇక్కడి ఈ ఆశ్రమం మరింత పవిత్రమై, దిక్కుకలదిగా ప్రకాశిస్తున్నది. ఓ వీరుడా! నువ్వు ఇక్కడికి వస్తున్నావని తెలిసి శరీరాన్ని వదిలి దేవలోకానికి పోవడానికి ఇష్టం లేక ఇక్కడే నీకొరకు కాచుకుని వున్నాను. నా పుణ్యం వల్ల నువ్వొచ్చావు నాయనా!. కకుత్థ్స వంశంలో పుట్టినవారిలో శ్రేష్ఠుడవు, మంచి పరాక్రమవంతుడవు అయిన శ్రీరామచంద్రమూర్తీ! రాజ్యాన్ని వదిలి మునివేషంతో చిత్ర కూటంలో నువ్వు నీ భార్యతో, తమ్ముడు లక్ష్మణుడితో కలిసి వున్నావని విన్నాను. రామచంద్రా! నేను సంపాదించిన పుణ్యంతో స్వర్గాన్ని పొందాను. అక్కడికి రమ్మని ఇంద్రుడు నన్ను పిలవ డానికి వచ్చాడు. కాని, నువ్వు ఇక్కడకు వస్తున్నావని తెలిసి, అక్కడికి పోకుండా, నీ దర్శనంకొరకు ఇక్కడే కాచుకుని వున్నాను. నన్ను అనుగ్రహించి ఇక్కడ విహరించు'' అని అన్నాడు.

జవాబుగా శ్రీరామచంద్రమూర్తి ఇలా అన్నాడు: "మునీంద్రా! నీ తపఃఫలం నువ్వు నాకివ్వాల్సిన అవసరం లేదు. ఫలకాంక్ష లేకుండా రామార్పణం అని నువ్వు సంకల్పిస్తే చాలు. అవే వచ్చి నాలో కలుస్తాయి. అప్పుడు నేను గ్రహిస్తా. మేముండడానికి అనువైన స్థలం చూపించు. నీ గురించి అంతా శరభంగుడు చెప్పాడు''. ఈ మాటలు వినగానే మునీంద్రుడు శ్రీరాముడితో "శ్రీరామచంద్రా ఈ ఆశ్రమ భూమియే రమ్యమైనది. గుణం



కలది. ఋషులెందరో ఇక్కడ తపస్సు చేస్తున్నారు. ఫలమూలాలు దండిగా దొరకుతాయిక్కడ. ఇక్కడ భయమంటే ఏమిటో తెలియదు. కాకపోతే ఇష్టం వచ్చినట్లు తిరిగే మృగాలు వచ్చి దేహాలను తాకటం వల్ల తపస్సుకు విఘ్నం కలుగుతుంది. అది తప్ప మరే భయం లేదు. కాబట్టి ఇక్కడే వుండండి'' అన్నాడు. తాను ఆమృగాలను చంపితే మునీంద్రుడికి మనోవ్యథ కలుగుతుంది కాబట్టి తానక్కడ ఎక్కువ రోజులుండకూడదని అంటూ శ్రీరాముడు, సరస్సుకు పోయి సాయం సంధ్య పూర్తి చేశాడు. ఆ ముని ఇచ్చిన ఆహారాన్ని తిన్నాడు. ఆ రాత్రి సీతాలక్ష్మణులతో అక్కడే గడిపాడు.

## సర్గ-8
## రామలక్ష్మణులు యుద్ధ సన్నద్ధులైనారని తెలుసుకున్న సీత

తెల్లవారుఘాము కాగానే లక్ష్మణుడు ముందుగా లేచి, స్నానం చేసిన తరువాత సీతాదేవి కూడా నిద్రలేచి అలాగే చేసింది. శ్రీరామచంద్రమూర్తి కూడా తటాకజలాలలో స్నానం చేసి, హోమం చేసి, ఇష్టదైవ ప్రార్థన చేసి, సూర్యోదయం కాగానే సూర్యుడికి నమస్కారం చేసి సుతీక్ష్ణ మునిని సమీపించి అంజలి ఘటించి ఇలా అన్నాడు: "తపస్సు వల్ల పవిత్రమైన హృదయం కల మునీంద్రా! నువ్వు మమ్మల్ని గారవించి గౌరవించడం వల్ల రాత్రి మాకు హాయిగా గడిచింది. ఇక బయల్దేరి పోవడానికి అనుమతి ఇస్తారా?ఎక్కడికి పోతారం టారేమో? తమ-తమ ఆశ్రమాలకు రమ్మని దండకారణ్యంలో నివసించే మునులు మమ్మల్ని అడుగుతున్నారు. వారివెంట మేం పోవాలనుకుంటున్నాం.కాబట్టి మామీద దయతో అనుమతి ఇవ్వండి. ఎండ సోకకముందే వెళ్లడానికి శలవివ్వండి''. ఇలా చెప్తూ శ్రీరాముడు ముని పాదాలను తాకి నమస్కరించాడు. శ్రీరాముడిని ముని దగ్గరకు తీసుకుని గట్టిగా కౌగలించుకుని, "రామచంద్రా! నీ నీడ నిన్ను విడిపోకుండా నీవెంట వచ్చే విధంగా, సీత నిన్ను కొలుస్తుండగా పోయిరా. (సశేషం)

# క్షయ సంవత్సరం బార్హస్పత్యమానం

(గత సంచిక తరువాయి)

బార్హస్పత్యస్తు మాఘాదౌ

కానీ, బార్హస్పత్య మానం ప్రకారం అవి 'మాఘ' మాసంలో (గురువు రాశి మారినప్పుడు) ప్రారంభమవుతాయి.

తయోర్వినియోగః జ్యోతిర్నిబంధే, బ్రహ్మసిద్ధాంతేః

ఆ రెండింటి వినియోగం (వాడుక) గురించి 'జ్యోతిర్నిబంధ' గ్రంథంలో మరియు 'బ్రహ్మ సిద్ధాంతం'లో ఈ విధంగా చెప్పబడింది:

వ్యావహారిక సంజ్ఞోయం కాలః స్మృత్యాది కర్మసు - యోజ్యః సర్వత్ర

స్మృతులలో చెప్పిన కర్మలకు (నిత్య కర్మలు, పండుగలు, శ్రాద్ధాలకు) 'వ్యావహారికం' అనబడే ఈ చాంద్రమాన కాలాన్ని (చైత్రాదిని)సర్వత్ర (అన్ని దేశాలలో) వాడాలి.

తత్రాపి జైవోవా నర్మదోత్తరే

అయినప్పటికీ, నర్మదా నదికి ఉత్తర భాగాన (ఉత్తర భారతదేశంలో) మాత్రం 'జైవము' (జీవుడు అంటే బృహస్పతి, బార్హస్పత్య మానము) వాడవచ్చు లేదా వాడతారు.

ఆర్ష్టి షేణః :- ఆర్ష్టిషేణ మహర్షి ఇలా అంటున్నారు:

స్మరేత్ సర్వత్ర కర్మాదౌ చాంద్ర సంవత్సరం సదా

కర్మల ఆరంభంలో (సంకల్పం చెప్పుకునేటప్పుడు) ఎల్లప్పుడూ, అన్ని చోట్లా చాంద్రమాన సంవత్సరాన్నే స్మరించాలి.

నాన్యం యస్మాద్వత్సరాదౌ ప్రవృత్తి స్సస్యకీర్తితా ఇతి

వేరొక దానిని (బార్హస్పత్య మానాన్ని) స్మరించకూడదు. ఎందుకంటే సంవత్సర ఆరంభంలో (వత్సరాదౌ = ఉగాది నాడు) దీని ప్రవృత్తి (Start) ప్రశస్తంగా చెప్పబడింది.

జ్యోతిష శాస్త్రమందు గురువునకు మధ్యమరాశి (మీన్ మోషన్)

భోగమైన ప్రభవాది మాఘమాసారంభమందు ఆరంభ మగునని చెప్పబడినను ప్రభవాదులు చాంద్రసంవత్సర ములు కూడా ఔతాయి "చాంద్ర వత్సరములైన ప్రభవాది ఐదేసి ఐదేసి జతలుగా ఉంటాయని మాధవుల వచనము.



అందువలన చాంద్రమానము ప్రభవాది వత్సరములు చైత్ర శు క్లంలో ఆరంభమగును. బార్హస్పత్యమానము మాఘమాసాదిలో ఆరంభమగును. వాని ఉపయోగము జ్యోతిషశాస్త్రంలో బ్రహ్మ సిద్ధాంతమందు ఇట్లా చెప్పబడింది: ''వ్యవహారమునకైన పేర్లు కలిగిన ఈ కాలము స్మృత్యాది కర్మలలో అంతటా స్వీకరింపతగినది, కానినర్మద ఉత్తర తీరప్రాంతాల్లో బార్హస్పత్య మానము స్వీకరింపబడవచ్చును లేక పోనూవచ్చును'' అని.

ఆర్ష్టిషేణుడు:. "కర్మారంభమందు అంతట చాంద్రవత్స రమును స్వీకరింపవలెను. మరొకటి కూడదు. ఎందుకంటే, సంవత్సరం మొదలు దీనితోనే ఆరంభమగునని చెప్పబడినది గదా'' అని.

ప్రశ్న: సూర్య సిద్ధాంతం ప్రకారం మొదటి సంవత్సరం విజయ? లేదా ప్రభవ?


సమాధానం: సూర్య సిద్ధాంతరీత్యా మొదటి సంవత్సరం 'విజయ' నామ సంవత్సరం.

సిద్ధాంత పరంగా: విజయ సూర్య సిద్ధాంతం 'కల్పాది' (సృష్టి ఆరంభం) నుండి కాల గణన చేస్తుంది. సృష్టి మొదలైనప్పుడు గురు గ్రహం యొక్క స్థితిని బట్టి ఆ సమయం 'విజయ' నామ సంవత్సరంగా పరిగణించబడింది.

శ్లోకం ప్రకారం శేషాన్ని "విజయాదయః'' విజయ ఆదిగా గల అని. ఉదాహరణకు: శేషం 1 వస్తే అది విజయ, శేషం 2 వస్తే

జయ.. ఇలా లెక్కించాలి.

వ్యవహార పరంగా నామక్రమం: ప్రభవ మనం సాధారణంగా పంచాంగంలో చూసే 60 సంవత్సరాల చక్రంమాత్రం 'ప్రభవ' తోనే మొదలవుతుంది.1వది ప్రభవ, 2వది విభవ... 27వది విజయ.కానీ, సూర్య సిద్ధాంత గణితం చేసేటప్పుడు మాత్రం, మనకు వచ్చిన సంఖ్యను 'విజయ' (జాబితాలో 27వది) నుండి మొదలుపెట్టి లెక్కించాలి.సంవత్సరాల పేర్ల జాబితాలో మొదటిదిప్రభవ. కానీ, సూర్య సిద్ధాంతం ప్రకారం సృష్టి ఆరంభమైన సంవత్సరం మరియు గణితానికి మూల వత్సరం: విజయనేతీసుకోవాలి.సంవత్సరఫలంబార్హస్పత్యమానంలోనేసరు వ్లాచెపాలి. సిద్ధార్థమంచిఫలం, కానీ దాని స్థానంలో వచ్చే రౌద్రి ఫలం మంచి చేయదుకదా!'' జాబితాలో ప్రభవ మొదటిదైనప్పటికీ, సూర్య సిద్ధాంత గణితం ప్రకారం సృష్టి 'విజయ' నామ సంవత్సరంలో మొదలైంది కాబట్టి, మనం విజయ నుండి లెక్కించాలి'' అని చెప్పవచ్చు.అలాగేసూర్య సిద్ధాంతం ప్రకారం మొదటి సంవత్సరం విజయ లేదా ప్రభవ. చంద్రమానం ప్రకారం మారుతుందా?, బార్హస్పత్య మానమే తీసుకోవాలాఇది చాలా సూక్ష్మమైనసందేహం. దీనికి సమాధానం ''గణితంప్రకారం ఒకలా, ''సంప్రదాయం పరంగా మరొకలా ఉంటుంది.



సూర్య సిద్ధాంతశ్లోకం ప్రకారం - స్పష్టంగా విజయాదయః అని చెబుతోంది.సృష్టి ఆరంభం లేదా కలియుగం నాటి గ్రహ స్థితులను బట్టి, బృహస్పతి ఉన్న స్థితిని గణించగా. ఆ సమయానికి ఉన్న సంవత్సరం 'విజయ' నామ సంవత్సరంగాతీసుకోవాలి. గణిత సూత్రం ద్వారా వచ్చే శేషం1 వస్తే అది విజయ, 2 వస్తే జయ.. అని లెక్కించాలి. ముఖ్య గమనిక: ఇది కేవలం బార్హస్పత్య మానం ప్రకారం వేసే గణితం.చంద్రమానం ప్రకారంమనం పాటించేది - 'ప్రభవ' తెలుగువారు/ దక్షిణ భారతీయులు పాటించేది చంద్రమానం. చంద్రమానంలో 60 సంవత్సరాల చక్రం ఎప్పుడూ 'ప్రభవ' తోనే మొదలవుతుంది (ప్రభవ, విభవ, శుక్ల...)మన సంకల్పాల్లో, పంచాంగాల్లో 'ప్రభవ' మొదటిది. 'విజయ' అనేది ఈ వరుసలో 27వ సంవత్సరం. సూర్య సిద్ధాంతం ప్రకారం మొదటిది 'విజయ'.

''అసలు ఏది తీసుకోవాలి?'' చంద్రమానాన్ని బట్టి తీసుకోవాలా? బార్హస్పత్య మానమే తీసుకోవాలా?

సూర్య సిద్ధాంతరీత్యా షష్టిచక్రాన్ని వివరిస్తున్నప్పుడు, ''బార్హస్పత్య మానమే'' తీసుకోవాలి. ఆ శ్లోకం ఉద్దేశమే 'గురు వర్షం' కనుగొనడం. అలాగే స్పష్టంగా 'బార్హస్పత్య వర్షానయనమాహ' (బార్హస్పత్య వర్షాన్ని తెల్పుచున్నాను) అని ఉంది. కాబట్టి, ఆ లెక్క ప్రకారం వచ్చే ఫలితాన్ని 'విజయ' నుండే లెక్కించాలని చెప్పాలి. కానీ, మనం పండుగలు జరుపుకోవడానికి, ఉగాది నిర్ణయించడానికి చంద్రమానాన్ని సాంప్రదాయంలో తీసుకుంటాం. దక్షిణ భారతదేశంలో బార్హస్పత్య మానాన్ని సంవత్సరం పేరు కోసం సంకల్పంలో తీసుకోము. మనం ఉగాది పద్ధతినే వాడతాము. పరాభవ ఉగాదినాడు చెప్పేసంవత్సర ఫలం మాత్రం బార్హస్పత్యమానం లోని సంవత్సరనామమైన రౌద్రిని బట్టే చెప్పాలి. ఇది సూర్యసిద్ధాంతంలో భగవానుడు సూర్యుడు ఉపదేశించిన షష్టి సంవత్సరచక్ర నియమం.

◆◆◆

## బార్హస్పత్యమాన సంవత్సరాన్ని ఎక్కడ ఉపయోగించాలి

చాంద్ర సంవత్సరాలు ప్రభవాదిగా నిత్యసంకల్పంలో చెబుతాము. బార్హస్పత్యమాన సంవత్సరాన్ని ఎక్కడ ఉపయోగించాలి.

1తత్రకాలః షడ్విధః వత్సరఃఅయనంఋతుఃమాసఃపక్షోదివసఇతి. వత్సరః పఞ్చధాచాన్ద్రః సౌరః సావననాక్షత్రో బార్హస్పత్య ఇతి.

శుక్ల ప్రతిపదాది దర్శాన్తైశ్చైత్రాది సంజ్ఞైర్ద్వాదశభిర్మాసై శ్చతుః పఞ్చాశదధికశతత్రయదినైః 354. సతిమలమాసే త్రయోదశభిర్మాసైశ్చాన్ద్రోవత్సరః చాన్ద్రస్యైవప్రభవోవిభవః శుక్లాత్యాదయః షష్టిసంజ్ఞాః. మేషాదిషు ద్వాదశరాశిషు రవిర్భుక్తేషుపఞ్చషష్ట్యధికశత త్రయదినైః సౌరోవత్సరః 365. సంపద్యతే. షష్ట్యుత్తరశతత్రయదినైః సావనః. 360. వక్ష్యమాణై ర్ద్వాదశభిర్నాక్షత్రమాసైర్నాక్షత్రోవత్సరః పఞ్చచతుర్విశత్యధికశత త్రయదినైః స్యాత్. 324. మేషాద్యన్యతమరాశౌ బృహస్పతినా భుక్తే బార్హస్పత్యః సచఏకషష్ట్యధికశతత్రయసంఖ్యాదినైర్భవతి. 361. కర్మాదౌసంకల్పేచాన్ద్రవత్సరఏవస్మర్తవ్యోనాన్యః

బార్హస్పత్య మాన సంవత్సరాన్ని ప్రధానంగా నర్మదా నదికి ఉత్తర దిశలో ఉన్న ప్రాంతాలలో (ఉత్తర భారతదేశంలో) ఉపయోగిస్తారు.

ధర్మసింధు, నిర్ణయసింధు వంటి ధర్మశాస్త్ర గ్రంథాలు మరియు ముహూర్త గ్రంథాలు దేశ భేదాన్ని బట్టి ఏ సంవత్సరాన్ని వాడాలో స్పష్టంగా నిర్దేశించాయి. దీనికి సంబంధించిన ప్రధాన నియమాలు మరియు వివరాలు ఇక్కడ ఉన్నాయి: (సశేషం)

# విలువల రత్నాలు.. ఆదర్శాల మణుల అమూల్య గ్రంథం

## 'కడిమిళ్ల' వారి 'రామాయణం - మానవత్వం'

శ్రీమద్రామాయణంపై వస్తున్న సాహిత్యం ఒక అనంత ప్రవాహం. ఏ కోణంలోనైనా సరే రామాయణ పరిశీలన అంటే భారతీయ సామాజిక సాంస్కృతిక మూలాల్లోకి ప్రయాణించటమే. కాల పరిమితి లేని సమకాలీనత కనిపిస్తూ ఉంటుంది. అందుకే మానవ జీవితానికే ఇది ఒక జయమంత్రం.

శ్రీరాముడు దేవుడే అనుట నిస్సందేహము. జన్మ లేని వాడు దశరథుని యింట జన్మించాడు.

"వేదవేద్యే పరేపుంసి జాతే దశరథాత్మజే
వేదః ప్రాచేతసా దాసీత్ సాక్షాద్రామాయణాత్మనా"

అని కదా ముని వాక్కు.

కానీ రాముడు తన నడవడికలో దైవత్వాన్ని మరుగు పరచి మానవునిగానే ప్రవర్తించాడు. అసలు తనలో దైవత్వమున్నదని తెలియనివాడు అని చెపుతారు. (రాముడెంత దాచ ప్రయత్నించినా అది బయట పడినది - అది విషయాంతరము)

యుగాలు గడిచినా, తరాలు మారినా రాముడంటే ఆజానుబాహుడనో, అరవింద దళాయతాక్షుడనో మాత్రమే కాదు నిలువెత్తు ధర్మ స్వరూపంగా సంభావించటం పరిపాటి. వివేకానందుడు ధర్మం అంటే జీవన విధానం అని చెప్పినాడు.

వానర యూథ ముఖ్యుడు శ్రీరామ దూతగా మారినది రాముడి రాజ్యసంపదనో, బలాన్నో చూసి కాదు. గుణైః దాస్య ముపాగతః - ఆయన గుణాల్ని చూసే దాసుడినయ్యాను అంటాడు.

ధర్మం అంటే యేమిటి అన్న విచారణతో మొదలుపెట్టి, వివిధ పాత్రలలో కానవచ్చే అహంకారం, కోపం, కామం, లోభం, త్యాగం వంటి స్వభావాల, ప్రవర్తనల చర్చ చేశారు.

రామాయణ సందేశం ప్రధానంగా మానవుడు పాటించవలసిన ధర్మమును గూర్చియే. రామాయణ పాత్రలలోని మానవతా లక్షణాలకు ప్రాధాన్య మిస్తూ రచించినది కడిమిళ్ళ వారి గ్రంథం.

ఎందరెన్ని విధములుగా వ్రాసినా పునరుక్తి అనిపించనిది రామాయణ కథ. మరలనిదేల రామాయణంబన్నచో - అన్న ప్రశ్నకు చాలాకాలం క్రితమే సమాధానం సమకూర్చారు విశ్వనాథ వారు. అలాగే నాదైన అనుభూతి నాదిగాన.. అని అనుకుంటూ నేటి కాలానికి ముఖ్యంగా యువతకు ఉపయోగపడే రీతిలో, సరళ సుందరమైన భాషలో అందించారు రచయిత. దీనికి వీరి బహుగ్రంథ పరిచయం, బహుగ్రంథ రచనం, భాషా దక్షత, వశ్య వాక్కు, అవధాన విద్యా నేపథ్యం ఇలా చాలా పార్శ్వాలు తోడ్పడ్డాయి.

రాముడు సార్వభౌముడు కావటానికి అన్ని అర్హతలు అవకాశాలు ఉన్నప్పటికీ మాటకు కట్టుబడి అన్నిటినీ తృణప్రాయంగా భావించిన త్యాగమూర్తి. శ్రీరాముని వ్యక్తిత్వాన్ని, వివరిస్తూ విలక్షణమైన తర్క మీమాంస చేశారు రచయిత. (నాకు కలిగిన ప్రత్యేకమైన ఆలోచనలు అని చెప్పుకున్నారు)

నీ భార్య మీద ప్రేమతో నీవేమైనా చెయ్యవచ్చు, కానీ నా జీవితాన్ని బలిపెట్టే అధికారం నీకెవరిచ్చారు? అని రాముడు తండ్రిని అడగలేదు.

అయోధ్య సమాజమంతా రాముని రాజుగా చూడాలని ఉవ్విళ్లూరుతోంది. అంతఃపుర ఆగడాలు బయటపెట్టి ప్రజలారా మీరే తీర్పు చెప్పండి అంటూ ప్రజల్లోకి వెళితే?


దశరథుడు భార్యకు మాట ఇచ్చాడు, దానిని పాటించమని కైక చెప్పింది. ఆవశ్యం అన్నాడు రాముడు, తండ్రి చేత ఒక్కమాట చెప్పించు, నేను అరణ్యవాసానికి వెళ్లిపోతాను అని మెలిక పెడితే? - ఇలా సాగింది

విభీషణుడు వచ్చి మైత్రిని కోరగా - నమ్మవద్దు అసలే రాక్షసుడు ఏ కుట్ర దాగి ఉందో అని అందరూ వారించినా "సకృదేవ ప్రపన్నాయ తవాస్మీతి చ యాచతే, / అభయం సర్వ భూతేభ్యో దదామ్యే తద్వ్రతం మమ" అని ఆశ్రయమిచ్చి, ఆ రాజ్యం తనకే కావాలనుకుంటే అడ్డుచెప్పే వారు లేకున్నా, విభీషణునికి లంకారాజ్య పట్టాభిషేకం చేసిన స్నేహశీలి.

యువరాజు కావలసిన లక్ష్మణుడు రాజభోగాలన్నీ త్యజించి అన్నతో అరణ్యవాసానికి సిద్ధపడ్డాడు. అహర్నిశలు అన్నావదినల సేవలోనే తలమునకలయ్యాడు. సంసార జీవితాన్ని కూడా వదులుకున్నాడు. మాయ లేడి సన్నివేశంలో వదినగారు వేసిన నిందలన్నీ భరించాడు. రావణ వధానంతరం రాముడు పట్టాభిషిక్తుడైనప్పుడు యువరాజుగా పట్టాభిషేకం చేస్తానంటే అంగీకరించలేదు. రాగభోగాతీతుడై త్యాగమే జీవితంగా గడిపిన

ఉదార చరితుడు.

ఇక హనుమంతుని పాత్ర గురించి ఎంతయినా చెప్పుకోవచ్చు. వీరు కూడా ఏడెనిమిది పేజీలలో వివరంగా చెప్పారు. మొదటిసారి రామలక్ష్మణులను చూసినప్పుడే వారి లోని దైవత్వాన్ని గమనించిన ఔన్నత్యం అతనిది. రాజ్యభ్రష్టులై అరణ్యాల పాలై దీనావస్థలో ఉన్న రామలక్ష్మణులతో పోలిస్తే హనుమ మంత్రి పదవిలో ఉన్న అజేయుడని , అయినా వారిని తన భుజాలపై పెట్టుకుని సుగ్రీవుని చెంతకు తీసుకు వెళ్ళి న నిరహంకారి అని తర్కించారు.. ప్రభు భక్తి, సీతాన్వేషణలో కార్యదక్షత, మైనాక సరమల వృత్తాంతాలు, సీతాన్వేషణ విఫలమైతే ఆ వార్తా విని రామలక్ష్మణ, అంగదాదులు, వానర సైన్యము అందరూ ప్రాణాలు విడుస్తారు. అంచేత ఇంతమంది బదులు తానొక్కడే ప్రాణత్యాగం చేస్తాననుకోవడం హనుమ త్యాగశీలత. ఎన్ని చెప్పినా- నానృగ్వేద వినీతస్య నా యజుర్వేద ధారిణః .. శ్లోకం ఉటంకించి హనుమద్వాగ్ వైభవాన్ని స్మరించనిదే పూర్తికాదు.




భరతుడనగానే త్యాగం, నిస్వార్థ జీవనం, నిరాడంబరత... జ్ఞాపకం వస్తాయి. గొప్ప రాజ్యానికి అధిపతి అయ్యే అవకాశాన్ని వద్దనుకున్నాడు. పైగా అరణ్యవాసం చేస్తున్న అగ్రజుడెటువంటి కఠినతర జీవితాన్ని గడుపుతున్నాడో తానూ అట్టి జీవితాన్ని గడిపాడు. నార చీరలే ధరించాడు, కందమూలాలు తిని ప్రాణం నిలుపుకున్నాడు, రాజ్య సంపదలు, నగర జీవిత సుఖాలు వదులుకుని నందిగ్రామం అనే పల్లెలో ఆశ్రమ వాసం చేశాడు. రామ పాదుకా పట్టాభిషేకం చేసి రాజ్యాన్ని నడిపాడు. ఇన్నిటిని త్యాగం చేసిన ధన్యజీవి. లోభరహితుడు కానివాడు భరతుడని చమత్కరించి భరతుని వ్యక్తిత్వాన్ని ఒక్క మాటలో చెప్పారు.

విభీషణుడు- బ్రహ్మ ప్రత్యక్షమైతే నేను ఎటువంటి ఆపదలో ఉన్నా నా బుద్ధి ధర్మాన్ని విడిచి పెట్టకుండా వరమిమ్మన్నాడని, అతీత శక్తి యుక్తులు కోరుకోకుండా ధర్మానురక్తిని చాటుకున్నాడని, ఎవరి మాటా వినని అహంకారి అన్నగారికి సీతాపహరణ విషయంలో అనేకమార్లు హితం చెప్పి ఒప్పించాలని చూశాడని విభీషణుని లోని మానవత్వం గురించి సోదాహరణంగా చెప్పారు. త్రిజట వాక్చాతుర్యం, ప్రాణ త్యాగానికైనా సిద్ధపడిన త్యాగ గుణం వివరించారు. ఈ విధంగా రామాయణ పాత్రల ధర్మ, త్యాగ, సుగుణ, దుర్గుణ, బల, బలహీనతాది గుణములన్నీ సామాజిక మానుష భూమికలోనే ఎత్తి చూపుటలో కృతకృత్యులై , గ్రంథ నామ సార్థక్యం సాధించారు.

ఉపన్యాసాలు, ప్రవచనాలు అక్షర బద్ధం చేసేటప్పుడు, సాధారణంగా జరిగేవి- పునరుక్తి, శాఖాచంక్రమణం, క్లుప్తత లోపించుట. ఈ విషయాల్లో జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు కానీ మరింత క్లుప్తత పాటించే అవకాశం చాలా చోట్ల కనిపిస్తుంది.


ప్రతిభా వైవిధ్యం గల వరప్రసాద్ గారు నిత్య నిరంతర విద్యార్థి. అందుకు వీరు ప్రకటించిన హిందీలో రెండు కాక, 15 పైబడిన తెలుగు గ్రంథాలు, అవధాన పరంపరా విన్యాసం, మధునాపంతుల సత్యనారాయణశాస్త్రి మొదలు, అధికార భాషా సంఘం, పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం, అనేకానేక ఇతర సాహిత్య సాంస్కృతిక సంస్థలు ప్రదానం చేసిన పురస్కారాలు ఇలా ఎన్నో చెప్పవచ్చు

మౌని వాల్మీకి భాషా సంక్రాంత ఋణము ఈ విధంగా తీర్చుకున్నారనిపిస్తుంది. 'రామాయణ మివ రత్నాఢ్యాం' అనటం కద్దు. అది విలువలనే రత్నాలతో, ఆదర్శాలనే మణులతో నిండిన ఒక అమూల్యమైన గ్రంథం. రామాయణ సముద్రపు లోతులకు వెళ్లి వరప్రసాద్ సేకరించిన రత్నాలు కొన్ని ప్రస్తుత గ్రంథ రూపంలో, వాల్మీకిపై గల భక్తి శ్రద్ధలకు ఫలశ్రుతిగా అందించి ధన్యులయ్యారు.

**- శివనాథ శిరోమణి**

రామాయణం- మానవత్వం
డా. కడిమిళ్ల వరప్రసాద్
పేజీలు : 140, వెల : రూ.150
ప్రతులకు : రచయిత పేర, 3-6-50, యఱ్ఱమిల్లి వారి వీధి,
నరసాపురం-534275, ఆంధ్రప్రదేశ్ ఫోన్: 9247879606
2) తురగా ప్రచురణాలయం, ఫ్లాట్ నెం. 305, బ్లాక్ 5,
ఎస్‌బిసి ప్రిస్టైన్ ప్లేస్ అపార్ట్‌మెంట్స్, గాజుల రామారం,
కుత్బుల్లాపూర్, హైదరాబాద్-500 055, 9908572598.

# వేదాల్లో విజ్ఞానాంశాలు



పోలిశెట్టి బ్రదర్స్

(గత సంచిక తరువాయి)

అత్రిమహర్షి గమనించిన సంపూర్ణ సూర్యగ్రహణ విషయాన్ని గురించి సాంఖ్యాయనం 24-3 లోనూ, తాండ్యబ్రాహ్మణం 4వ మండలంలో 5-2-6-14 ఋక్కులలోనూ వ్రాయబడి ఉన్నట్లు శ్రీ బాలగంగాధర తిలక్ కనుగొన్నారు. ఋగ్వేదంలోని 2వ మండలం 2-7 మంత్రంలోనూ, 4వ మండలంలోని 6వ మంత్రంలోనూ అత్రి మహర్షి వాడిన 'తురీయబ్రహ్మ' అనే టెలిస్కోపు ప్రస్తావన ఉంది. మొట్టమొదటి టెలిస్కోపు నిర్మాత 'అత్రిమహర్షి' కావచ్చు.

## సంపూర్ణ సూర్యగ్రహణం- ఒక పురాణకథ

తారాశశాంకం : సంపూర్ణ సూర్యగ్రహణాన్ని గురించీ బుధగ్రహ పరిశీలన గురించీ మర్మగర్భంగా వివరిస్తున్న పురాణ కథ 'తారాశశాంకం'. సంపూర్ణ సూర్యగ్రహణాన్ని పరిశీలించడంలో మొట్టమొదటిసారిగా 'బుధగ్రహాన్ని' చూసిన కాలం నాటి (కల్పిత) కథ ఇది. మహర్షులు తాము కనుగొన్న ఖగోళ విషయాలను పురాణపరంగా వివరించడం కోసం ఈ కథను కల్పించి, గ్రంథస్థం చేశారు.

తార, బృహస్పతులు భార్యాభర్తలు. బృహస్పతి వద్ద విద్య నేర్చుకోవడానికి వచ్చిన చంద్రుణ్ణి కామించింది తార. తనతో సంగమానికి చంద్రుణ్ణి ఎలాగయితే ఒప్పించింది. తారతో రమించాడు చంద్రుడు. బృహస్పతికి ఇదేం తెలియదు. తారకు 'బుధుడు' అనే కొడుకు పుట్టాడు. బుధుడు 'నా కొడుకంటే నా కొడుకని' బృహస్పతి, చంద్రుడు వాదులాడుకున్నారు. అప్పుడు బ్రహ్మదేవుడు కల్పించుకుని చంద్రుడు, బృహస్పతులలో ఎవరి పోలికలు బుధునికి ఉన్నవో పరిశీలించాడు. బుధుని పోలికలు చంద్రునిలో కన్పించడంతో పుట్టిన బిడ్డ చంద్రుని కొడుకేనని నిర్ధారణ చేశాడు. తారాశశాంకం అనేబడే పురాణ కథ యొక్క సారాంశం ఇది. ఈ కథలో దాగివున్న ఖగోళ విషయాలను ఇప్పుడు తెలుసుకుందాం.

సూర్యుణ్ణి ఒక నక్షత్రంగా (అంటే తారగా) తెలుసుకోవడం, సంపూర్ణ సూర్యగ్రహణాన్ని పరిశీలించడం, బుధుడు అనే గ్రహాన్ని కనుగొనడం, బుధగ్రహానికీ చంద్రునికీ పోలికలున్నాయని గ్రహించడం... ఇత్యాది విషయాలన్నీ ఈ కథలో అంతర్లీనంగా ఉన్నాయి.

తార అనగా నక్షత్రం కదా! మనకు దగ్గరలో ఉన్న తార 'సూర్యుడు'. పై పురాణ కథలో 'తార' అంటే సూర్యుడన్న మాట! సూర్యుణ్ణి తారగా గమనించి, దాన్ని ఒక స్త్రీ పాత్రగా చిత్రీకరించారు మహర్షులు. నవగ్రహాలలో అతి పెద్దదైన బృహస్పతి గ్రహాన్ని (అనగా గురుగ్రహాన్ని) తారకు భర్తగా వర్ణించారు. బృహస్పతి ఉన్న నక్షత్రరాశి లోకి సూర్యుడు ప్రవేశించిన నాటి కథ ఇది. ఒకే రాశిలో ఉన్న వీటిని భార్యాభర్తలుగా వర్ణించారు. ఆ తర్వాత చంద్రుడు కూడా అదే రాశిలోకి ప్రవేశించడం జరిగింది. బృహస్పతి వద్దకు చంద్రుడు విద్యార్థిగా రావడం అంటే ఇదే! సంపూర్ణ సూర్యగ్రహణ సమయంలో చంద్రుడు సూర్యుని మీదుగా ప్రయాణిస్తాడు. సూర్యుని మీదుగా చంద్రుడు అలా దాటుకుంటూ వెళ్లడాన్నే 'తారతో చంద్రుడు రమించినట్లుగా' వర్ణించారు మహర్షులు. ఈసారి బుధుడి సంగతి చూద్దాం. బుధుడు సూర్యునకు అతి దగ్గరగా ఉన్న మొట్టమొదటి గ్రహం. సాధారణంగా సూర్యకాంతిలో అది మనకు కన్పించదు. తారాశశాంకం అనే కథ వ్రాయబడిన కాలానికి బుధుడనే గ్రహం కనుగొనబడలేదు. సంపూర్ణ సూర్యగ్రహణం కలగబోతోందని గమనించిన మహర్షులు, ఆ గ్రహణాన్ని పరిశీలించడానికి పూనుకున్నారు. చంద్రుడు సూర్యుడికి అడ్డుగా వచ్చిన సమయాన, సూర్యకాంతి మసకబారడంతో ప్రప్రథమంగా వారు బుధగ్రహాన్ని చూడగలిగారు. ఈ విషయాన్నే పురాణపరంగా 'తారా చంద్రుల కలయిక వల్ల బుధుడు ఉద్భవించినట్లుగా' చెప్పుకొచ్చారు వారు. బుధుడి తల్లి 'తార' అని చెప్పడంలోని అంతరార్థం 'బుధుడు కూడా సూర్యుని నుండి ఉద్భవించాడని నిర్ధారణ చేయడమే!' బుధుని తండ్రి చంద్రుడేనని బ్రహ్మదేవుడు తేల్చినట్లుగా పైన తెలుసుకున్నాం. మహర్షులు అలా ఎందుకు రాశారో చూద్దాం. ఆకారంలోనూ, లక్షణాలలోనూ 'చంద్రుడు-బుధుడు' ఒకే పోలికలు కలిగివున్నట్లుగా ఆధునిక శాస్త్రవేత్తలు చెప్తున్నారు. వారు చెప్తున్న పోలికలు వరుసగా ఇలా ఉన్నాయి.

1) బుధునిక ఉపరితలం, చంద్రుని ఉపరితలం వలెనే క్రేటర్స్‌తోనూ, పర్వతాలతోనూ నిండి ఉందట. (1973లో అమెరికా వారు పంపిన 'మారినర్-10' అనే రోదశీనౌక

పంపించిన ఫోటోల వల్ల ఈ విషయం తెలిసింది.)

2) ఈ రెండింటి గ్రహ పరిమాణం ఇంచుమించు సమానం. చంద్రుని వ్యాసం 2,160 మైళ్లు కాగా, బుధుని వ్యాసం 2,900 మైళ్లు.

3) చంద్రునిలో వలెనే బుధునిలో కూడా వాతావరణం లేదు.


4) చంద్రునిలో వలె బుధునకు పగటి భాగంలో అతి వేడి, రాత్రి భాగంలో అతి చలి ఉంటుంది. (వాతావరణం లేకపోవడమే దీనికి కారణం.)

5) చంద్రుని వలె బుధునకు గురుత్వాకర్షణ శక్తి తక్కువ.

6) చంద్రుడు తనపై పడే సూర్యరశ్మిలో నూటికి 7 వంతులనే ప్రతిఫలిస్తాడు. సరిగ్గా బుధుడు కూడా అంతే!

ఈ రెండు గోళాలూ కూడా ఒకే విధమైన మసిబారిన అద్దాల వంటివి.

ఆకారంలోనూ, లక్షణాలలోనూ ఇన్ని విధాల ఒకేవిధంగా ఉన్నందువల్లనే బుధుణ్ణి చంద్రుని కొడుకుగా బ్రహ్మదేవుడు చెప్పాడన్నారు. నిజానికి ఈ పోలికలన్నింటినీ గమనించింది బ్రహ్మదేవుడు కానేకాదు. ఆనాటి మహర్షులే ఇవన్నీ తెలుసుకున్నారు. బుధుడు సూర్యుని నుంచి ఉద్భవించాడని చెప్పనే, అతని పోలికలు - చంద్రుని పోలి ఉన్నాయని విషయాన్ని కూడా విశదీకరించారు మహర్షులు. (గ్రీకుల పురాణాల ప్రకారం బుధుడు, బృహస్పతి కొడుకే! రోమన్ల అభిప్రాయం కూడా అంతే! బృహస్పతిని గ్రీకులు 'జూస్' అనీ, రోమన్లు 'జూపిటర్' అని అనేవారు. బుధుడిని గ్రీకులు 'హెర్మిస్' అనీ, రోమన్లు 'మెర్క్యూరీ' అనీ అనేవారు. జూస్ (జూపిటర్) కొడుకే హెర్మిస్ (మెర్క్యూరీ) అనేది వారి పురాణభావన. దీన్నిబట్టి హైందవ మహర్షుల సిద్ధాంతమే సరైనదని తెలుస్తోంది చూడండి.)



తారశశాంక కథలో ఇంద్రుని ప్రస్తావన, శుక్రుని ప్రస్తావన కూడా వస్తుంది. ఇంద్రుడంటే 'విషువత్ రేఖయే!' శుక్రుడంటే శుక్రగ్రహమే! విషువత్ రేఖ దగ్గరలే (అనగా సంవత్సరాది సమయంలో) 'సూర్యుడు, చంద్రుడు, బృహస్పతి, బుధుడు, శుక్రుడు, రాహువు లేదా కేతువు అనే ఛాయాగ్రహం'ల కూటమి ఏర్పడిన సందర్భంలో సంపూర్ణ సూర్యగ్రహణం ఎప్పుడు వచ్చిందీ తెలుసుకుంటే, బుధగ్రహాన్ని కనుగొన్నకాలం ఖచ్చితంగా తెలుస్తుంది (సూర్య కుటుంబంలో ఇతర గ్రహాలు అంతకుముందే కనుగొనబడ్డాయి.) తారాశశాంక కథ, బుధగ్రహాన్ని కనుగొన్న కాలానిది. ఖగోళపరమైన ఆధారాలతో వెనక్కి లెక్కలు వేసుకుంటూ వెళ్తే, మన ఖగోళ విజ్ఞాన ప్రాచీనత తెలిసి వస్తుంది. పురాణ కథల్ని అర్థం చేసుకోగల ఓపిక లేకపోతే, నోరు మూసుకుని కూర్చోవాలి. అంటేగాని ప్రతీదాన్నీ పుక్కిట పురాణమంటూ తీసి పారెయ్యడం మేధావుల లక్షణం కాదు. ఒక శృంగార పురాణ కథగా మలచబడిన తారాశశాంకంలో ఎంతో ఖగోళ పరిజ్ఞానం ఉంది. దాన్ని అర్థం చేసుకోలేని అమాయకులకు, కేవలం అదొక బూతు కథ మాత్రమే! ఈ కథలో దాగివున్న ఖగోళ అంతరార్థాలను వరుసగా ఓసారి చెప్పుకుందాం.

1) సూర్యుడు కూడా ఒక నక్షత్రం అని తెలుసుకోవడం.

2) గ్రహాలన్నింటిలో పెద్దదిగా గమనించిన బృహస్పతిని గురు(వు) గ్రహంగా భావించడం.

3) గ్రహణ సమయాన్ని లెక్కించి, ఖగోళ పరిశోధనలకు వాటిని అనుకూల సమయాలుగా వాడుకోవడం. (సంపూర్ణ గ్రహణ సమయాల్ని ఇప్పటి ఖగోళ పరిశోధకులు కూడా చాలా మంచి అవకాశాలుగా వాడుకుంటూ ఉంటారు.)

4) సంపూర్ణ సూర్యగ్రహణాన్ని క్షుణ్ణంగా పరిశోధించడం.

5) బుధగ్రహాన్ని కనుగొనడం.

6) బుధగ్రహం, సూర్యుని నుండి ఏర్పడినదేనని నిర్ధారణ చేయడం.

7) విషువత్ రేఖ వద్ద సూర్యునితో పాటూ జరిగిన గ్రహ కూటమిని గమనించడం.

8) బుధగ్రహ ఆకారాన్ని, లక్షణాలనూ పరిశీలించడం.

9) అంతకుముందు గానే కనుగొన్న చంద్రుని రూప, లక్షణాలను బుధునితో పోల్చి చెప్పడం.

మొత్తం మీద ఇవన్నీ పై కథలోని ఖగోళ అంశాలే! ప్రాచీన హైందవులకు గల గ్రహణాల విజ్ఞానాన్ని ఈ తారాశశాంకం కథ నిరూపిస్తోంది.

పురాణ కథల్లోని అంతరార్థాల్ని వెలికి తీయడం ద్వారా మనదేశ కీర్తిప్రతిష్ఠల్ని మరింత పెంచవచ్చు. ఆధునిక మేధావినని అనుకునే వ్యక్తి పురాణాల్ని సమర్థించే సాహసం చేయలేకపోతున్నాడు. అలా చేస్తే తనను ఛాందసుడుగా లెక్కిస్తారేమోనని అతని భయం. పురాణాల్లో దాగివున్న అనంతమైన విజ్ఞానాన్ని బయటకు తీయగలిగిన వారు కూడా నిజమైన మేధావులని గ్రహించేకాలం రావాలి. అప్పుడే మన ప్రాచీన విజ్ఞానానికీ, చరిత్రకూ సార్థకత కలుగుతుంది.

(సశేషం)

(గత సంచిక తరువాయి)

గురువుల శిష్యరికంలో స్వామివారు తమ ఇరవయ్యవ యేట సకల శాస్త్రాలనూ అధ్యయనం చేసి, అందరికీ ఆనందాశ్చర్యాలను కలిగించారు.

శృంగేరీపీఠ గురుపరంపర విద్యను, తపస్సునూ విశిష్టంగా వర్ణించిన తీరు ప్రస్తుతిపాత్రంగా ఉన్నది.

"గురువు జగద్గురుండు, నయ కోవిదు లొజ్జలు, నింద్రియార్థవి
స్తర నిరపేక్షమౌ మది, వధానవిధానము ధ్యానయోగ సు
స్థిరము, నిసర్గతీక్ష్ణమగు శేముషి, శారదఁ బిల్వఁబల్కు దు
స్తర పదవాక్యమానమయవార్ధిని లీలగ దాట చిత్రమే?"

"శృంగగిరి జగద్గురువుల కెల్లరికిని
చక్షువులు రెండధీత్యను షానములనఁ
దపము పండని పాండిత్య ధనుడు లేడు
పాండితీహీనుడైన తపస్వి లేడు"

శృంగేరీ జగద్గురుపరంపరా విశిష్టతను ఉక్తిచాతురితో, యుక్తి చాతురితో ఉగ్గడించిన కవి ప్రతిభ నిరుపమానం కదా!

శ్రీశ్రీశ్రీ శివాభినవ నృసింహ భారతీస్వామివారు



శ్లోకాన్ని సందర్భోచితంగా అనువదించి అందించిన కవిగారి ఉచితజ్ఞత ప్రశంసాపాత్రం.

"ఆశావస్త్రుడనై, సదాత్మనిరత స్వాంతుండనై, లౌకికా
ర్థాశాదూరుడనై, కలేవరగతాహంప్రత్యయత్యాగినై,
యే శైలాగ్రమునందొ, కారడవినో, యే తుంగభద్రాతటీ
దేశంబందునొ స్వైరచారి నగుదున్ దిష్టార్పితాంగుండనై"

అనే ఈ పద్యంలో గురువుగారికి తమ మానసికస్థితిని స్వామివారు వెల్లడించిన విధానం కనిపిస్తుంది.

# అభినవ శంకర విజయం

గురుదేవులనుండి యోగసాధనమార్గాన్నీ, నరసింహ, మేథాదక్షిణామూర్తి, శ్రీవిద్యా మంత్రాలనూ శ్రీచక్రార్చనా విధానాన్నీ ఉపదేశంగా పొంది, పీఠ సంప్రదాయానుసారంగా చంద్రమౌళీశ్వర పూజలను నిర్వహిస్తూ తమ విధ్యుక్త ధర్మాన్ని విశేష దీక్షతో పాటిస్తూ వస్తున్నారు.

రత్నగర్భ గణపతిని అర్చిస్తూ నిత్యమూ ప్రణవోపాసన సాగిస్తూ, కాలం గుడుపుతున్నారు స్వామివారు. వారి మనస్సులో వైరాగ్య భావం బలంగా నాటుకొన్నది. ప్రాపంచిక విషయాలు ఆ స్వామికి అరుచి కలిగిస్తున్నాయి. అంతే కాదు, పీఠ పరిపాలన, జనసమూహానికి దర్శన మివ్వటం వంటి అంశాలపైకూడ అనాసక్తి కలిగింది.

అవాప్త కామునికి కోరికలు ఏముంటాయి?

కడుపునిండినవాని పళ్ళెరమున వడ్డించిన వంటకముంబోలె" అన్న చక్కని పోలికతో స్వామివారి అనాసక్తయోగ స్థితిని స్పష్టంచేశారు లలితాదిత్యకవి. ఈ సందర్భంగా స్వామివారు రచించిన "శారదా శతశ్లోకి" లోని ఒక



మల్లాప్రగడ
శ్రీమన్నారాయణ మూర్తి

శృంగగిరి కానన సీమలలోనో, తుంగానదీతీరాన ఇసుకతిన్నెలపైనో నిశ్చల బ్రహ్మైక్యభావనతో ఉండాలనే తమ ఆకాంక్షను గురుదేవులకు నివేదించారు స్వామివారు.

జయఘోషలు, వందనాలు, భక్తులకు ఉపదేశాలు మొదలైనవాటిపై తమకు ఆసక్తి లేదని, నిర్జన ప్రదేశంలో ఏకాంతంగా ధ్యాననిష్ఠలో ఉండటమే తమకు అభిలషణీయం అని గురుదేవులకు విన్నవించారు. యోగవాసిష్ఠంలోని శ్రీరాముని స్థితిని కూడ ఉదాహరించారు. తమ శిష్యుల అంతరంగంలోని ఈ ప్రాపంచిక విషయ నిరాసక్తతకు గురువుగారు చాల ఆనందించారు.

'సముద్రాన్ని పిల్లకాలువలా భావించటం హనుమంతుడికే సాధ్యం' అనుకున్నారు గురువుగారు. ఈ అర్థాంతరన్యాసను సందర్భోచితంగా ప్రయోగించారు లలితాదిత్య కవి.

శిష్యుని వైరాగ్య భావన తమకు ఆనందదాయకమే అయినా



పీఠరక్షణ దీక్షతో గురువుగారు శిష్యచూడామణికి నచ్చ చెప్పారు. శిష్యుని భావిజీవితాన్ని తాము దర్శిస్తున్నామని, తమది సత్య సంకల్పమనీ, అది వ్యర్థంకాదనీ అన్నారు. తమ శాసనం శిలాక్షరమనీ అదే విధి నిశ్చయమనీ, అదే శారదాంబ అభిమతమనీ అన్నారు. తమ స్థానంలో జగద్గురువై పీఠాధిపత్య బాధ్యతను స్వీకరించవలసిందనీ ఆదేశించారు.

అంతమాత్రాన చిత్తముచెదరదనీ, పీఠకీర్తికాంతులు విశ్వవ్యాప్తంకావాలనీ అందుకు తగిన విధంగా స్వీకరించే పీఠాధిపత్య బాధ్యతలు సాధనకు అవరోధంకావనీ ఎన్నో రీతులలో వివరించారు. ప్రస్థానత్రయభాష్యాలను స్వయంగా శిష్యునకు నేర్పించి, చంద్రమౌళీశ్వరార్చనాది పీఠకర్తవ్యాలను అప్పగించి, అంతర్ముఖులై, కాలంగడుప సాగారు.


గోకర్ణంలోని మహాబలేశ్వరులను దర్శించాలన్న తమ ఆకాంక్ష నెరవేరగా, అందుకు తమకు సహకరించిన వారిని తగురీతిని సత్కరించవలసిందిగా ఆదేశాలు జారీచేశారు.

ఆ పిమ్మట బ్రహ్మపదంచేరి, విదేహముక్తిని పొందారు వృద్ధనృసింహ భారతీస్వామివారు. శిష్యులైన శివాభినవ నృసింహ భారతీస్వామివారు గురువియోగ దుఃఖంతో పరితపించారు.

"ఇలలో మీ పదపద్మము దలపై
నిడుకొన్నవేళఁ దనియుచు నిజమో
కలయో యనుకొంటిని, యది
కలగా మిగిలినది నేడు కర్మవశమునన్."

అని విలపించారు.

గురువాక్యమే 'దారుణాపదల అగ్నిని చల్లార్చే వర్ష'మని, అలాంటి గురువులను కోల్పోయి అనాథు నైతినని పరిపరి విధాల విలపించారు నిద్రాహారాలుమాని అలా విలపిస్తున్న




సమయంలో ....

'గీత తొలిపాఠమే విస్మరింపదగునా?

పుట్టినవారికి గిట్టుట తప్పదుకదా!'

అని గురువుగారి వాక్కు వినపడింది.

'ఇంతకాలంగా శరీరంతో కనిపించిన మేము ఇపుడు పంచభూతాత్మకమైన ఈ ప్రపంచమంతటా నిండి ఉన్నామని గుర్తించ వలసింది" అన్నారు. రూపం పరిమితమనీ శక్తి అనంతమనీ గురు ప్రబోధంతో ప్రత్యభిజ్ఞ పొందిన స్వామివారు క్రమంగా మనస్సును కూడదీసుకొని, బ్రహ్మీభూతులైన గురుదేవుల పార్థివ శరీరానికి తగిన విధంగా అంత్యేష్టిని నిర్వహించారు.

(సశేషం)



# ఆర్ష ధర్మంపై అన్యుల విషం

## భరతజాతిని మేల్కొల్పే 'అరవిందుని' కలం

(గత సంచిక తరువాయి)

కుల పురాణాలు ఆయా కులాలకు ఆత్మగౌరవాన్ని కలిగించేవి, కులం గొప్పతనాన్ని చెప్పేవి. జాంబవ పురాణం, బలిజ పురాణం, మేదర పురాణం మొదలైనవి తెలుగు రాష్ట్రాల్లో ఉన్నాయి. భారతంలోని, రామాయణంలోని ఒక ప్రముఖవ్యక్తి తమకు మూలపురుషుడు అంటూ పరంపరగా వచ్చిన గ్రంథాలు ఇవి. వీటితో పాటు గ్రామ దేవతల గుడులు, వాటి ఆదాయాలు శూద్రకులాల అధీనంలో ఉండేవి. ఆ విధంగా ప్రతి కులం వారికి ఆర్థికంగానూ, సామాజికంగానూ గ్రామంలో ఒక ముఖ్యమైన పాత్ర ఉండేది. శైవ సంప్రదాయంలో తాంత్రిక మార్గం, వామాచార మార్గం ఉన్నాయి. తాంత్రిక ఉపాసనల్లో శక్తుల్ని పొందినవారు అనేకులు. వీరు ఆ కులంలోని వారిని ధార్మిక విషయాల్లో మార్గదర్శనం చేసేవారు. విదేశీ దండ యాత్రల సమయంలో కూడా ఈ కుల గురువుల పాత్ర ప్రధానంగా ఉండేది.

శూద్ర కులాలవారు హిందూ దేవతా ఉత్సవాలతో ఎంత ఘనిష్టంగా ముడిపడి ఉండేవారన్నది సుధా మోహన్ గారు విస్తారంగా రాసారు. బ్రిటీషు పాలకులు ఈ నిమ్న కులాల వారి జాతర్లను ఉత్సవాలను పూర్తిగా నిషేధించే ప్రయత్నాలు చేసారు. హింస ఉందనే సాకుతో అనేక జాతరల్ని నిషేధించారు. వారిని క్రైస్తవంలోకి తీసుకువెళ్లాలని మిషనరీల ప్రయత్నం. అందుకై శూద్ర కులాలలో మీరందరూ అణచబడ్డ వారు అనే భావనను ప్రచారం చేశారు. జాతరల్ని నిషేధించడమే కాక కొత్త చట్టాల్ని కూడా అన్ని ప్రాంతాలకు అమలయ్యేట్టుగా చట్టాల్ని తెచ్చారు. ఉదాహరణకు Prevention of Cruelty to Animals Act అనేది దేశమంతటా అమలు చేయబడింది. ముఖ్యంగా ఉత్సవాల్లో జంతుబలుల్ని నిషేధించడం దీని ఉద్దేశం. ఇటీవలి కాలం వరకు పోలీసులకు ఇదొక పెద్ద పనిగా ఉండేది. పోలీసులు ఇలాంటి ఉత్సవాల్ని ఆపడానికి కాల్పులు జరిపిన సందర్భాలు అనేకం. కానీ మతం పేరిట కోట్లాది గొర్రెల్ని కోస్తున్న ఇతర మతాల్ని గూర్చి వీరెవ్వరూ నోరెత్తలేదు.

కులదేవతల పూజలు, తాంత్రిక ఆచారాలు అనేక కులాల్ని హిందూమతంలోనే ఉండేట్టు చేసాయి. వారు వారి ఉపాసనల్ని స్వేచ్ఛగా చేసుకునేవారు, తాము బ్రాహ్మణుల స్థాయిలో ఉన్నామని భావించేవారు. వైదిక దేవతల్నే వైదిక మార్గంలో కాక వామాచార మార్గంలో పూజించేవారు. వీరి ఉత్సవాలు జాతరలకు బ్రాహ్మణులతో పాటు మిగతా కులలవారు కూడా పాల్గొని ఆనందించేవారు. వేల సంవత్సరాల పాటు బ్రాహ్మణులు ఇతర కులాల్ని అణచివేసారన్నది హాస్యాస్పదం. ప్రాచీన సమాజంపై మరింత పరిశోధన జరగాల్సిన అవసరం ఉంది.

గిరిజనులకు భారతీయ సంస్కృతితోనే సంబంధం లేదంటూ బ్రిటీషు anthropologists (మనుష్య శాస్త్రజ్ఞులు) అనేక గ్రంథాల్ని వ్రాసారు. వీరిలో ముఖ్యుడు Haimendorf. ఇతడు దేశంలోని పలు ప్రాంతాల్లో గిరిజనులతో నివసించాడు. గిరిజనులు ఈ దేశం యొక్క మూల వాసులనీ, బయట నుండి వచ్చిన ఆర్యులు వీరిని అరణ్యాలకు తరిమివేసారనీ ప్రతిపాదిస్తూ గ్రంథాల్ని వ్రాసాడు. వీటి ఆధారంగా మత ప్రచారకులు అనేకుల్ని క్రైస్తవంలోకి మార్చారు. వాస్తవాలు దీనికి పూర్తి భిన్నంగా ఉంటాయి. రామాయణంలో దశరథుని సైన్యం ప్రస్తావన వచ్చినప్పుడు సేనా విభాగాల్ని వివరించారు. ఆ కాలంనాటి సైన్యంలో ఉన్న ఆరు విభాగాల్లో వనవాసీ విభాగం ఒకటి. (నేటి భాషలో Punjab Regiment, Bihar Regiment అన్నట్లు). అయోధ్యాకాండ అధ్యాయం-3, 25వ శ్లోకానికి గోవిందరాజ వ్యాఖ్యలో మూల, భృత్య, శ్రేణి, సుహృత్, ద్విషత్, ఆటవికమితి, షడ్విధ బలోపాస్యత్వం సార్వభౌమ చిహ్న ముక్తమ్ అని వ్రాసాడు. ఆటవిక బలం (సేన) సార్వభౌముని సేనలో ఒక విభాగం. మహాభారత యుద్ధంలో కూడా ఇరువైపుల ఆటవిక సేనలు ఉండేవి. వారిలో ఏకలవ్యుడు కౌరవపక్ష వీరుడు. భారతీయ సాహిత్యంలోని ఇలాంటి సాక్ష్యాల్ని గమనించకుండా ఆంగ్ల పాలజిస్టులు వ్యాఖ్యలు చేయడం మతతత్త్వ మనస్తత్వం.



బ్రిటీషు పాలకులు కొన్ని నిమ్న కులాలను Criminal Tribes Act అనే చట్టం కింద నేరస్తులుగా గుర్తించి ఆ కులాల్లో పుట్టిన ప్రతి వ్యక్తిని పుట్టుకతోనే నేరస్తుడు అనే భావనతో వేధించారు. వారిని ఉద్ధరిస్తున్నామనే పేరుతో మతం మార్చారు. హిందూ మతంలో ఉండడంవల్ల వారిలో క్రూరత్వం ఉండేదని, తాము

వారిని మార్చామని కథనాల్ని ప్రచారం చేసారు.

## వర్ణం, జాతి, కులం

ఈ మూడూ సంస్కృత పదాలే. ఈ మూడింటిని ప్రాచీన పుస్తకాల్లో కొన్నిచోట్ల ఒకే అర్థంలో వాడారు, కొన్నిచోట్ల వేరువేరు అర్థాలలో వాడారు. ఉదాహరణకు భగవద్గీత 1-43లో "ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః" అని అర్జునుడు అంటాడు. జాతి ధర్మాలు, కుల ధర్మాలు అంటూ కొంత భేదాన్ని చూపించారు. మనుస్మృతిలో పదవ అధ్యాయంలోని శ్లోకం బ్రాహ్మణులు క్షత్రియులు, వైశ్యులు, ద్విజాతులు అనీ, శూద్రుడు ఏకజాతి అనీ, పంచమ అంటూ మరొకటి లేదు అని ఉంది. ఇక్కడ జాతి అనేదాన్ని వర్ణం అనే అర్థంలో వాడినట్లు కనిపిస్తుంది లేదా ద్విజాతి అంటే రెండుసార్లు పుట్టినవాడు (ఉపనయనం కలవాడు) ఏకజాతి అంటే ఉపనయనం లేనివాడు అనే అర్థాన్ని కూడా తీసుకోవచ్చు. తరువాత మరొకచోట -

**తపః శ్రుతఞ్చ యోనిశ్చ త్రయం బ్రాహ్మణ్య కారణమ్ ।**
**తపః శ్రుతాభ్యాం యో హీనో జాతిబ్రాహ్మణ ఏవ సః ॥**

(శబ్దార్థచింతామణి)

తపస్సు, వేదాధ్యయనం, జన్మ ఈ మూడు బ్రాహ్మణత్వానికి కారణం. తపస్సు వేదం లేనివాడు కేవలం జాతి బ్రాహ్మణుడు అన్నారు. ఇక్కడ కూడా దాదాపు జాతి అంటే వర్ణం అనే విధంగానే వాడబడింది. మనుస్మృతిలోని మరొక శ్లోకం "అగ్నిర్దేవో ద్విజాతీనాం" అని ఉంది. ద్విజులకు అగ్నియే (యజ్ఞమే) ప్రధానం అని అర్థం. ఇక్కడ కూడా ద్విజాతి అంటే వర్ణము అనే అర్థమే.

కులం అనే పదానికి ఆప్టే (Apte) నిఘంటువులో గౌరవప్రదమైన కుటుంబం లేదా వంశం అని చెప్పబడింది. ఆచారము, వినయము, విద్య ప్రతిష్ట ఒక వృత్తి, తపస్సు, దానం ఇవన్నీ కూడా కుల లక్షణం అని చెప్పబడింది. భగవద్గీతలో శ్రీకృష్ణుడు నాలుగు వర్ణాల్నే చెప్పాడు. దీనినిబట్టి సమాజంలో చూస్తున్న అనేక ఉపకులాలు ఈ నాలుగు వర్ణాల క్రిందికి వచ్చేవే. బ్రాహ్మణ అనే వర్ణంలో వైష్ణవులు, శైవులు, స్మార్తులు మొదలైన అనేక వర్గాలున్నప్పటికీ బ్రాహ్మణ అనే వర్ణం క్రిందికే వస్తారు. అలాగే క్షత్రియులు వైశ్యుల్లోనూ అనేక ఉపకులాలు. శూద్ర వర్ణంలో కూడా అనేక ఉపకులాలు ఉన్నాయి.

మరొక పదం జాతి. ఇది అనేక వస్తువుల్లో ఉండే సామాన్య గుణం. ఉదాహరణకు మనుష్యజాతి, వృక్షజాతి అని వ్యవహారం ఉంది. "ఏకం అనేకానుగతం జాతిః" ఒకే గుణం అనే వస్తువుల్లో ఉన్నప్పుడు దాన్ని జాతి అంటారు. జాతిలో కులాలు అనేకాలు ఉండవచ్చు. తరువాత ఇంగ్లీషు నుండి వచ్చిన ఖుర్వ అనే పదం పాశ్చాత్య సంస్కృతికి చెందినది దానిలో hierarchy ఉంది.



భారతీయ సమాజంలో చెప్పబడిన వర్ణానికి కూడా hierarchy ఉన్నట్లు భావిస్తే caste అనే పదాన్ని ఈ కులాలకు వాడవచ్చు. hierarchy ఉందా లేదా అన్నదానిపైనే వివాదం.

ఆధ్యాత్మికత అన్ని కులాల్లోనూ/వర్ణాల్లోనూ ఉందని భారతీయ సమాజ చరిత్ర చెపుతుంది. వైదిక సంస్కృతి (వేదాలు యజ్ఞాలు) మొదటి మూడు వర్ణాలకే పరిమితమైనప్పటికీ తంత్రశాస్త్రగ్రంథాలు సమాజంలో ప్రాచుర్యంలో ఉండేవి. ఉదాహరణకు కులార్ణవతంత్రం అనే పుస్తకం శూద్ర కులాల్లో చాలామంది ఉపాసనలు, సాధనలు చేసేవారని చెప్తుంది.

**గతం శూద్రస్య శూద్రత్వం విప్రస్యాపి చ విప్రతా ।**
**దీక్షాసంస్కారసంపన్నే జాతిభేదో న విద్యతే ॥**

(కులార్ణవ తంత్రం 13-91)

తంత్రంలో దీక్ష తీసుకున్న శూద్రుడికి శూద్రత్వము తొలగిపోతుంది, విప్రుడికి విప్రత్వం తొలగిపోతుంది, జాతి భేదం ఉండదు అని దీని అర్థం. చాలా మంది అగ్రవర్ణాలు వారు కూడా తంత్ర సాధనల్ని చేసేవారు. మరొక శ్లోకం ఇలా అంటుంది -

**ద్విజో యో దీక్షితః పశ్చాత్ అంత్యజః పూర్వదీక్షితః ।**
**ద్విజః కనిష్ఠః సః శ్రేష్ఠ ఇతి శాస్త్రస్య నిర్ణయః ॥**

(కుల.తంత్ర 13-98)

అంత్యజుడు (శూద్రుడు) మొదలు దీక్ష తీసుకొని ద్విజుడు ఆ తరువాత దీక్ష తీసుకుంటే ద్విజుడు తక్కువవాడు, శూద్రుడే శ్రేష్ఠుడు అని శాస్త్ర నిర్ణయం అని శ్లోకం యొక్క అర్థం.

శూద్ర కులాల్లోని అనేకులు ఈ తాంత్రిక సాధనల్ని చేసేవారని తెలుస్తుంది.

(సశేషం)

# కంచిస్వామి దివ్య చరిత్ర 'గని - అద్వైత గని'

### వడవంబలంలో ఆశ్చర్యకర సంఘటన
(గత సంచిక తరువాయి)

"గత జన్మంబుల నేమి నోఁచితిమొ? యాగశ్రేణు లేమేమి జే సితిమో? యెవ్వరి కేమి పెట్టితిమొ? యే చింతారతిం బ్రొద్దు పుచ్చితిమో? సత్యము లేమి పల్కితిమొ? యే సిద్ధప్రదేశంబుఁ ద్రొ క్కితిమో? యిప్పుడు జూడఁగంటి మిచటం గృష్ణార్భకు న్నిర్భయున్."

చన్ద్రశేఖరేంద్ర సరస్వతి మహాస్వామివారు కూర్చున్నారు. ఇక్కడ కూర్చుని వారి గురువుగారికి ఆరాధన కార్యక్రమం చేశారు. వారిక్కడే గోశాలలో పడుకున్నారు. వారిక్కడే ఒక పాకలో ఉన్నారు. వారిక్కడే నూతిలో నీరు తోడుకున్నారు. వారిక్కడ స్నానం చేశారు. వారిక్కడ చంద్రమౌళీశ్వర ఆరాధన చేశారు. అటువంటి మహాపురుషులు తిరుగాడినటువంటి ప్రదేశాన్ని నేనుకూడా నాకాలుతో తొక్కాననుకోండి, అది కోట్ల జన్మల పాపరాశిని ధ్వంసం చేస్తుంది. అదీ జీవితంలో అంత తేలిక్కారాదు. అటువంటి ప్రాంగణాన్ని నిర్వహించే అదృష్టం దొరకాలంటే, దొరుకుతుందా? గురువుగారి అనుగ్రహం ఉన్ననాడే దొరుకుతుంది. ఏం మాటలుకాదది. అది కొన్ని కోట్ల కోట్ల కోట్ల మందిలో ఏ ఒక్కరినో ఆ అదృష్టం వరిస్తుంది. ఆయన అనుగ్రహం ఉంటే తప్ప అది సాధ్యంకాదు.

అందుకే అంతటి మహానుభావుడు. కాబట్టి "ప్రజ్ఞా... బ్రహ్మపదజ్ఞా".... యస్య రసజ్ఞచ, తాత్త్వికర్థజ్ఞా...ఎవరియొక్క నాలుక తత్త్వాన్ని పలుకుతుందో, 'తత్త్వాన్ని' పలకడమంటే పైపైన ఉండేటటువంటి అర్థాన్ని తెలుసుకొని మాట్లాడ్డంకాదు, అంతటా...అన్నివేళలా...సమస్తమునందు కూడా ఆ పరబ్రహ్మాన్ని చూడగలిగినటువంటి శక్తి లోపల అంకురించి, వారు మాట్లాడు తున్నారు అంటే, అందులో ఉన్నటువంటి సారభూతమై నటువంటి విషయాన్ని ప్రతిపాదన చేస్తారు. ఆ తత్త్వమెక్కడ నుంచి అందుతుందంటే ఒక్క అటువంటివారి నోటినుంచి మాత్రమే అందుతుంది. ఆ తత్త్వం నిజానికి ఎంతో తపస్సు చేసినవారికి భాసిస్తుంది. కానీ, ఒక మహానుభావుడు గురువుగా శరీరంలో తిరిగితే ఆయన వలన లోకానికి అందేటటువంటి మహాప్రయోజనమేమిటి అంటే, ఆయన నోటినుంచి వచ్చినటు వంటి ఉపదేశం కొన్నివేల పుస్తకాలు చదివితే వచ్చేటటువంటి జ్ఞానమేది ఉంటుందో, ఆ తత్త్వం వారి నోటివెంట చాలా సులభసాధ్యమై ఆచరణీయమైనటువంటి మాటగా పైకొస్తోంది.

అదీ మీరు వేల పుస్తకాలు చదవండి, సాధ్యంకాదు. నిరంతరము తత్త్వమును అనుభవించిన కారణం చేత, తత్త్వమే నాలుకవెంట మాటగా పైకొస్తూ ఉంటుంది అటువంటివారి నోటివెంట. అది ఆస్థాయికి వెళ్ళినటువంటి మహాపురుషులవలన అందుతుంది. అందుకే, వారు శరీరంలో ఉండటం అదృష్టం. వారు ఎంతకాలం శరీరంలో ఉన్నారో అంతకాలం మాట్లాడతారు. అంతకాలం మాట్లాడతారు కాబట్టి యోగ్యతాయోగ్యతలతో సంబంధంలేదు. ఎవ్వరైనా వెళ్ళి కూర్చుని వింటారు. వారి వాణి చెవిలో పడింది అంటే, అది అజ్ఞాన దాహకత్వానికి కారణమవుతుంది. అందుకే ఆయన యొక్క నాలుక, ఆయన యొక్క నోరు 'తత్త్వాన్ని' ఎప్పుడు కూడా పలుకుతూ ఉంటుంది. మనకి సాధన నేర్పుతూ ఉంటుంది. అసలు ఎలాగండీ... ఈ సాధనాక్రమం? అనుకుంటాం.



తూములూరి
మోహన్ కుమార్


### చల్లా విశ్వనాథశాస్త్రిగారి మాట

చల్లా విశ్వనాథశాస్త్రిగారు ఒకమాట చెప్పారు. ఆయన 'సాధన ఎలా' అన్న వాళ్ళకి చాలా తేలికగా రెండే మాటలు చెప్పారు. వారేమన్నారంటే, "అంతటా పరబ్రహ్మాన్ని చూడు" కష్టమా? అంతటా ఈశ్వరుణ్ణి చూడలేవా? అన్నిటా ఈశ్వరుణ్ణి చూడు. అయిపోయిందంతే! పట్టుకోగలిగితే ఇంకా అంతకన్నా ఏంకావాలి సారం? అంతటా చూడు.

'అంతర్బహిశ్చ తత్సర్వం వ్యాప్య నారాయణః స్థితః' అలా చూడ్డంకుదరట్లేదండి, అజ్ఞానం అడ్డొస్తోంది...వాళ్ళు ఆడవాళ్ళు వీళ్ళు మగవాళ్ళు, వీళ్ళు పిల్లలు, వాళ్ళు పెద్దవాళ్ళు, అది గోడ, ఇది ఫాను, ఇది మైకు, ఇది కుర్చీ, ఇది వస్త్రం ఇన్నీ తెలుస్తున్నాయి. అన్నిటి మధ్యా నాకు భావాలు మారిపోతు న్నాయి. ఎలా...అన్నిటా ఈశ్వరుణ్ణి చూడు. మరి నాకు ఏదైనా బాధకల్పించినవాడు? నా గతజన్మలలో పాపం పోగొట్టడానికి పాపం వాడు మూటగట్టుకొని నాకు దుఃఖాన్ని కల్పించి నన్ను కాపాడాడు ఈశ్వరస్వరూపంగా. ఇప్పుడసలు ఈశ్వరుడు కానిదేమిటి? అంతటా... ఈశ్వరుణ్ణి చూడు. సాధ్యంకాదా? అన్నిటా...ఈశ్వరుణ్ణి చూడు. చెప్పగలమా!...అందరం చెప్పటం సాధ్యమవుతుందా? అసలు చెప్పడం అన్నమాటలో గొప్పతనం ఎక్కడుంటుందో తెలుసా! మీరు చన్ద్రశేఖరేంద్రసరస్వతి స్వామివారి గురించి రెండు గంటలు మాట్లాడండి... అన్నారనుకోండి. రెండు గంటలు మాట్లాడి నాబోటిగాడు ఏమంటా

డంట... అబ్బో! చెప్పవలసింది చాలా ఉండిపోయిందండి, మరచిపోయాను ఇంకా చెప్పలేనండి అంటాడు. రెండు నిమిషాలు మాట్లాడండి... అన్నారనుకోండి!... రెండు నిమిషాలలో చన్ద్రశేఖరేంద్రసరస్వతి స్వామివారి తత్వమంతటిని చెప్పేసి... నేను చెప్పానండి... అనగలిగాడనుకోండి... వాడు 'ప్రాజ్ఞుడు'.

అంటే, అతితక్కువ అక్షరాలూ వాడుకొని పెద్ద తత్వాన్ని ఆవిష్కరిస్తాడు. అది చాలా కష్టం. ఆ ప్రజ్ఞ అలవడదు. అది తత్వమునందు రమించేవాడే తత్వాన్ని అలా చెప్పగలడు. వారు దానిలో పండిపోయారు కాబట్టే అంత తేలికగా ఆ విషయాన్ని లోకానికి అంత అద్భుతంగా అందించారు మహానుభావుడు. అలా అందించగలిగినటువంటి ప్రజ్ఞ అంకురించడానికి కారణం ఎక్కడుంటుంది అంటే, ఇదిగో... వారు కూడా నిరంతరమూ ఎదో బాహ్యంలో ప్రతిపాదింపబడినటువంటి విషయాన్ని చూడటం కాదు... తత్వాన్ని చుస్తూ ఉంటారు. అంతటా పంబ్రహ్మాన్నేచుస్తూ ఉంటారు. చెదపురుగులు శరీరాన్ని కొరుకుతూ ఉంటే... అందులో కూడా ఈశ్వరుడున్నాడు. ఈశ్వరుడు లేనినాడు ఆ చెదపురుగు కదలదు కదా! దాని ఆహారం దానిది. దాన్ని చంపేయడం చాలా తేలిక.





కానీ చెదపురుగు శరీరం లాంటి శరీరాన్ని నిర్మించి అందులోకి పరమేశ్వరుణ్ణి ప్రవేశపెట్టి అదికూడా కదిలేటట్టు, దానికి భయం, దానికి ఆకలి, దానికి నిద్ర, దానికి మోహం, దానికి శోకం, దానికి లోభం, దానికి జరా, దానికి మరణం నువ్వు పెట్టగలవా? కాబట్టి అందులో ఈశ్వరుడు ఉన్నాడు. కదులుతోంది అన్న భావనతో దాన్ని చంపేయకండి. శ్రావణంతో పట్టుకుని పక్కన పెట్టేయండి. అనగలగాలి అంటే, అదేమైనా మాటలా? అదేమైనా తేలిక విషయామా? అది అంత తేలిక విషయం కాదు. ఆ తత్వం అనుభవించిన వాడెవడుంటాడో వారి నోటివెంట వస్తుంది ఆమాట.

(సశేషం)

('గిని..అద్వైతగని' పుస్తకం నుంచి)






# దక్షిణామ్నాయ శృంగేరీ శ్రీశారదాపీఠ వైభవం

(గత సంచిక తరువాయి)

**మానవునికి ప్రధాన శత్రువులు జగద్గురు ఉపదేశామృతం**

పుణ్యాపాపాల గురించి చాలామందికి మంచి అవగాహనే ఉంది. పుణ్యాపాపాలు క్రమంగా సత్కర్మలు మరియు దుష్కర్మల ఫలితమని వారికి తెలుసు. మంచిచెడుల మధ్య తేడాను గ్రహించగలిగినా ఆశ్చర్యకరంగా మానవుడు పాపపు కర్మలలోనే నిమగ్నుడవుతాడు. ఒకసారి దుర్యోధనుని ఇలా ప్రశ్నించారు. "మీరు రారాజు. శాస్త్రాలను చదివారు ధర్మమంటే ఏమిటో తెలుసు. అయినా మీరు ఇలా ఎందుకు ప్రవర్తిస్తారు?" అందుకు దుర్యోధనుడు

**జానామి ధర్మం న చ మే ప్రవృత్తిః**

**జానామ్యధర్మం న చ మే నివృత్తిః**

"ధర్మమంటే ఏమిటో నాకు తెలుసు. అయినా నా మనస్సు దానివైపు మొగ్గటం లేదు. అధర్మమూ నాకు తెలుసు. కాని నా మనస్సు పాప కర్మల నాచరించడానికే ఇష్టపడుతోంది." అని సమాధానమివ్వడం ఆశ్చర్యకరమైన విషయం.

శ్రీకృష్ణ భగవానుని మాటలను వింటున్న అర్జునుడు "దేవా! నీవు బోధించే విషయం తెలుస్తున్నా మనిషి ప్రవర్తన చూస్తే వింతగా అనిపిస్తోంది" అని ప్రశ్నించాడు.

**అథ కేన ప్రయుక్తో యం పాపం చరతి పూరుషః ।**

**అనిచ్ఛన్నపి వార్ష్ణేయ బలాదివ నియోజితః ॥**

"మనిషికి తాను ఏమి చేస్తున్నాడో తెలిసి చేసినా ఎవరి బలవంతంమీదనో చేస్తున్నట్లు పాపపు పనులనే చేస్తుంటాడు. దానికి కారణమేమిటి?" దానికి శ్రీకృష్ణ భగవానుని సమాధానం ఇది.

కామ ఏష క్రోధ ఏష రజోగుణ సముద్భవః ।

మహాశనో మహాపాప్మా విద్ధ్యేనమిహ వైరిణమ్ ॥

కామము మరియు క్రోధ మనబడు రజోగుణం వలన జనిస్తవి. అవి ఎంతకూ తనియవు. మహా పాపిష్ఠమైనవి. అవే మనిషిని బలవంతంగా పాపానికి ప్రేరేపిస్తాయి.

పై అభిప్రాయం మనకు కొత్త కాదు. మనందరికీ సామాన్యంగా తెలిసినదే. అయితే మళ్ళీ మళ్ళీ మనం దానిని గురించి ఆచరణలోకి తీసుకురాలేకపోతున్నాం. కామం, క్రోధం అనేవి ప్రతి మనిషికీ బద్ధశత్రువులు. మనిషికి మొదట ఇష్టం లేకపోయినా పాపకార్యాలు చేసేటట్లు ఈ రెండూ బలవంత పరుస్తాయి. కామక్రోధాలను అదుపులో ఉంచుకున్నట్లయితే పాపం చేయాలనిపించదు.

ఒక వస్తువును తీవ్రంగా కోరుకోవడం కామమైతే, ఆ వస్తువు లభించకపోతే లేదా దానిని కోల్పోతే క్రోధం వస్తుంది.

క్రుద్ధో హన్యాద్గురూనపి

క్రోధంతో ఉన్నవాడు ఏమైనా చేస్తాడు. చివరికి తన గురువు గారిని హింసించడానికి కూడా వెనుకాడడు. శ్రీకృష్ణ భగవానుడు కామక్రోధాలను తొలగించుకోవలసిన అవసరం గురించి వివరించాడు. కామ క్రోధాల బంధువులే లోభ, మోహ, మద, మాత్సర్యాలు. కామం తన బంధువర్గంతో ఒక వ్యక్తిలో స్థిరపడితే అతను పూర్తిగా నాశనమవుతాడు. కామాన్ని దాని కారణంగా ఉద్భవించే ఇతర శత్రువులతో సహా సమూలంగా తొలగించడానికి మార్గమేమిటి? మన శాస్త్రాలు ఈ ప్రశ్నకు సమాధానం చెప్పాయి.



మాధవీయ శంకర విజయంలోని ఐదవ సర్గలో శ్రీ శంకర భగవత్పాదుల వారి బాల్యం వంద శ్లోకాలలో వర్ణించబడింది. వారి రూపం ఎలా ఉన్నదో, వారి ప్రవర్తన ఎలా ఉండేదో వారు ఎంతటి నిజాయితీపరులో మనం మాధవీయ శంకర విజయం నుండి గ్రహించవచ్చు. అందులో వారు అరిషడ్వర్గాలైన కామ క్రోధ మోహ లోభ మద మాత్సర్యాలను జయించారని చెప్ప బడింది. ఎలా జయించిందీ కూడా చెప్పబడింది. మనకు కూడా వాటిని జయించాలని ఉంటుంది. కానీ మార్గమే తెలియదు. ఆ మార్గాన్ని బోధిస్తే, కొందరైనా ప్రయత్నించి కామక్రోధాదుల నుంచి ముక్తిని పొందవచ్చు. కొంతమంది ఉపన్యాసాలు విన్నా, తమ మామూలు దారినే పోతుంటారు. మనం ఆ వర్గంలో చేరకూడదు.

కోరికను జయించడమెలా? భౌతికమైన వస్తువుల పట్ల నిర్లక్ష్యాన్ని పెంచుకోవాలి. "భౌతికమైన వస్తువులు ఆనంద దాయకం కానప్పుడు అవి మనకెందుకు? వాటి వలన ప్రయో జనం లేదు.'' అనెడి ఆలోచనను పెంచుకోవాలి. ఒక వస్తువు ఆకర్షణీయంగా అందంగా ఉన్నదనుకున్నప్పుడే మనం దానిని కోరుకుంటాం. మనం చూసిన వస్తువుల గురించి మన కళ్ళే మనకు తెలియజెపుతాయి. చక్షురింద్రియ స్వభావమది. మనం చాలా వస్తువులను చూస్తున్నా. అన్నిటినీ మనం కోరుకొనం. ఆనందాన్ని, సంతోషాన్ని అందించగలవని అనుకున్న వాటినే మనం కోరుకుంటాం. ఒకవేళ అన్ని వస్తువులు పనికిరానివే అని ఎవరైనా భావిస్తే, అతను కోరుకోవడానికి ఇంకేం ఉంటుంది? అందువలన కామాన్ని జయించాలంటే భౌతికమైన వస్తువులు ఆకర్షణీయమూ, ఆనందదాయికమూ కావనే ఆలోచనను పెంచుకోవాలి.

**అసారమేవ సంసారం దృష్ట్వా సారదిదృక్షయా ।**
**ప్రవ్రజన్త్యకృతోద్వాహాః పరం వైరాగ్యమాశ్రితాః ॥**

శంకరులు సన్యాసాన్ని ఎందుకు స్వీకరించారు?
అసారమేవ సంసారం దృష్ట్వా
ఇదీ కారణం.

ఏ వస్తువునైనా అనుభవిస్తే ఈ ప్రపంచంలో మనకు ఏమి దక్కుతుంది. అన్ని వస్తువులు అందంగా కనపడతాయి. కాని, వాటి స్వభావాన్ని విశ్లేషించి చూస్తే వానిలో సారమేమీ కనపడదు.

అంతేకాదు. వానిని మనం సంపాదించేదాకానే వాటి అందం, ఆ తరువాత వానిలో ఎటువంటి ఆకర్షణ ఉండదు. నిర్లక్ష్యం కనుక నిరంతరం ఉంటే ఏ వస్తువునూ పొందడానికి ప్రయత్నం చేయవలసిన పని ఉండదు. కోరికలను జయించడానికి ఇటువంటి మనః స్థితి అవసరం.

క్రోధాన్ని జయించడానికి మనం తితిక్షను సంపాదించు కోవాలి. అయితే తితిక్ష అంటే ఏమిటి?

**సహనం సర్వదుఃఖానామ ప్రతీకారపూర్వకమ్ ।**
**చిన్తావిలాపరహితం సా తితిక్షా నిగద్యతే ॥**

ఎంతటి బాధనైనా సంతోషంగా భరించడమే తితిక్ష. శంకర విజయంలో శ్రీ శంకరుల జీవితంలోని ఓర్పు యొక్క పరిధిని వివరించారు. ఉగ్రభైరవుడు శ్రీ శంకరులను కలిసి ఇలా ప్రార్థిం చాడు. "స్వామీ! నేనూ భైరవారాధకుడిని. ఒక చక్రవర్తినో లేదా ఒక మహామేధావి అయిన సన్యాసితో తనకు బలి ఇస్తే, నే కోరిన వరాన్ని ప్రసాదిస్తానని భైరవుడు అనుగ్రహించాడు. ఒక చక్రవర్తిని బలి ఇవ్వడానికి ప్రయత్నించడమంటే, నా ప్రాణమే పోగొట్టు కోవడం. అందువలన నేను దానిని సాధించలేను. మీరు సర్వజ్ఞ మూర్తియైన యతులని ప్రజలు చెప్పుకోవడం నేను విన్నాను. మీ దేహంపై మీకు వ్యామోహం లేదనీ, మీరు చాలా గొప్ప వేదాంతి అనీ నాకు తెలుసు. ఈ శరీరం ఎప్పుడో ఒకప్పుడు నశించేదే.

**వాసాంసి జీర్ణాని యథా విహాయ నవాని గృహ్ణాతి నరోపరాణి ।**
**తథా శరీరాణి... ॥**

"ఓ వ్యక్తి పాత వస్త్రాలను విడిచి నూతన వస్త్రాలను ధరించినట్లే ఆత్మ జీర్ణమైన దేహాన్ని వదిలి నూతన దేహాన్ని స్వీకరిస్తుందని మీరు బోధిస్తారు కదా! అందువలన నశ్వరమైన ఈ దేహంతో ఏమి సాధిస్తారు? మీ శిరస్సు లభిస్తే నాకు గొప్ప లాభం కలుగుతుంది. కాబట్టి దానిని పొందడానికి నాకు అనుమతిస్తారా?'' (సశేషం)

# ధర్మజిజ్ఞాస

(గత సంచిక తరువాయి)

ఇంటికి వెళ్లి బంగారు మొలత్రాడు ఇంతకుముందు తీసుకొన్న కొలత ప్రకారం తయారుచేసి తెచ్చాడు. కాని అది స్వామి నడుముకు సరిపోలేదు. దాంతో మళ్లీ వెళ్లి కళ్లు మూసుకొని కొలత తీసుకున్నాడు. అప్పుడూ అలాగే జరిగింది. కళ్లు మూసుకొని ఎన్నిసార్లు కొలత తీసుకున్నా మొలత్రాడు కుదరలేదు. తాను చేస్తున్న తప్పు గ్రహించాడు స్వర్ణకారుడు. తన అజ్ఞాన్ని గ్రహించి శివకేశవులకు భేదం పాటించడం తప్పని తెలుసుకొని స్వామికి శరణాగతుడై మొలత్రాడు కొలతను గ్రహిస్తే అప్పుడు సరిపోతుంది.

2. ఘంటాకర్ణుని కథ : కాశీ పట్టణంలో ఘంటాకర్ణుడనే శివభక్తుడుండేవాడు. ఈయన శివుని నామోచ్చారణ తప్ప ఎన్నడూ ఇతర దేవతల నామాలు ఉచ్చరించలేదు. అన్యదేవతల నామం చెవిలో పడుతుందని చెవులకు గంటలు ధరించాడు. అందుకే ఇతనికి ఘంటాకర్ణుడనే పేరొచ్చింది. ఒకరోజు శివపూజ చేస్తున్నాడు. శివుడు భక్తుణ్ణి పరీక్షిద్దామని - 'సగం విష్ణువుగా సగం శివునిగా లింగస్వరూపం మారిపోయింది' - వంఎటనే ఘంటాకర్ణుడు విష్ణువు ముక్కులో వ్రేలు పెట్టాడు. తాను వేసిన ధూపం విష్ణువు గ్రహించకూడదని అతని ఉద్దేశం. వెంటనే ఆ మిగిలిన శివరూపం కూడా విష్ణువుగా మారిపోయింది. తనకూ విష్ణువుకూ భేదం పాటించినవాడు రౌరవాదినరకం పొందుతాడని చెప్పాడు. భక్తుడు ఆనాటి నుండి సత్యం గ్రహించి శివ విష్ణువులకు భక్తుడుగా మారిపోయాడు.

3. ప్రతాపరుద్రుడు చేయించిన విగ్రహం కథ : కాకతీయ రాజులు శైవులనే విషయం చరిత్ర తెలిసిన వారికంతా తెలుసు. ప్రతాపరుద్రుడు ఒకసారి అహోబిలక్షేత్ర దర్శనానికి వచ్చాడు. ప్రస్తుతం ఉన్న 'రుద్రవరం' అనే గ్రామం ఆయన విడిదిచేసిన చోటనే ఏర్పాటైంది. అహోబిలక్షేత్రంలో తన గుర్తుగా ఒక నృసింహ స్వర్ణవిగ్రహం పెట్టాలని నిశ్చయించుకొని తయారు చేయించాడు. కాని తయారుచేసిన వెంటనే ఆ విగ్రహం 'శివ విగ్రహం'గా మారిపోయింది. ఇలా ఎన్నిసార్లు తయారు చేసినా శివవిగ్రహంగా మారడంతో శివునికి నమస్కరించి తయారుచేయగానే నృసింహ విగ్రహంగా రూపొందింది. ప్రస్తుతం అహోబిల పీఠాధిపతులు పూజించే విగ్రహం అదే అని పెద్దలంటారు.

**షోడశోపచార పూజలు చేయడం అందరికీ సాధ్యం కాదు కదా! పంచోపచార పూజ ఎలా చేయాలో చెప్పండి.**

షోడశోపచారాల్లో ఉన్న వాటినే ఐదింటిని గ్రహించి పంచోపచార పూజ ఎలా చేయాలో మూడు విధాలుగా చెప్పడం జరిగింది.



పి. భాస్కరయోగి

మొదటి పద్ధతి : 1. దేవునికి గంధం సమర్పించడం (ధరింపజేయడం) 2. పుష్పం సమర్పించడం 3. దీపారాధాన చేయడం 4. ధూపాన్ని సమర్పించడం 5. చివరిగా నైవేద్యం సమర్పించడం.

రెండవ పద్ధతి : 1. దేవుణ్ణి మనసారా ధ్యానించడం 2. ధ్యానించిన దేవుణ్ణి ఆవాహన చెయ్యడం 3. ఆవాహన చేసిన దేవునికి నైవేద్యం సమర్పించడం 4. ఆ తరువాత నీరాజనం (మంగళహారతి) సమర్పించడం 5. ఆయనకు నమస్కారం సమర్పించడం.

మూడవ పద్ధతి : 1. దేవునికి నీళ్లతో స్నానం చేయించడం (అర్ఘ్యం, పాద్యం రెండూ ఇందులో ఉన్నాయి.) 2. భక్తితో పూజించడం 3. నైవేద్యం సమర్పిం చడం 4. ప్రదక్షిణం చెయ్యడం 5. నమస్కారం చేయడం.

ఈ విధంగా మూడు విధాలా పంచోపచార పూజలు చెప్పారు. అందులో ఏ పద్ధతిలోనైనా రోజూ పూజ చేసుకోవచ్చు.

**సప్త వ్యసనాలు అంటుంటారు కదా! అవి ఏమిటో వివరించండి?**

"వెలది జూదంబు పానంబు వేట పలుకు
ప్రల్లదంబును దండంబుబరునదనము
సొమ్ము నిష్ప్రయోజనముగ వమ్ముసేత
యనెడు సప్తవ్యసనముల జనదు తగుల"

(మహాభారతం 5-2-44)

స్త్రీ, జూదం, తాగడం, వేట, వాక్పారుష్యం, దండపారుష్యం, డబ్బు వృథా చేయడం - ఈ ఏడు సప్తవ్యసనాలు. ఇవి ఎంత ఉన్నతస్థాయి వ్యక్తినైనా బజార్లో పడేస్తాయి. ఇతరుల స్త్రీని ఆశించి రావణాసురుడు తన వంశాన్నే నాశనం చేసుకున్నాడు. జూదవ్యవసనం వల్ల రాక్షసగురువు శుక్రుడు తన జాతి కొరకు నేర్చుకొన్న విద్య ఇతరులకు చెప్పాల్సి వచ్చింది. దశరథుడు వేటకు వెళ్లి మాతృపితృ సేవకుడైన బాలుణ్ణి చంపి వృద్ధ దంపతుల శాపానికి గురయ్యాడు. పరుషవాక్యాలు మాట్లాడిన దుర్యోధన, దుశ్శాసనులు ఘోరమైన చావు చచ్చారు. దుర్యోధనుడు శకుని సోదరులను అకారణంగా కఠిన దండనకు గురిచేసి, తర్వాత శకుని సలహాల వల్లనే వంశనాశనం చేసుకొన్నాడు. వృథాగా ధనం ఖర్చు చేసి నాశనమైన వాళ్లు ఎందరో ఉన్నారు. ఇవి సజ్జనులైన వాళ్లకు కూడవని మన శాస్త్రాల్లో ఉంది. (సశేషం)

# దర్శనమ్
ఆధ్యాత్మిక వార్తామాసపత్రిక

బ్ర॥శ్రీ దివ్యజ్ఞాన సిద్ధాంతి గారు, పుత్రులు బ్ర॥శ్రీ గౌరీభట్ల రామకృష్ణశర్మ సిద్ధాంతి, శ్రీ సిద్ధకుంజికా పీఠము
శ్రీ మహాకాల మందిరము, విశ్వం విహార్, మేడిపల్లి (ఔదుంబరపురి), బోడుప్పల్ బస్‌డిపో, హైదరాబాద్, ఫోన్ : 94403 50868, 8008513203

శ్రీ పరాభవ సం ॥ ఉత్తరాయణం
గ్రీష్మఋతువు
అధికజ్యేష్ఠ బ.పాడ్యమి – నిజజ్యేష్ఠబ.పాడ్యమి

## జూన్ JUNE 2026

ఉ: ఉదయం, మ: మధ్యాహ్నం, సా: సాయంత్రం, రా: రాత్రి, తె: తెల్లవారుఝామున, వ: వర్జ్యము, శే.వ.: శేషవర్జ్యము, ల: నుండి

| | | | | | |
|---|---|---|---|---|---|
| **S U N ఆది**<br>రాహు కాలం సా. 4.30 మొ 6.00<br>యమగండ కాలం మ. 12.00 మొ 1.30<br>వారదుర్ముహూర్తం సా. 4.24 మొ 5.12 | | **7**<br>సప్తమి రా.10.09<br>శతభిషం రా.తె.4.43<br>వ.ఉ.11.21ల1.00 | **14**<br>చతుర్దశి ఉ.11.34<br>రోహిణి రా.10.40<br>వ.ఉ.7.22ల10.27<br>తి.రా.3.48ల5.17 | **21**<br>సప్తమి రా.7.51<br>పుబ్బ మ.2.27<br>వ.రా.9.42ల11.19 | **28**<br>చతుర్దశి రా.2.11<br>జ్యేష్ఠ రా.1.02<br>వ.రా.11.02ల12.38 |
| **M O N సోమ**<br>రాహు కాలం ఉ. 7.30 మొ 9.00<br>యమగండ కాలం ఉ. 10.30 మొ 12.00<br>వారదుర్ముహూర్తం మ. 12.24 మొ 1.12<br>మ. 2.48 మొ 3.36 | **1**<br>బ.పాడ్యమి మ.2.38<br>జ్యేష్ఠ సా.5.43<br>వర్జ్యంలేదు | **8**<br>అష్టమి రా.9.47<br>పూర్వాభాద్రరా.తె.4.57<br>వ.ఉ.11.16ల12.53 | **15** ●<br>అమావాస్య ఉ.9.08<br>మృగశిర రా.8.57<br>వ.రా.తె.4.47ల | **22**<br>అష్టమి రా.7.24<br>ఉత్తర మ.2.38<br>వ.రా.11.15ల12.54 | **29** ○<br>పూర్ణిమ రా.తె.4.12<br>మూల రా.3.41<br>వ.రా.1.49ల3.41 |
| **T U E మంగ**<br>రాహు కాలం మ. 3.00 మొ 4.30<br>యమగండ కాలం ఉ. 9.00 మొ 10.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>రా. 10.48 మొ 11.36 | **2**<br>విదియ సా.4.40<br>మూల రా.8.20<br>వ.సా.6.28ల8.20 | **9**<br>నవమి రా.8.57<br>ఉత్తరాభాద్రరా.తె.4.44<br>వ.మ.2.38ల4.03 | **16**<br>శుద్ధపాడ్యమిఉ.6.37<br>త.విదియరా.తె.4.10<br>ఆరుద్ర రా.7.20<br>శే.వ.ఉ. 6.17 | **23**<br>నవమి రా.7.26<br>హస్త మ.3.16<br>వ.రా.11.33ల1.13 | **30**<br>బహుళపాడ్యమిపూర్తి<br>పూర్వాషాఢ పూర్తి<br>వ.మ.2.18ల4.04 |
| **W E D బుధ**<br>రాహు కాలం మ. 12.00 మొ 1.30<br>యమగండ కాలం ఉ. 7.30 మొ 9.00<br>వారదుర్ముహూర్తం ఉ. 11.36 మొ 12.24 | **3**<br>తదియ సా.6.32<br>పూర్వాషాఢరా.10.48<br>వ.ఉ.6.55ల8.41 | **10**<br>దశమి రా.7.41<br>రేవతి రా.తె.4.05<br>వ.సా.4.25ల5.58 | **17**<br>తదియ రా.1.57<br>పునర్వసు సా.5.50<br>వ.ఉ.6.35ల8.05<br>తి.రా.1.19 ల2.50 | **24**<br>దశమి రా.7.56<br>చిత్త సా.4.23<br>వ.రా.10.17ల11.59 | |
| **T H U గురు**<br>రాహు కాలం మ. 1.30 మొ 3.00<br>యమగండ కాలం ఉ. 6.00 మొ 7.30<br>వారదుర్ముహూర్తం ఉ. 10.00 మొ 10.48<br>మ. 2.48 మొ 3.36 | **4**<br>చవితి రా.8.06<br>ఉత్తరాషాఢరా.12.56<br>వ.రా.11.30ల1.05<br>తి.రా.తె.5.18ల | **11**<br>ఏకాదశి సా.6.04<br>అశ్విని రా.3.06<br>వ.రా.11.11ల12.43 | **18**<br>చవితి రా.11.54<br>పుష్యమి సా.4.31<br>వ.రా.తె.4.41ల | **25**<br>ఏకాదశి రా.8.58<br>స్వాతి సా.6.00<br>వ.రా.11.59ల1.43 | |
| **F R I శుక్ర**<br>రాహు కాలం ఉ. 10.30 మొ 12.00<br>యమగండ కాలం మ. 3.00 మొ 4.30<br>వారదుర్ముహూర్తం ఉ. 8.24 మొ 9.12<br>మ. 12.24 మొ 1.12 | **5**<br>పంచమి రా.9.16<br>శ్రవణం రా.2.40<br>శే.వ.ఉ.7.01 | **12**<br>ద్వాదశి సా.4.06<br>భరణి రా.1.47<br>వ.మ.12.10ల1.41 | **19**<br>పంచమి రా.10.11<br>ఆశ్లేష మ.3.28<br>శే.వ.ఉ.6.13<br>తి.రా.3.06ల4.39 | **26**<br>ద్వాదశి రా.10.24<br>విశాఖ రా.8.03<br>వ.రా.12.33ల2.18 | |
| **S A T శని**<br>రాహు కాలం ఉ. 9.00 మొ 10.30<br>యమగండ కాలం మ. 1.30 మొ 3.00<br>వారదుర్ముహూర్తం ఉ. 6.00 మొ 7.36 | **6**<br>షష్ఠి రా.9.56<br>ధనిష్ఠ రా.3.55<br>వ.ఉ.6.58ల8.39 | **13**<br>త్రయోదశి మ.1.57<br>కృత్తిక రా.12.19<br>వ.మ.1.03ల2.33 | **20**<br>షష్ఠి రా.8.47<br>మఖ మ.2.44<br>వ.రా.10.34ల12.09 | **27**<br>త్రయోదశిరా.12.12<br>అనూరాధ రా.10.26<br>వర్జ్యంలేదు | |

| తేది | సూ.ఉ. | సూ.అ. |
|---|---|---|
| 1 | 5.41 | 6.46 |
| 5 | 5.41 | 6.46 |
| 10 | 5.41 | 6.51 |
| 15 | 5.42 | 6.52 |
| 20 | 5.43 | 6.53 |
| 25 | 5.44 | 6.54 |
| 30 | 5.45 | 6.54 |

### పండుగలు

2 తెలంగాణరాష్ట్ర అవతరణము
3 సంకష్టహరచతుర్థి
8 మృగశిరకార్తి
11 సర్వేషాంఏకాదశి
13 శనిత్రయోదశి, మాసశివరాత్రి
15 మిథునసంక్రమణం
16 బౌద్ధ,కల్కిజయంతి
22 ఆరుద్రకార్తి
24 గాయత్రీజయంతి
25 సర్వేషాం ఏకాదశి
26 మొహర్రం
27 శనిత్రయోదశి
29 ఏరువాకపూర్ణిమ వటసావిత్రీవ్రతం

### మీ కోసం...

1. ........
2. ........
3. ........
4. ........
5. ........
6. ........
7. ........
8. ........
9. ........
10. ........
11. ........
12. ........
13. ........
14. ........
15. ........
16. ........
17. ........
18. ........
19. ........
20. ........
21. ........
22. ........
23. ........
24. ........
25. ........
26. ........
27. ........
28. ........
29. ........
30. ........

# లలితా సహస్రనామ స్తోత్రం



ఆచార్య కుప్పా విజయశ్రీ

(గత సంచిక తరువాయి)

ఓం అస్య శ్రీ లలితా సహస్రనామ స్తోత్ర మహామంత్రస్య - వశిన్యాది వాగ్దేవతా ఋషయః - అనుష్టుప్ ఛందః - శ్రీ లలితా పరాభట్టారికా దేవతా - శ్రీ మద్వగ్భావ కూటేతి బీజం - మధ్య కూటేతి శక్తిః - శక్తి కూటేతి కీలకం - మూలప్రకృతిరితి ధ్యానం - మమ శ్రీ లలితా త్రిపురసుందరీ ప్రసాద సిద్ధ్యర్థే జపే వినియోగః

**ధ్యానం**

సిందూరారుణ విగ్రహం - త్రినయనాం - మాణిక్యమౌళిస్ఫుర
త్తారానాయక శేఖరాం - స్మితముఖీం - ఆపీనవక్షోరుహం
పాణిభ్యాం - అళి పూర్ణ రత్న చషకం - రక్తోత్పలం బిభ్రతీం
సౌమ్యాం - రత్న ఘటస్థ రక్త చరణాం - ధ్యాయేత్పరాం - అంబికామ్॥

అరుణాం - కరుణాతరంగితాక్షీం
ధృత పాశాంకుశ పుష్పబాణ చాపాం
అణిమాదిభిరావృతాం - మయూఖై
రహమిత్యేవ విభావయే - భవానీం ॥

ధ్యాయేత్ - పద్మాసనస్థాం - వికసితవదనాం - పద్మపత్రాయతాక్షీం
హేమాభాం - పీతవస్త్రాం - కరకలిత లసద్ధేమ పద్మాం- వరాంగీం
సర్వాలంకార యుక్తాం- సతతమభయదాం - భక్తనమ్రాం భవానీం
శ్రీ విద్యాం- శాంతమూర్తిం-సకలసురనుతాం సర్వసంపత్ప్రదాత్రీమ్ ॥

సకుంకుమ విలేపనాం - అళిక చుంబి కస్తూరికాం
సమంద హసితేక్షణాం - సశర చాప పాశాంకుశాం
అశేష జన మోహినీం - అరుణ మాల్యా భూషాంబరామ్
జపాకుసుమ భాసురాం - జపవిధౌ - స్మరేత్ - అంబికాం ॥

ఓం ఐం హ్రీం శ్రీం శ్రీమాత్రే నమః
శ్రీమాతా - శ్రీమహారాజ్ఞీ - శ్రీమత్సింహాసనేశ్వరీ
చిదగ్ని కుండ సంభూతా - దేవకార్య సముద్యతా 1
ఉద్యద్భాను సహస్రాభా - చతుర్బాహు సమన్వితా
రాగస్వరూప పాశాఢ్యా - క్రోధాకారాంకుశోజ్జ్వలా 2
మనోరూపేక్షు కోదండా - పంచతన్మాత్ర సాయకా
నిజారుణ ప్రభాపూర మజ్జద్ బ్రహ్మాండ మండలా 3
చంపకాశోక పున్నాగ సౌగంధిక లసత్కచా
కురువింద మణిశ్రేణీ కనత్కోటీర మండితా 4
అష్టమీ చంద్ర విభ్రాజ దళిక స్థల శోభితా
ముఖచంద్ర కళంకాభ మృగనాభి విశేషకా 5
వదనస్మర మాంగళ్య గృహ తోరణ చిల్లికా
వక్త్ర లక్ష్మీ పరీవాహ చలన్మీనాభలోచనా 6
నవచంపక పుష్పాభ నాసాదండ విరాజితా
తారాకాంతి తిరస్కారి నాసాభరణభాసురా 7
కదంబమంజరీ క్లుప్త కర్ణపూర మనోహరా
తాటంక యుగళీభూత తపనోడుప మండలా 8
పద్మరాగ శిలాదర్శ పరిభావి కపోలభూః
నవవిద్రుమ బింబ శ్రీన్యక్కారి రదనచ్ఛదా 9
శుద్ధవిద్యాంకురాకార ద్విజపంక్తి ద్వయోజ్జ్వలా
కర్పూరవీటికామోద సమాకర్ష ద్దిగంతరా 10
నిజసల్లాపమాధుర్య వినిర్భర్త్సిత కచ్ఛపీ
మందస్మిత ప్రభాపూర మజ్జత్కామేశ మనసా 11
అనాకలిత సాదృశ్య చుబుక శ్రీ విరాజితా
కామేశ బద్ధ మాంగల్య సూత్ర శోభిత కంధరా 12
కనకాంగద కేయూర కమనీయ భుజాన్వితా
రత్న గ్రైవేయ చింతాక లోలముక్తా ఫలాన్వితా 13
కామేశ్వర ప్రేమరత్న మణి ప్రతిపణ స్తనీ
నాభ్యాలవాల రోమాళి లతాఫల కుచద్వయీ 14
లక్ష్య రోమలతాధారతా సమున్నేయ మధ్యమా
స్తనభార దళన్మధ్య పట్టబంధ వళి త్రయా 15
అరుణారుణ కౌసుంభ వస్త్ర భాస్వత్కటీ తటీ
రత్న కింకిణికా రమ్య రశనా దామ భూషితా 16
కామేశ జ్ఞాత సౌభాగ్య మార్దవోరు ద్వయాన్వితా
మాణిక్య ముకుటాకార జానుద్వయ విరాజితా 17
ఇంద్రగోప పరిక్షిప్త స్మర తూణాభ జంఘికా
గూఢగుల్ఫా - కూర్మపృష్ఠ జయిష్ణు ప్రపదాన్వితా 18
నఖదీధితి సంఛన్న నమజ్జన తమోగుణా
పదద్వయ ప్రభాజాల పరాకృత సరోరుహా 19
శింజాన మణిమంజీర మండిత శ్రీ పదాంబుజా
మరాళీ మందగమనా - మహాలావణ్య శేవధిః 20
సర్వారుణానవద్యాంగీ - సర్వాభరణ భూషితా

శివ కామేశ్వరాంకస్థా - శివా - స్వాధీనవల్లభా 21
సుమేరు మధ్య శృంగస్థా - శ్రీమన్నగర నాయికా
చింతామణి గృహాంతస్థా - పంచబ్రహ్మాసన స్థితా 22
మహా పద్మాటవీసంస్థా - కదంబవనవాసినీ
సుధాసాగర మధ్యస్థా - కామాక్షీ - కామదాయినీ 23
దేవర్షి గణ సంఘాత స్తూయమానాత్మ వైభవా
భండాసుర వధోద్యుక్త శక్తి సేనా సమన్వితా 24
సంపత్కరీ సమారూఢ సింధుర వ్రజ సేవితా
అశ్వారూఢాధిష్ఠితాశ్వ కోటికోటిభిరావృతా 25
చక్రరాజ రథారూఢ సర్వాయుధ పరిష్కృతా
గేయచక్ర రథారూఢ మంత్రిణీ పరిసేవితా 26
కిరిచక్ర రథారూఢ దండనాథా పురస్కృతా
జ్వాలామాలినికాక్షిప్త వహ్ని ప్రాకార మధ్యగా 27
భండాసైన్య వధోద్యుక్త శక్తి విక్రమ హర్షితా
నిత్యా పరాక్రమాటోప నిరీక్షణ సముత్సుకా 28
భండపుత్ర వధోద్యుక్త బాలా విక్రమ నందితా
మంత్రిణ్యంబా విరచిత విషంగవధ తోషితా 29
విశుక్ర ప్రాణహరణ వారాహీ వీర్య నందితా

కామేశ్వర ముఖాలోక కల్పిత శ్రీగణేశ్వరా 30
మహాగణేశ నిర్భిన్న విఘ్నయంత్ర ప్రహర్షితా
భండాసురేంద్ర నిర్ముక్త శస్త్రప్రత్యస్త్ర వర్షిణీ 31
కరాంగుళి నఖోత్పన్న నారాయణ దశాకృతిః
మహాపాశుపతాస్త్రాగ్ని నిర్దగ్ధాసుర సైనికా 32
కామేశ్వరాస్త్ర నిర్దగ్ధ సభండాసుర శూన్యకా
బ్రహ్మోపేంద్ర మహేంద్రాది దేవ సంస్తుత వైభవా 33
హరనేత్రాగ్ని సందగ్ధ కామసంజీవ నౌషధి:
శ్రీమద్వాగ్భవ కూటైక స్వరూప ముఖపంకజా 34
కంఠాధః కటిపర్యంత మధ్యకూట స్వరూపిణీ
శక్తికూటైకతాపన్న కట్యధో భాగధారిణీ 35
మూల మంత్రాత్మికా - మూలకూటత్రయ కళేబరా
కులామృతైక రసికా - కులసంకేత పాలినీ 36
కులాంగనా - కులాంతస్థా - కౌలినీ - కులయోగినీ
అకులా - సమయాంతస్థా - సమయాచార తత్పరా 37
మూలాధారైక నిలయా - బ్రహ్మగ్రంథివిభేదినీ
మణిపూరాంతరుదితా - విష్ణుగ్రంథివిభేదినీ 38

(సశేషం)


అద్భుతమైన స్తోత్ర సంపద, ఇప్పుడు మీకు అందుబాటులో ఈ వెబ్‌సైట్ లో !!

stotranidhi.com
తెలుగు | ಕನ್ನಡ | தமிழ் | देवनागरी | english

www.stotranidhi.com




★ దేవ, ఋషి ప్రోక్త స్తోత్రములు
★ మహా మహిమాన్వితమైన స్తోత్రములు
★ అరుదుగా లభించే విశేష స్తుతులు
★ పూజా విధానములు, వ్రతములు
★ అష్టోత్తరములు, సహస్రనామములు
★ స్వరసహిత వేద సూక్తములు
★ సంధ్యావందనం, సుందరకాండ
★ శ్రీమద్భగవద్గీత, దుర్గా సప్తశతీ
★ కీర్తనలు, మంగళ హారతులు
★ ... ఇంకా ఎన్నెన్నో !!

Scan this QR code to visit website

పూజా కార్యక్రమాలలో, పండుగ రోజులలో, ఆలయాలలో మరియు మీ దైవకార్యాలలో పఠించండి, తరించండి !!

Email: stotranidhi@gmail.com /stotranidhi Download on the App Store GET IT ON Google Play

# ధృతరాష్ట్రుడు శతయూపుడి ఆశ్రమం చేరుట

**హస్తినాపురంలో పాండవులు తల్లిని, గాంధారీ ధృతరాష్ట్రులను తలచుకుంటూ దుఃఖిస్తున్నారు. విదురుడిని, సంజయుని తలచుకొంటూ, పాండవులు తమకు ఇష్టమైన సుఖాలు విడిచిపెట్టారు. మనస్సు ఆగక ముసలివాడు, కొడుకులను పోగొట్టుకున్న ధృతరాష్ట్రుడు మొదలగువారిని చూడడానికి పూనుకున్నారు.**



డా. ఎమ్వీఎస్ సత్యనారాయణ

ఆ సమయంలో సహదేవుడు "అగ్రజా! ధర్మరాజా! కుంతి ప్రాణాలతో ఉన్నప్పుడే మనం అంతా ఒకసారి అడవికి వెళ్ళి ఆ మహాత్మురాలిని చూడడం ధర్మం. ఆమె. అక్కబావలకు (గాంధారీ ధృతరాష్ట్రులకు) సేవలు చేస్తూ ఎట్లా ఉన్నదో? అలాగే గాంధారీ ధృతరాష్ట్రులు చాల సుకుమారులు. నారబట్టలూ, మృగచర్మాలు ధరించి, వ్రతాలు ఆచరిస్తూ కాయలు దుంపలు తింటూ నలిగిపోతున్న వారికి ఇంకా కష్టదశ రాకుండా చూడడం తక్షణ కర్తవ్యం. ద్రౌపది మొదలగువారు అడవికి వెళ్ళి వారందరినీ చూడడానికి సిద్ధంగా ఉన్నారు" అన్నాడు. ఆ మాటలు విన్న ధర్మరాజు వెంటనే సేనాపతులను పిలిపించి "అరణ్య గమనానికి అన్నివిధాలా సిద్ధం చెయ్యండి" అని ఆజ్ఞాపించాడు. ఆ సేనాపతులు ఆ ప్రకారమే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. మరునాడు ధర్మరాజు యుయుత్సుడిని, కృపాచార్యుడిని, ధౌమ్యుడిని పిలిచి తాము లేని సమయంలో నగర రక్షణ బాధ్యతను అప్పగించాడు. భీమార్జున నకులసహదేవులు అన్నగారు ఆజ్ఞాపించినట్లుగా గజరథతురగ పదాతి బలాలతో పల్లకీలు, గుడారాలు, ఎడ్లబండ్లు వెంటరాగా వాద్యాల ధ్వనులతో వైభవంగా బయలుదేరారు. పౌరులు కూడా రకరకాల వాహనాలెక్కి ధర్మరాజు వెంట నడిచారు.

ఆవిధంగా బయలుదేరిన ధర్మరాజు యతిశ్రేష్ఠుడైన శతయూపుడి ఆశ్రమానికి సమీపంగా అరటితోపులతో మనోజ్ఞమైనది, వివిధ మృగాలతో నిండినదీ అయివున్న ధృతరాష్ట్రుడి ఆశ్రమం దగ్గర రథం దిగాడు. అప్పుడే యమునలో స్నానం చేసి, నీళ్ళూ పూలు తెచ్చుకోవడానికి ధృతరాష్ట్రుడు వెళ్ళాడు. వెంటనే ఆయనను చూడాలని ధర్మరాజు, వెనక పరివారం యమునకు వెడుతుండగా, ధృతరాష్ట్రుడు గాంధారీ కుంతీ యమున నుండి తిరిగి వస్తూ ఎదురుపడ్డారు. అనుచరులు తమ రాకను తెలియజేస్తూండగా పాండవులందరూ కుంతికి, గాంధారీ ధృతరాష్ట్రులను దర్శించుకున్నారు. తల్లి పాదాలపై పడి తలలు వంచి నమస్కరించారు. కుంతీదేవి ఆ కుమారులందరినీ పొదివి పట్టుకొని, మనసు వాత్సల్యంతో నిండి కన్నీటి బిందువులు జారిపడుతుండగా గట్టిగా కౌగిలించుకొని, ప్రేమగా ఆశీర్వదించింది. ఆ సమయంలో సంజయుడు పాండువులను వాత్సల్యంతో చూశాడు. పాండవులు సంజయుడిని ప్రేమగా సమ్మానించారు. అప్పుడు ద్రౌపది మొదలైన పాండవ స్త్రీలు, ఇంకా మిగిలిన భరత వంశపు రాజుల భార్యలు గాంధారీ ధృతరాష్ట్రులనూ కుంతిని చూచి నమస్కరించారు. ఆ ముగ్గురూ పట్టుకొని వస్తున్న నీటి పాత్రలను పాండుకుమారులు అందుకుని తాము తీసికొని వచ్చారు. వచ్చిన పౌరులందరూ ధృతరాష్ట్రాదులకు నమస్కరించగా, అందరూ ఆనందంలో మునిగిపోయారు. తన వారంతా తన చుట్టూ ఉండడంతో ధృతరాష్ట్రుడు తాను హస్తినాపురంలో ఉన్నట్లుగా భావించి, ఆనందించాడు.

ఎంతో ఉత్సాహంగా తన ఆశ్రమానికి వెళ్ళాడు ధృతరాష్ట్రుడు. పాండవులు వచ్చారన్న విషయం తెలుసుకుని, ఆ చుట్టుపక్కల ఉన్న తపస్వులు అక్కడకు వచ్చారు. వచ్చిన వారందరికీ పాండవులు వినయంలో నమస్కరించారు. వారిని సంతోషపెట్టారు. ఆ పాండవులు ధృతరాష్ట్రుడి చుట్టూ కూర్చున్నారు. ద్రౌపది మొదలగు స్త్రీలంతా ఒక పక్క నిలబడ్డారు. ఉచితమైన ఆసనాల మీద కూర్చొన్న ఆ మునులు సంజయుడిని చూచి, అక్కడ ఉన్న వారందరినీ పేరుపేరునా మాకు తెలియజెప్పమని అడిగారు. అలా అడిగిన మునులతో సంజయుడు ఇలా చెప్పాడు.

"మహనీయులారా! పసిమి రంగు కలిగి సన్నని శరీరం, తగినంత ఎత్తూ పొడుగూ కలిగిన ముక్కు, పెద్ద పెద్ద కన్నులు కలిగినవాడు ధర్మరాజు. ఎరుపురంగు శరీరం, ఎత్తైన భుజాలు, విశాలమైన వక్షస్థలం కలిగివున్న ఆతడు భీముడు. అందమైన నల్లని శరీరం, తామరల వంటి కన్నులు, గజేంద్రుడి వంటి తీరూ కలిగిన ఆతడు అర్జునుడు. అందమైన రూపంతో తమకు సాటి వచ్చేవారు లేరంటూ విష్ణువు, ఇంద్రులను పోలి, అణకువే అలంకారంగా కలిగి కుంతికి ఇరువైపులా కూర్చొన్నవారు నకుల

సహదేవులు.

మునులారా! నల్లకలువల వంటి శరీరపు రంగు, తామరపువ్వు రేకులా ప్రకాశిస్తున్న కళ్లు, మనోహరమైన ఆకారంతో ఉన్న ఈమె ద్రౌపది. ఆమె పక్కన ఎర్రని శరీర రంగు కలిగి, పద్మముఖియైన ఆమె శ్రీకృష్ణుని చెల్లెలు- అర్జునుడి భార్యయైన సుభద్ర. ఆమె ప్రక్కన ప్రకాశిస్తున్న శరీరచ్ఛాయ కలిగినవారు ఉలూపి, చిత్రాంగదలు అర్జునుడి భార్యలు. ఆ ప్రక్కన కూర్చున్న (శ్రీకృష్ణుడితో ఎప్పుడూ విరోధించే) రాజచమూపతి సోదరి భీముడి భార్య. ఆమె పక్కన సంపెంగపూల దండవలె పసుపురంగు శరీరం కలిగిన జరాసంధుడి కూతురు, సహదేవుడి భార్య. అప్పుడే విచ్చుకొన్న నల్లకలువలతో సమానమైన రంగు గల శరీరంతో ప్రకాశిస్తున్న ఈ పద్మదళనేత్రి నకులుడి భార్య. ఈ కుంతీదేవి కోడళ్ల పక్కన ముత్తయిదువ లక్షణలైన సీమంతాలు లేకుండా, ఉతికిన తెల్లని గుడ్డలు ధరించి, శరీరం దాచుకుంటూ ఉన్న స్త్రీలు ధృతరాష్ట్రుడి కోడళ్లు. ధృతరాష్ట్రుడి కోడళ్లవలె భర్త లేని లక్షణాలతో కూడిన స్త్రీ అభిమన్యుడి భార్య ఉత్తర.''

ఈ విధంగా సంజయుడు పాండవులను, ధృతరాష్ట్రుడి బంధువులను, ఆ తపసులకు వివరించి చెప్పాడు. అప్పుడు ధృతరాష్ట్రుడు ధర్మరాజుతో ఇలా అన్నాడు. (సశేషం)

# దేవాలయ విముక్తి కోసం మళ్లీ ప్రారంభం కానున్న సుప్రీంకోర్టు విచారణ

హిందూ ధర్మానికి ప్రాణం దేవాలయాలేనని భారతదేశాన్ని పాలించిన బ్రిటిష్ పాలకులు గ్రహించారు. అందుకే 'సుశాసనం' పేరుతో దేవాలయాల నిర్వహణను ప్రభుత్వ ఆధీనంలోకి తీసుకున్నారు. క్రమంగా దేవాలయాలు కేవలం వ్యక్తిగత పూజా స్థలాలుగా మారిపోయాయి. దీని వల్ల హిందూ ధర్మం బలహీన పడుతోందని భావన ఏర్పడింది.

ప్రభుత్వం గురుద్వారాలు, చర్చిలు, మసీదులు, జైన స్థలాలు, బౌద్ధ విహారాలను నిర్వహించదు. భారత రాజ్యాంగం ప్రకారం దేశ పాలన ధర్మనిరపేక్షతను పాటిస్తుంది. అయినప్ప టికీ అనేక రాష్ట్ర ప్రభుత్వాలు హిందూ దేవాలయాలపై మాత్రమే నియంత్రణ కొనసాగించడం ఎందుకు అనే ప్రశ్న తలెత్తుతోంది. దేవాలయాల హుండీ ఆదాయంలో పెద్ద భాగం ప్రభుత్వ ఖజానాకు వెళ్తోంది. ప్రభుత్వ అధికారులు కార్యనిర్వాహక అధి కారులుగా నియమితులై, వారి జీతభత్యాలు కూడా దేవాలయ ఆదాయంతోనే చెల్లించబడుతున్నాయి. దేవాలయాలు, మఠాల నియంత్రణ మఠాధిపతులు లేదా ధార్మిక పీఠాధిపతుల చేతుల్లో కాకుండా అధికార యంత్రాంగం చేతుల్లోకి వెళ్లిపోయింది. హిందూ సమాజం తమ దేవాలయాల నియంత్రణను తిరిగి స్వాధీనం చేసుకోవాలని నిర్ణయించుకుంది. అలాగే దేవాల యాల ఆదాయం హిందూ సమాజ అభివృద్ధికే వినియోగిం చాలనే అభిప్రాయం వ్యక్తమైంది.

ఈ లక్ష్యంతో పూజ్య స్వామి దయానంద సరస్వతి 2012లో సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ప్రభుత్వాలు దేవాల యాల నిర్వహణను తిరిగి హిందూ సమాజానికి అప్పగించాలని ఆ పిటిషన్‌లో కోరారు. ముఖ్యంగా తమిళనాడు, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాలకు సంబంధించిన చట్టాలను ఈ పిటిషన్‌లో సవాలు చేశారు. ప్రభుత్వాలకు నోటీసులు జారీ అయ్యాయి, వాటి సమాధానాలు కూడా కోర్టు రికార్డుల్లో చేరాయి. అనేకసార్లు విచారణకు తేదీలు నిర్ణయమైనా వివిధ కారణాలతో వాయిదా పడుతూ వచ్చింది.

చివరకు ఏప్రిల్ 2025లో ఈ కేసు సుప్రీంకోర్టు ముందుకు వచ్చింది. ప్రతివాదుల న్యాయవాదులు, వివిధ రాష్ట్రాల చట్టాలు వేర్వేరుగా ఉన్నందున ఒకే పిటిషన్‌లో వాటిని సవాలు చేయ లేమని వాదించారు. అందువల్ల ఈ పిటిషన్‌ను కొట్టివేసి, ఆయా రాష్ట్రాల్లో విడివిడిగా సవాలు చేసుకునే స్వేచ్ఛ ఇవ్వాలని కోరారు. సుప్రీంకోర్టు ఈ వాదనను అంగీకరించి, 13 సంవత్సరా లుగా పెండింగ్‌లో ఉన్న పిటిషన్‌ను కొట్టివేసింది. దీంతో పిటిష నర్లు సుప్రీంకోర్టులో పునర్విచారణ పిటిషన్ దాఖలు చేశారు. ఈ ప్రక్రియకు కొంత సమయం పట్టింది. విచారణ అనంతరం 2026 మే 18న ఇచ్చిన ఆదేశంలో సుప్రీంకోర్టు ఈ అంశాన్ని గుణదోషాల ఆధారంగా విచారించడం అవసరమని పేర్కొంది. 2025 ఏప్రిల్‌లో ఇచ్చిన పిటిషన్ కొట్టివేత ఆదేశాన్ని కోర్టు వెనక్కి తీసుకుంది.

ఇప్పుడు ఈ కేసు జూలై నెలలో విచారణకు రానుంది. హిం దువులు తమ దేవాలయాలను తామే నిర్వహించుకోవాలి, దేవా లయాలపై ప్రభుత్వ నియంత్రణ పూర్తిగా తొలగించబడాలి, హిందువుల ధనం హిందూ సమాజ ప్రయోజనాలకే వినియోగిం చబడాలి అనే లక్ష్యంతో ఈ పోరాటం కొనసాగుతోంది. దేవాల యాలు స్వతంత్రం ఐతే హిందూ సమాజంలో సంఘటితం, సాం స్కృతిక వైభవం, సంస్కార జీవనం మరింత బలపడుతుందని విశ్వాసం వ్యక్తమవుతోందని విశ్వహిందూ పరిషత్ కేంద్ర అధ్య క్షులు, సీనియర్ న్యాయవాది ఆలోక్ కుమార్ తెలిపారు. ■

# మీ రాశి




**మేషం** (అశ్వని 4 పాదాలు, భరణి 4 పాదాలు, కృత్తిక 1వ పాదం)

బంధుమిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆకస్మిక ధననష్టమేర్పడే అవకాశ ముంటుంది. స్థిరమైన నిర్ణయాలు తీసుకోలేకపోతారు. అధి కారులతో జాగ్రత్తగా మెలగుట మంచిది. అనవసర భయం ఆవహిస్తుంది. అపకీర్తి రాకుండా జాగ్రత్త పడుట మంచిది. స్వల్ప అనారోగ్య బాధలుంటాయి. ప్రయాణాల్లో వ్యయ, ప్రయా సలు తప్పవు. కలహాలకు దూరంగా ఉండుటకు ప్రయత్నిం చాలి. దూర వ్యక్తుల పరిచయం ఏర్పడుతుంది.




**వృషభం** (కృత్తిక 2,3,4 పాదాలు, రోహిణి 4 పాదాలు, మృగశిర 1,2 పాదాలు)

ధర్మకార్యాలు చేయుటయందు ఆసక్తి పెరుగుతుంది. దైవదర్శనం చేసుకుంటారు. కుటుంబసౌఖ్యముంటుంది. మానసికానం దాన్ని అనుభవిస్తారు. పేరుప్రతిష్ఠలు లభిస్తాయి. ఆకస్మిక ధనలాభముంటుంది. శుభవార్తలు వింటారు. శు భకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేర్చుకుంటారు. గతంలో వాయిదా వేయబడిన పనులు పూర్తవు తాయి. విందులు, వినో దాల్లో పాల్గొంటారు. వృత్తిరీత్యా అభివృద్ధిని సాధిస్తారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా నుంటాయి. కొన్ని జటిలమైన సమస్యలకు పరిష్కారం లభిస్తుంది.




**మిథునం**(మృగశిర 3,4 పాదాలు, ఆరుద్ర 4 పాదాలు, పునర్వసు 1,2,3 పాదాలు)

స్త్రీల మూలకంగా లాభాలుంటాయి. ప్రయత్నకార్యాలన్నింటిలో విజయం పొందు తారు. శుభవార్తలు వింటారు. ఆకస్మిక ధన లాభముంటుంది. కుటుంబం అంతా సౌఖ్యంగా ఉంటారు. అత్యంత సన్నిహితులను కలుస్తారు. విందులు, వినోదాల్లో పాల్గొంటారు. కోరుకునేది ఒకటైతే జరిగేది మరొకటవు తుంది. అనారోగ్య బాధలు స్వల్పంగా వున్నాయి. వేళ ప్రకారం భుజిం చుటకు ప్రాధాన్యమిస్తారు. చంచలంవల్ల కొన్ని ఇబ్బందు లెదురవుతాయి. మనోనిగ్రహానికి ప్రయత్నించాలి. పిల్లలపట్ల ఏమాత్రం అశ్రద్ధ పనికిరాదు. శుభవార్తలు వింటారు.



**కర్కాటకం** (పునర్వసు 4వ పాదం, పుష్యమి 4 పాదాలు, ఆశ్లేష 4 పాదాలు)

మానసికాందోళనతో కాలం గడుస్తుంది. ఆరోగ్యం విషయంలో శ్రద్ధ వహించక తప్పదు. ప్రయత్నకార్యాలు ఆలస్యంగా సఫల మవుతాయి. చెడుపనులకు దూరంగా నుండుట మంచిది. వృత్తి ఉద్యోగరంగాల్లో అభివృద్ధి ఉంటుంది. స్థిరాస్తులకు సంబం ధించిన విషయాల్లో జాగ్రత్త అవసరం. వృత్తిరీత్యా అనుకూల స్థానచలనం ఉంటుంది. ఆర్థిక ఇబ్బందులతో సతమతమవు తారు. పోట్లాటలకు దూరంగా నుండుట మంచిది. అనారోగ్య బాధలధిగమించుటకు ఔషధసేవ తప్పదు.



**సింహం** (మఖ 4 పాదాలు, పుబ్బ 4 పాదాలు, ఉత్తర 1వ పాదం)


ప్రయత్నం మేరకు స్వల్పలాభముం టుంది. వృథా ప్రయాణాలెక్కువ చేస్తారు. వ్యాపార రంగంలో లాభాయింటాయి. ఋణ ప్రయత్నాలు చేయవలసి వస్తుంది. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. బంధు, మిత్రుల సహకారం ఆలస్యంగా లభిస్తుంది. స్థిరాస్తులకు సంబంధించిన విషయాల్లో సమయస్ఫూర్తి అవసరం. నిరుత్సాహంగా కాలం గడుస్తుంది. అపకీర్తి వచ్చే అవకాశముం టుంది. ఇతరులకు అపకారం కలిగించే పనులకు దూరంగా నుండుట మంచిది. పరిశుభ్రతకు ప్రాధాన్యమిచ్చినచో అనారోగ్య బాధలుండవు. ఆరోగ్యం గూర్చి శ్రద్ధ వహించాలి.



**కన్య** (ఉత్తర 2,3,4 పాదాలు, హస్త 4 పాదాలు, చిత్త 1,2 పాదాలు)


ప్రయాణాల్లో వ్యయ ప్రయాసలు అధిక మవుతాయి. ఆకస్మిక ధననష్టమేర్పడకుండా జాగ్రత్త వహించుట మంచిది. అనారోగ్య బాధలు తొలగుటకు డబ్బు ఎక్కువ ఖర్చుచేస్తారు. తీర్థయాత్రకు ప్రయ త్నిస్తారు. దైవదర్శనం ఉంటుంది. స్త్రీలు మనోల్లాసాన్ని పొందుతారు. కుటుంబ పరిస్థితులు సంతృప్తికరంగా ఉం టాయి. ఆకస్మిక ధననష్టం కలిగే అవకాశం ఉంటుంది. వృధా ప్రయాణాలెక్కువ చేస్తారు. బంధు, మిత్రులతో కలహించుకో

కుండా జాగ్రత్తగా నుండుట మంచిది. వృత్తి, ఉద్యోగరంగాల్లో సహనం వహించక తప్పదు. సంతోషంగా కాలం గడుపుతారు. శుభవార్త వింటారు. తోటివారి ప్రశంసలందుకుందురు.




**తుల** (చిత్త 3,4 పాదాలు, స్వాతి 4 పాదాలు, విశాఖ 1,2,3 పాదాలు)

అనుకోకుండా కుటుంబంలో కలహాలేర్పడే అవకాశముంటుంది. అశుభవార్తలు వినాల్సి వస్తుంది. ఆకస్మిక ధననష్టం జరుగకుండా జాగ్రత్త పడుట మంచిది. మనస్తాపానికి గురి అవుతారు. ప్రయాణాల్లో అప్రమత్తత అవసరం. నూతనకార్యాలు వాయిదా వేసుకోక తప్పదు. ఇంతవరకు అనుభవించిన కష్టాలన్నీ క్రమేణ తొలగిపోతాయి. నూతన కార్యాలకు శ్రీకారం చుడతారు. కుటుంబసౌఖ్యం సంపూర్ణంగా వుంటుంది. బంధు, మిత్రులతో కలిసి సరదాగా కాలక్షేపం చేస్తారు. ఆకస్మిక ధనలాభముంటుంది. గొప్ప వ్యక్తిని కలుస్తారు.



**వృశ్చికం** (విశాఖ 4వ పాదం, అనూరాధ 4 పాదాలు, జ్యేష్ఠ 4 పాదాలు)

నూతనకార్యాలు ఆలస్యంగా ప్రారంభిస్తారు. అల్పభోజనం వల్ల అనారోగ్యాన్ని పొందుతారు. ఏదో ఒక విషయం మిమ్మల్ని మనస్తాపానికి గురిచేస్తుంది. వీలైనంతవరకు అసత్యానికి దూరంగా నుండుట మంచిది. అనవసర భయాందోళనలకు లోనవుతారు. ప్రయత్న కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. బంధు, మిత్రులతో విరోధమేర్పడే అవకాశాలుంటాయి. స్త్రీల మూలకంగా శతృబాధలనుభవిస్తారు. ఏదో ఒక విషయం మనస్తాపానికి గురి చేస్తుంది. పిల్లలపట్ల మిక్కిలి పట్టుదల పనికిరాదు. పగ సాధించు ప్రయత్నాన్ని వదిలివేయడం మంచిది.



**ధనుస్సు** (మూల 4 పాదాలు, పూర్వాషాఢ 4 పాదాలు, ఉత్తరాషాఢ 1వ పాదం)

రాజకీయ వ్యవహారాల్లో దిగ్విజయాన్ని పొందుతారు. ప్రయత్న కార్యాలన్నీ సంపూర్ణంగా ఫలిస్తాయి. శుభకార్య ప్రయత్నాలు సులభంగా నెరవేరతాయి. సంపూర్ణ ఆరోగ్యవంతులుగా నుంటారు. ఇతరులకు ఉపకరించు పనులు చేపడతారు. గౌరవమర్యాదలు లభిస్తాయి. శుభవార్తలు వింటారు. అపకీర్తి రాకుండా జాగ్రత్తపడుట మంచిది. మనోల్లాసాన్ని పొందుతారు. సోద రులతో వైరమేర్పడకుండా మెలగాలి. తలచిన కార్యాలకు ఆటంకాలెదురవుతాయి. ఆర్థిక ఇబ్బందులు ఆలస్యంగా తొలగిపోతాయి. నూతన వ్యక్తులజోలికి వెళ్లరాదు.




**మకరం** (ఉత్తరాషాఢ 2,3,4 పాదాలు, శ్రవణం 4 పాదాలు, ధనిష్ఠ 1,2 పాదాలు)

కుటుంబపరిస్థితులు సంతృప్తికరంగా ఉంటాయి. సహనం వహించుట అన్నివిధాలా మేలు. బంధు, మిత్రులతో విరోధమేర్పడకుండా జాగ్రత్తపడుట మంచిది. అనవసర ధనవ్యయంతో ఋణప్రయత్నాలు చేయాల్సివస్తుంది. అనారోగ్య బాధలకు ఔషధసేవ అవసరం. తలచిన కార్యాలన్నీ విజయవంతంగా పూర్తి చేసుకోగలుగుతారు. బంధు, మిత్రుల మర్యాద మన్ననలను పొందుతారు. అనారోగ్యబాధలుండవు. సహ ఉద్యోగులకు సహకరించే అవకాశం లభిస్తుంది. మీ ఆలోచనలు ప్రణాళికాబద్ధంగా ఉంటాయి. అనుకూల పరిస్థితులేర్పడతాయి. గొప్ప వారి పరిచయం ఏర్పడుతుంది.



**కుంభం** (ధనిష్ఠ 3,4 పాదాలు, శతభిషం 4 పాదాలు, పూర్వాభాద్ర 3 పాదాలు)

కుటుంబకలహాలు దూరమవుతాయి. ప్రయత్నకార్యాలకు ఆటంకాలెదురవుతాయి. వృథా ప్రయాణాలవల్ల అలసట చెందుతారు. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది. అందరితో స్నేహంగా నుండుటకు ప్రయత్నించాలి. ఆర్థిక ఇబ్బందులు స్వల్పంగా వుంటాయి. వ్యవసాయ రంగంలోని వారికి లాభదాయకంగా ఉంటుంది. తొందరపాటువల్ల ప్రయత్న కార్యాలు చెడిపోతాయి. చెడును కోరేవారికి దూరంగా నుండుట మంచిది. ఆకస్మిక భయము, ఆందోళన ఆవహిస్తాయి. శారీరకంగా బలహీన మేర్పడుతుంది. కుటుంబ కలహాలు దూరమవుతాయి. చెడు పనులకు దూరంగా వుండుట మంచిది.



**మీనం** (పూర్వాభాద్ర 4వ పాదం, ఉత్తరాభాద్ర 4 పాదాలు, రేవతి 4 పాదాలు)

ఆకస్మిక ధననష్టం పట్ల జాగ్రత్త అవసరం. కొన్ని ముఖ్యమైన కార్యక్రమాలు వాయిదా వేసుకోవాల్సి వస్తుంది. స్వల్ప అనారోగ్యబాధలుంటాయి. వృధాప్రయాణాలు చేస్తారు. స్థానచలన సూచనలున్నాయి. సన్నిహితులతో విరోధమేర్పడకుండా మెలగుట మంచిది. వ్యాపారంలో విశేష లాభాన్ని ఆర్జిస్తారు. మంచివారితో స్నేహం చేస్తారు. అంతటా సుఖమే లభిస్తుంది. ఆకస్మిక ధనలాభముంటుంది. బంధు, మిత్రుల సహాయ సహకారాలు లభిస్తాయి. ఒక ముఖ్యమైన సమాచారాన్ని సేకరిస్తారు. నూతన వస్తు, ఆభరణాలను కొనుగోలు చేస్తారు.

- గౌరీభట్ల రామకృష్ణ శర్మ

## పదసంపద-256

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | | ✡ | 4 | 5 | | 6 |
| 7 | | | ✡ | 8 | ✡ | | ✡ | |
| 9 | | ✡ | 10 | | | ✡ | 11 | |
| | ✡ | 12 | | | ✡ | 13 | ✡ | |
| ✡ | 14 | | | ✡ | 15 | | | ✡ |
| 16 | ✡ | | ✡ | 17 | | | ✡ | 18 |
| 19 | 20 | ✡ | 21 | | | ✡ | 22 | |
| 23 | | 24 | ✡ | | ✡ | 25 | | |
| 26 | | | | ✡ | 27 | | | |

# ఆధారాలు

**అడ్డం**

1. ఎడబాటును సహించని పక్షి, ఒకరాగం (4)
4. రాముడు పుట్టిన నక్షత్రం (4)
7. సుకుమారి నారి (3)
9. భారతతో మలిభాగం (2)
10. వైభవం (3)
11. హోమంలో ఉపయోగించే దర్భతో చేసే గరిట లాంటిది (2)
12. మరచిపోము, దండలో పూలతో పాటు అల్లేది (3)
14. వెంట్రుకలు (3)
15. సంస్థ మరోలా (3)
17. సమానత్వం సంక్షిప్తంగా (3)
19. అట్నుంచి ఆలాగునలో కొంత (2)
21. ఉగ్ర మధ్య ఇంకొక అక్షరంతో తీవ్రమైన (3)
22. వచ్చి కలియు (2)
23. ఇష్టం కలిగిన (3)
25. తెలిసిన, జ్ఞానం (3)
26. ఈ సంవత్సరం (4)
27. ఇతరులకు వశం కావడం, లీనమవడం (4)

**నిలువు**

1. ఎడబాయని జంటగా తిరిగే పక్షి (4)
2. క్రమత్వము (3)
3. సుగ్రీవ సహోదరుడు (2)
5. ప్రవహించేది (2)
6. హనుమంతుని భార్య అంటారు (4)
8. పుట్టడం, జరిగేది (3)
10. పువ్వులు (3)
12. ప్రేమలోపడు (3)
13. మితము కాని (3)
15. సంపూర్ణ మైన (3)
16. రాగాన్ని ఆలపించడం చెల్లాచెదురైంది(4)
17. సభ, సమావేశం (3)
18. తలక్రిందులుగా శివుడు (4)
20. సహాయంగా ఉండడం, వికలాంగుల ఫించను పేరు (3)
22. సమీపము (3)
24. భక్తునికుండేది తలక్రిందులైంది (2)
25. చేప కొరకు గాలానికితగిలించేది. (2)

**పద సంపాదకులు : ఎం. దత్తాత్రేయశర్మ**

**పద సంపద సమాధానాలు**

పేరు ____________

విలాసం ____________

____________

పిన్ ____________ ఫోన్ ____________

పద సంపద సమాధానాలను ఈ నెల 15 తేదీలోగా మా చిరునామాకు పంపాలి.
**దర్శనమ్** ఆధ్యాత్మిక వార్తా మాసపత్రిక
ఇం.నెం. 29-105/4/1, న్యూ విద్యానగర్, నేరేడ్‌మెట్, సికింద్రాబాద్-56
మీ అభిప్రాయాలను baludarshanam@gmail.comకు పంపగలరు.

### పదసంపద-255 సమాధానాలు

| | | | | | | | | |
|---|---|---|---|---|---|---|---|---|
| 1 ప | రీ | 2 క్ష | ✡ | 3 వి | 4 క | 5 ట | క | 6 వి |
| ధ్మ | ✡ | 7 మా | 8 తా | ✡ | 9 రా | మా | ✡ | రా |
| 10 నా | డి | ✡ | 11 మ | 12 రా | ళ | ✡ | 13 వ | ట |
| భా | ✡ | 14 వి | రా | గి | ✡ | 15 క | ల | రా |
| ✡ | 16 అ | న | కు | ✡ | 17 బా | ల | రా | జు |
| 18 అ | నం | త | ✡ | 19 చే | ల | ✡ | జు | ✡ |
| 20 మ | గ | ✡ | 21 కు | వ | ల | 22 య | ✡ | 23 మా |
| లి | ✡ | 24 పా | లు | ✡ | 25 కు | ము | 26 ది | ని |
| 27 న | క్ష | త్ర | కు | డు | ✡ | 28 నా | వి | క |

### మే నెల విజేతలు

**గుడి చంద్రశేఖర్**
పెద్దశంకరంపేట్, మెదక్ జిల్లా

**కాశీభట్ల మంజులాదత్తా**
చందానగర్, హైదరాబాద్

**వనమాల రామలింగాచారి**
ప్రశాంత్‌నగర్, యాదగిరిగుట్ట

**గుళ్లపల్లి ఉదయ కుమార్**
విజయవాడ

**రాయపెద్ది అప్పాశేషశాస్త్రి**
శ్రీనివాస నగర్, ఆదోని

**కీసర ఇషస్వీశర్మ**
మిల్టన్, కెనడా

Edited Printed, Published and Owned by Marumamula Rukmini, Printed at Capital Graphics, 118 Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Published at 601, Chenoy Trade Centre, Parklane, Secunderabad-500003, Editor: Marumamula Rukmini.

శ్రీరస్తు! జయగురుదత్త శుభమస్తు!! అవిఘ్నమస్తు!!!

# ప్రథమ సాహస్ర సర్వపృష్ఠ మహాగ్నిచయన యాగాహ్వాన పత్రిక

**శ్రీ యజ్ఞదత్తాత్రేయ క్షేత్రం, జుజ్జూరు, ఎన్.టి.ఆర్. జిల్లా, ఆంధ్రప్రదేశ్ - 521 181**

**(జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ 18-6-2026 నుండి జ్యేష్ఠ శుద్ధ పౌర్ణమి 29-06-2026 వరకు)**

శ్లో ॥ కాణ్డద్వయోపపాద్యాయ కర్మబ్రహ్మ స్వరూపిణే । స్వర్గాపవర్గ రూపాయ యజ్ఞేశాయ నమోనమః
దత్తాత్రేయ హరేకృష్ణ ఉన్మత్తానంద దాయక । దిగంబరమునే బాల పిశాచ జ్ఞాన సాగర.

"యజ్ఞా: కళ్యాణ హేతవ:" భారతీయ సనాతన ధర్మం సమస్త మానవాళి శ్రేయస్సు కోరుకుంటుంది. దానికి మూలము వేదము, వేదమందు చెప్పబడినటువంటి యజ్ఞము.

"వేదో నిత్య మధీయతామ్ । తదుదితం కర్మ స్వనుష్ఠీయతామ్॥" వేదనాదము ఎల్లప్పుడూ ప్రతిధ్వనిస్తూ ఉండాలి. అందు చెప్పబడినటువంటి యజ్ఞము ప్రతి చోట, ఎల్లప్పుడూ జరుగుతూ ఉండాలి."సర్వోవైరుద్ర:" తస్మైరుద్రాయనమోఅస్తు" రుద్రుడు అను పేరుతో వ్యాపింపబడి, సర్వజీవుల శరీరముల యందు ప్రాణస్వరూపుడై ఉన్నతన స్వతంత్రశక్తిచేత సర్వప్రాణులను నడిపించుచున్న, సర్వఆత్మలను అధిష్ఠించియున్న ఆపరమాత్మకు నమస్కరించుచున్నాను అనిమహాగ్ని చయన ప్రకరణము ప్రస్తుతించుచున్నది. "సాహస్రంచిన్వీతప్రథమంచిన్వాన:" గరుడచితి/ శ్యేనచితి 1000మంత్రములతో అనేక రూపములు కల ఇష్టకలతో నిర్మితమవుతుంది.

ఈవిధముగా గరుడచితి ఆవిర్భవించిన పిదప యజమాని మరియు సర్త్వులు పురుషసూక్త మంత్రములచే పరమాత్మను ధ్యానించుచున్నారు. బ్రహ్మ, విష్ణు, మహేశ్వరుల స్వరూపమను ఆవిష్కరించుట ద్వారా ఈవేదిక "దత్తాత్రేయస్వరూప" మగుచున్నది. సగుణ, నిర్గుణఆరాధనకు ఈవేదిక ఆధారభూతమగుచున్నది. ఇందు అగ్నిని ప్రతిష్ఠింపజేసి, సోమరసమును, మిగిలిన హవిస్సులతో నిర్దేశింపబడిన దేవతలను, ఋగ్యజుస్సామలతో సంతుష్టపరచి ఆస్తికులందరకునూ కళ్యాణ హేతువగుచున్నది. ఇటువంటి మహిమాన్వితమైన **"ప్రథమ సాహస్రాగ్నియుక్త సర్వస్తోమ సర్వపృష్ఠ మహాగ్నిచయనము"** ను మాదంపతులచే పరాభవనామ సంవత్సర జ్యేష్ఠ శుద్ధ చతుర్థీ గురువారం (18-06-26) ప్రభృతి పౌర్ణమి సోమవారం (29-06-26) పర్యంతం శ్రీయజ్ఞ దత్తాత్రేయస్వామి వారిసన్నిధి, జుజ్జూరు గ్రామమునందు జరుపుటకు జగద్గురువుల అశీస్సులతో, దైవజ్ఞులచే సంకల్పబడి అత్యంతశుభముగా నున్నది.

యజ్ఞము పరమాత్మ స్వరూపము, ఇటువంటి యజ్ఞములను దర్శించుట, ప్రోత్సహించుట, ఆయా మంత్రములను, సామగానమును వినుటద్వారా పరమాత్ముని విశ్వరూపదర్శన ఫలము నిశ్చయముగా కలుగును. ఈ యజ్ఞములో సమర్పింపబడు హవిస్సుల కొరకు, బ్రాహ్మణోత్తములకు సమర్పింపవలసిన దక్షిణల కొరకునూ, అన్నసంతర్పణ మరియు ఇతరసంభారముల కొరకునూ అర్హులైనవారి నుండి ద్రవ్య సముపార్జనచేసి (యాగభిక్ష) మాత్రమే యజ్ఞము నిర్వహించవలెనని శృతివాక్యము. కావున ఆస్తికమహాశయులెల్లరూ ఈసదవకాశమును వినియోగించుకొని ఇతోధికముగా సహకరించి ఈక్రతువును అత్యంతవైభవముగా జరుగుటకు సహకరించవలసినదిగా మా ప్రార్థన.

భవదీయులు

**మద్దూరి వేంకటపూర్ణకుటుంబ**
**యజ్ఞనారాయణ షోడశ్యత్యగ్నిష్టోమ**
**సనాచికేతకారకోక్థ్య ఆప్తవాజపేయ బృహస్పతి**
**సవనాచికేత అతిరాత్రనాచికేత అప్తోర్యామయజ్వ**
**ఉమామహేశ్వరీసోమపీథినీ**

**Phone: Google / Phone Pay**
**98490 07481 / 6305092997**
**Union Bank Of India, Jujjuru**
**A/C: 243310100054804; IFSC: UBIN0824330**
**ICICI Bank, Khairatabad**
**A/C : 000801003679: IFSC : ICIC0000008**

## కార్యక్రమ వివరములు

| | |
|---|---|
| 18-6-2026 గురువారము | మహాగ్నిచయన సంకల్పము, త్రైధాతవీయ, వాయవ్య యాగము, యజ్ఞదీక్ష |
| 20-6-2026 శనివారము | దీక్షలు, సాయంత్రం- యాగశాలా ప్రవేశం |
| 21-6-2026 ఆదివారము | ప్రాయణీయ, గార్హపత్య చితి, ప్రవర్గ్యలు, సుబ్రహ్మణ్యాహ్వానము |
| 26-6-2026 శుక్రవారము | ప్రవర్గ్యలు, అగ్నీషోమీయ యాగము, అభిషేకము |
| 27-06-2026 శనివారము | మహారాత్రము, అభిషవము, ఆగ్నేయ యాగము, సవనము, దక్షిణాకాలము, సౌమ్య చెరువు, షోడశి ఉక్థులు, రాత్రి పర్యాయములు, ఆశ్విన శస్త్రము |
| 28-6-2026 ఆదివారము | శేష సుత్య, యజ్ఞపుచ్ఛము, ఉదయనీయ, ఆమీక్ష, ఉదవసానీయేష్టి. |
| 29-6-2026 సోమవారము | సౌత్రామణి, ఆమిక్ష ఇష్టి, మహదాశీర్వచనము. |




KSHETRA


# మైసూరు దత్తపీఠంలో అంగరంగ వైభవంగా శ్రీ గణపతి అప్పాజీ 84వ జన్మదినవేడుకలు

కర్ణాటకలోని సాంస్కృతిక రాజధాని మైసూరులో కొలువై ఉన్న శ్రీ అవధూత దత్తపీఠం ఆధ్యాత్మిక శోభతో విలసిల్లింది. మే 27, 2026 (అధిక జ్యేష్ఠ శుద్ధ ఏకాదశి) పర్వదినాన్ని పురస్కరించుకుని, ప్రపంచవ్యాప్తంగా ఉన్న భక్తులు ఆత్మీయంగా 'అప్పాజీ' అని పిలుచుకునే పరమ పూజ్య శ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారి 84వ జన్మదిన వేడుకలు అత్యంత కన్నుల పండువగా జరిగాయి. భక్తి, నాదం, మరియు సనాతన ధర్మ పరిరక్షకులను గౌరవించే ఒక అద్భుత వేదికగా నిలిచాయి.

**ప్రత్యక్ష పాదపూజ :** ఉత్సవాలలో భాగంగా, వేకువజామున పవిత్రమైన వాతావరణంలో పరమపూజ్యశ్రీ గణపతి సచ్చిదానంద స్వామీజీ వారికి భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో విశేషమైన 'ప్రత్యక్ష పాదపూజ' నిర్వహించారు. తమ ప్రియతమ గురువుకు పాదపూజ సమర్పించుకుని అశేష భక్తజనం తరించారు.

**చైతన్య అర్చన - దత్తపీఠ పురస్కారాల ప్రదానం**

శ్రీ స్వామీజీ జన్మదిన వేడుకలలో అత్యంత ప్రధానమైన ఘట్టం సనాతన ధర్మాన్ని, వేద శాస్త్రాలను, కళలను విశ్వవ్యాప్తం చేస్తున్న ఉద్దండ పండితులను 'చైతన్య అర్చన' పేరిట సత్కరించడం. ఈ ప్రధాన సభలో శ్రీ స్వామీజీ స్వయంగా పలువురు మహనీయులకు దత్తపీఠం ప్రతిష్టాత్మక బిరుదులను, పురస్కారాలను ప్రదానం చేసి ఘనంగా సత్కరించారు.

**పురస్కార గ్రహీతల వివరాలు:**

**వేదనిధి:** శ్రీ వి. జంబునాథ ఘనపాఠి, **శాస్త్రనిధి:** శ్రీ కుప్పా విశ్వనాథ శర్మ

**నాదనిధి:** విద్వాన్ సురేష్ వైద్యనాథన్, **ప్రవచన చక్రవర్తి:** శ్రీ సామవేదం షణ్ముఖ శర్మ

**ధర్మబంధు:** శ్రీ రవీందర్ పండిత, **సస్యబంధు:** శ్రీమతి అనుపమ వేదాచల

పురస్కారాలు అందుకున్న మహనీయుల సేవలను స్వామీజీ ఈ సందర్భంగా వేనోళ్ల కొనియాడారు.

**గరుడ వాహన ఉత్సవం మరియు సాంస్కృతిక వైభవం**

దత్తపీఠ ప్రాంగణంలో కొలువై ఉన్న శ్రీ దత్త వెంకటేశ్వర స్వామి వారికి సాయంత్రం అత్యంత వైభవంగా 'గరుడ వాహన ఉత్సవం' నిర్వహించారు. వేద మంత్రోచ్ఛారణలు, మంగళ వాయిద్యాల నడుమ జరిగిన ఈ ఉత్సవం భక్తులకు నేత్రానందాన్ని కలిగించింది.

అనంతరం జరిగిన సాంస్కృతిక కార్యక్రమాలలో 'అన్నమయ్య కీర్తనల నృత్యాంజలి' అందరినీ విశేషంగా ఆకట్టుకుంది. నృత్యరంజని స్కూల్ ఆఫ్ భరతనాట్యం డైరెక్టర్ శ్రీమతి రంజితా వివిన్ అద్భుతమైన భావన, రూపకల్పన మరియు దర్శకత్వంలో ప్రదర్శించబడిన ఈ నృత్యాంజలి భక్తులను భక్తి పారవశ్యంలో తేలియాడేలా చేసింది.గురుభక్తికి, ధర్మ రక్షణకు ప్రతీకగా నిలిచిన శ్రీ అప్పాజీ 84వ జన్మదిన వేడుకలు దత్తపీఠ చరిత్రలో మరొక సువర్ణ ఘట్టంగా మిగిలిపోయాయి. పండితుల సత్కారం, పాదపూజ, మరియు నృత్య నీరాజనాల మధ్య జరిగిన ఈ ఉత్సవం ప్రతి భక్తుడి హృదయంలో ఆధ్యాత్మిక జ్యోతిని వెలిగించింది.

RNI Regd No. APTEL/2005/16209
Date of Publication : 25th of Every Month
Date of Posting : 28th & 29th of Every Month

DARSHANAM
JUNE - 2026

Postal Regd.No. HQ/SD/508/2025-2027
WPP NO:PMG/TS/HQR/SC-01/WPP/2025-2027
Licensed to Post Without Prepayment
Posting at B.P.C - IV Patrika Channel,Nampally,Hyderabad-01



PM Hoist Double Cage, Hyderabad



PM Hoist with 12mts Horizontal rebar carrier, Vijayawada


Curved Hoist Bangladesh



Multi Functional Hoist, Nagpur

# CMAC

*Mechanisation & Automation in Construction*

ISO 9001:2015 CERTIFIED COMPANY
AND
CE CERTIFIED COMPANY

## Equipments & Solutions for Infrastructure fraternity. Residential, Commercial Infrastructure, Power, Steel, Cement & Industrial Infra


Innovation with safety & Sustainability
Export them as Made in India


MFH - CMAC Rambo with Rebar Carrier, Delhi



Chimney SRP, Mumbai


Pre Cast Panel Movement SRP, Hyd.


Anji Khad Cable Stayed Bridge Project,
Dist.: Reasi, Jammu



PMH at Pump House, Kaleshwaram



Bridge Special SRP at Durgam Cheruvu,
Cable Stayed Bridge, Hyd.

**ConMechAuto Consultants India Pvt Ltd.,**
**Head Office** : # 1-3-183/40/19, 2nd Floor, SBI Colony,
Gandhi Nagar, Hyderabad - 500 080, India.
Tel. No.: + 91- 40 - 2754 1464

**Factories :**
Phase 2, Phase 5, IDA Cherlapally,
Hyderabad - 500 051

For Further Details:
**CONTACT : 9393 111 464**
**Email : sales@cmac.co.in**
**www.cmac.co.in**

*If Undedelivered please return to:*
DARSHANAM Devotional Magazine,Srirama Siddhanthi Bhavanam, H.No.29-105/4/1
Rythu Bazar Road, New Vidyanagar Colony, Neredmet, Secunderabad, 500056
Mobile 7013093123, 9441015469 *e mail: darshanameditordesk@gmail.com*